# చతుస్సూత్రి తరువాత.....

# ప్రథమాధ్యాయము- ప్రథమ పాదం

## *విషయసూచిక:*

### Contents


1 . ఈక్షత్యధికరణము: ........................................ 10

2 . ఆనందమయాధికరణము: ........................................ 21

3 . అన్తరధికరణమ్: ........................................ 47

4 . ఆకాశాధికరణమ్: ........................................ 61

5 . ప్రాణాధికరణము: ........................................ 71

**6 .** జ్యోతిరధికరణము: ........................................ 76

**7 .** ఇంద్ర ప్రాణాధికరణము: ........................................ 93

# ప్రథమాధ్యాయము- ప్రథమ పాదం

"....యతిరాజమ్ భజ యతిరాజమ్ భజ యతిరాజమ్ భవ భీరో...

అంటూ పాట మంద్ర స్థాయిలో శ్రావ్యంగా వినిపిస్తూంటే మామయ్య గారింట్లో అడుగు పెట్టేము, అమ్మా, నాన్నగారూ, నేనూను.

**మామయ్య:** రండి రండి ఈమధ్య మనం కలుసు కోవడమే అరుదయి పోతోంది, ఏమిటి విశేషాలు

**అమ్మ:** మామయ్యా! (మామయ్యను అమ్మ కూడా మామయ్య అనే పిలుస్తుంది, అరవ వాళ్ళకి అఅవై వావులు కదా) మా వాడికి ఈ మధ్య కొత్త కొత్త ప్రశ్నలు వస్తున్నాయి, నేను అప్పుడప్పుడు సమాధానాలు చెప్పడానికి ప్రయత్నిస్తుండగా ఆమధ్య ఏదో సందర్భంలో భగవద్రామానుజుల శ్రీభాష్యం ఊసు కూడా వచ్చింది, అప్పుడనిపించింది మీరు ఆ శ్రీభాష్యం ముఖ్యమైన విషయాలను మా వాడికి అర్థం అయేటట్లు సరళంగా చెప్పగలరేమోనని, మా మామగారు బ్రతికి ఉన్నప్పుడు మాకు నేర్చుకుందికి అవలేదు, పాపం ఆయన చెప్పేవారు దీపం ఉండగానే ఇల్లు చక్క పెట్టుకున్నట్లు నేను బ్రతికి ఉండగానే నాలుగు విషయాలూ నేర్చుకోండి అని, కాని, ఆ అదృష్టం కలుగలేదు, ఇప్పుడైనా మీ దగ్గర ఓ నాలుగు మంచి విషయాలు నేర్చు కుందామని మిమ్మలను ప్రార్థిద్దామని వచ్చేము.

**మామయ్య:** ఎంత మాటమ్మా, ఆ మహానుభావుల వలననే కదా, మన కుటుంబాలలో మన ముఖ్యంగా నాలాంటి వాళ్ళకి నాలుగు సంస్కృతం ముక్కలు వచ్చినది, అలాగే చెప్పుకుందాం,

**అమ్మ:** కాని మామయ్యా, మాకు పెద్ద సంస్కృతం జ్ఞానం లేదు, శాస్త్ర పరిచయమూ అంతంత మాత్రమే, నేను ఆడుదానిని అవడం వలన శాస్త్ర విషయాలు కాలక్షేప రూపంగా సేవించడం కూడా అభ్యంతరమేమో, అందుచేత

మీ దగ్గర చనవుతో అడుగుతున్నాను, ఈ చదువుకోవడం కాలక్షేప రూపంగా కాకుండా మాటలాడుకున్నట్లే మీ దగ్గర నేర్చుకోవచ్చా మనకు సమయమున్నప్పుడు, అలాగయితే విషయం తెలుసుకోవడం మాలాంటి వాళ్ళకి సులభమవుతుంది.

**మామయ్య:** విషయం మీద, విషయం చెబుతున్న వారిమీద విషయం లో చెప్పబడుతున్న పరమాత్మ మీద, విషయాన్ని అనుగ్రహించిన భగవద్రామానుజుల మీద భక్తి శ్రద్ధలకు లోపం లేకపోతే పరవా లేదమ్మా, శ్రీభాష్యం ప్రారంభంలో భగవద్రామానుజులే అన్నారు, "సుమనసః భౌమాః పిబంతు అన్వహమ్" అని. అంటే మంచి మనస్సు ఉన్న భూమి మీద వాళ్ళందరూ ఈ అమృతాన్ని ఆస్వాదించి సంసార విముక్తులు కండి అని. అంటే పాడు మనస్సు, పక్షపాత రహిత బుద్ధి ఉంటే చాలు అని. మనం ఏ రూపంగా సేవించినా తండ్రి గాడి విషయం కృపామూర్తులైన భగవద్రామానుజులు మనకోసం అందిచ్చినది, మీ సదుపాయాన్ని బట్టే చదువుకుందాం. ఇంతకీ..

**అమ్మ:** నేను ఇంతకుముందు విని ఉండడం వలన శ్రీభాష్యం లో మొదటి నాలుగు సూత్రాల సారాంశం మావాడితో కలసి మరొక సారి నేర్చుకొనే ప్రయత్నం చేసేం. అప్పుడే అనిపించింది, మీ దగ్గర నేర్చుకుంటే బాగుంటుంది అని.

మామయ్య: అలాగే, ఎక్కడ ఆపేరో అక్కడి నుండే మొదలుపెడదాం, ముందు మనకందరకూ ప్రాతః స్మరణీయులైన మీ మామగారిని, భగవద్రామానుజులనూ, మీకూ మాకూ కుల దైవమైన శ్రీని వాసుడినీ, బ్రహ్మ సూత్ర కర్త వ్యాసుల వారినీ స్మరించుకొని మనం చర్చలోకి వెడదాం.

వాధూలాన్వయ భాష్యకార తనయమ్ శ్రీరాఘవార్యాశ్రితమ్

శ్రీరామానుజ దేశిక ద్వయ కృపాలబ్ధాగమాంతద్వయమ్

న్యాయే వ్యాకరణేప్యలంకృతిలయే వేదాంతయుగ్మే సమమ్

వేంకట రామదేశిక మహమ్ విద్వాంసమార్యమ్ భజే

యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ

వ్యామోహతః తదితరాణి తృణాయమేనే

అస్మద్గురోః భగవతోస్య గుణైక సింధోః

రామానుజస్య చరణౌ శరణమ్ ప్రపద్యే

అఖిలభువన జన్మ స్థేమ భంగాది లీలే

వినత వివిధ వ్రాత రక్షైక దీక్షే

శ్రుతి శిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే

భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తి రూపా

పారాశర్య వచస్సుధామ్ ఉపనిషత్ దుగ్ధాబ్ధి మధ్యోధృతామ్

సంసారాగ్ని విదీపన వ్యపగత ప్రాణాత్మ సంజీవనీమ్

పూర్వాచార్య సురక్షితామ్ బహుమతి వ్యాఘాత దూరస్థితామ్

ఆనీతాంతు నిజాక్షరైః సుమనసో భౌమాః పిబంతు అన్వహమ్

వ్యాసమ్ వశిష్టనప్తారమ్ శక్తేః పౌత్రమ్ అకల్మషమ్

**పరాశరాత్మజమ్ వందే శుక తాతమ్ తపోనిధిమ్.**

**లక్ష్మీ నాథ సమారంభామ్ నాథయామున మధ్యమామ్**

**అస్మదాచార్య పర్యంతామ్**

**వందే గురు పరంపరామ్**

**నాన్నగారు:** బావా, అసలు ఈ శ్రీభాష్యం బ్రహ్మ సూత్రాలకు భాష్యమనీ, సాక్షాత్తూ సరస్వతీ మాత ఈ గ్రంథాన్ని ఆమోదించడం వలన శ్రీభాష్యమని దీనికి పేరు వచ్చిందని అంటారు కదా, దీనిలో ఎన్ని సూత్రాలున్నాయి, అవి అన్నీ ఒక పద్ధతిలో ఉంటాయంటారు. ఆ వివరాలు కొంచెం చెబుతావా, గ్రంథం లోపలికి వెళ్ళేముందు.

**మామయ్య:** శ్రీభాష్యం మన విశిష్టాద్వైతానికి సర్వోత్తమమైన ప్రమాణ గ్రంథమని చెప్పవచ్చును. భగవద్రామానుజులు తాను ఎన్నో కష్టాలకోర్చి కాశ్మీర దేశంలో ఉన్న భగవద్బోధాయన వృత్తి సంపాదించి వృత్తి అంటే చిన్న సైజు వివరణ గ్రంథమనుకో, దానిని అనుసరిస్తూ, వ్యాస మహర్షి అందిచ్చిన బ్రహ్మ సూత్రాలకు ఆ రోజులలో వివిధ దర్శన కారులు చేసిన రకరకాలుగా ఉన్న వ్యాఖ్యానాలు సమన్వయించి సరిదిద్దుతూ రచించిన మహద్గ్రంథము. దీనిలో 545 సూత్రాలున్నాయి. వాటిని 156 అధికరణాలుగా విభజించేరు.

**నేను:** అధికరణమంటే ఏమిటి మామయ్యా, ఇలా 545 సూత్రాలూ, 156 అధికరణాలూ అని బాగా ఎలా గుర్తు పెట్టుకున్నారు మామయ్యా!

**మామయ్య:** ఈ బ్రహ్మ సూత్రాలు వేరు వేరు topics గురించి ఒక క్రమంలో చెబుతాయి. ఒక్కొక్క topic గురించి చెప్పేది ఒక్కొక్క అధికరణమన్న మాట. ఒక అధికరణంలో ఒక సూత్రం ఉండవచ్చును. లేదా ఆ topic

కి సంబంధించిన కొన్ని సూత్రాలు ఉండవచ్చును. ఈ సంఖ్యలు గుర్తు పెట్టుకోవడం మా తరం వాళ్ళకి పెద్ద కష్టం కాదు. ఎందుకంటే మా కాలం వాళ్ళకి కంఠస్థం చేయడం అలవాటే. కాని మీ కాలం వాళ్ళకి వేదాంత దేశికుల ఒక శ్లోక పాదం విను, సులభంగా గుర్తు ఉంటుంది. "**సౌత్రీ సంఖ్యా శుభాశీః అధికృత గణనా చిన్మయీ బ్రహ్మ కాండే**" అని.

ఇందులో శుభాశీః అన్నది 545 అంకెను గుర్తు చేస్తుంది, వాటి వాటి వర్గాలలో శ 5 వ అక్షరము, భ 4 వ అక్షరమూ కద. చిన్మయీ అన్నది 156 అంకెను చెబుతుంది, చ 1 వ అక్షరం, మ 5 వ అక్షరం, య 6 వ అక్షరం కదా.

**నేను:** బాగుంది. ఒక అధికరణంలో ఒక సూత్రం కూడా ఉండవచ్చునా,

**మామయ్య:** మీరు ఇంతకు ముందు నేర్చుకున్న "అథాతో బ్రహ్మ జిజ్ఞాసా" అన్న సూత్రాన్ని జిజ్ఞాసాధికరణము అంటారు. అంటే ఆ అధికరణానికి అదొక్కటే సూత్రం, అలాగే మిగిలిన మూడు సూత్రాలు కూడా ఒక్కొక్కటీ ఒక్కొక్క అధికరణం గా విభజించబడి ఉంది. కొన్ని కొన్ని అధికరణాలలో ఒకటి కంటే ఎక్కువ సూత్రాలూ ఉంటాయి.

**నాన్నగారు:** ఈ గ్రంథము 4 అధ్యాయాలు కదా, ఈ విభజనా విధానమేమిటి?

**మామయ్య:** అవును, మొదటి అధ్యాయాన్ని సమన్వయాధ్యాయమనీ, రెండవదాన్ని అవిరోధాధ్యాయమనీ, మూడోదాన్ని సాధనాధ్యాయమనీ, నాల్గవదాన్ని ఫలాధ్యాయమనీ వ్యవహారం.

**నాన్నగారు:** ఎందుకలా?

**మామయ్య:** బ్రహ్మ సూత్రాలంటే బ్రహ్మ ఎవరూ అన్నది ప్రతిపాదించి, దానిని పొందే సాధనం తెలియజేసి, దాని వలన కలిగే ఫలాన్ని తెలపాలి కదా. అందులో మొదటి అధ్యాయంలో వేదాంతాలలో జగత్కారణ వస్తువును తెలిపే వాక్యాలను సమన్వయించి చిదచిత్తుల కంటే విలక్షణమైన అంటే వేరయిన పరబ్రహ్మమే ఈ జగత్తుకి కారణము, ఈ చేతనాచేతనాలు కాదు అని తెలిపేది సమన్వయాధికరణము.

ఇందులో మొదటి పాదం బ్రహ్మానికి జగత్కారణత్వము లేకపోవడం లేదు అని స్థాపిస్తే, పరబ్రహ్మము కంటే వేఱయినదానికి జగత్కారణత్వము లేదని చెప్పేవి ఈ అధ్యాయంలో మిగిలిన మూడు పాదాలు. ఇందులో మీరు చదువుకున్న నాలుగు సూత్రాలలో చిదచిద్విలక్షణమైన పరబ్రహ్మమే లేదన్నదానిని ఖండించి జగత్కారణవస్తువైన పరబ్రహ్మము ప్రతిపాదించబడినది. తరువాత వచ్చే సూత్రాలలో పరబ్రహ్మ తప్ప మరి దేనికీ జగత్కారణత్వము కుదరదనీ వేదాంత వాక్యాలన్నీ అలాగే చెప్తాయనీ వివరిస్తారు. ఏయే అధికరణంలో ఎన్నెన్ని సూత్రాలున్నాయో తరువాత చూద్దాము.

**నేను:** మఱి ఱెండవ అధ్యాయం లోనో

**మామయ్య:** క్లుప్తంగా చెప్పాలంటే ఱెండవ అధ్యాయంలో పరబ్రహ్మ కారణత్వాన్ని చెప్పిన తరువాత జగత్తు యొక్క కార్యత్వాన్ని చెప్పి, ఈ విషయంలో మిగిలిన దర్శనాల మతాల వాదాలు ఎలా కుదరవో వివరిస్తారు. పరబ్రహ్మమే ఈ సమస్త జగత్కారణమన్న విషయంలో వివిధ శ్రుతులలో విరోధమేమీ లేదని స్థాపించడం వలన దీనిని అవిరోధ్యాయమని అంటారు.

తరువాత తృతీయ అధ్యాయంలో ఉపాసనా విధానాన్ని వివరిస్తూ, దానికి అనుగుణంగా ఇతర విషయ వైరాగ్యం కోసం జీవ దోషాలనూ, పరబ్రహ్మ గుణాలనూ, బ్రహ్మవిద్యకు అంగమైన కర్మలనూ ప్రస్తావిస్తారు.

**నేను:** మఱి నాల్గవ అధ్యాయం లోనో

**మామయ్య:** నాల్గవది, ఫలాధ్యాయం కదా, అంటే దీనిలో ఫలం వివరింపబడుతుంది. మన జన్మ, జన్మల కర్మ ఫలాలు ఎలా పోతాయో, పోయిన తరువాత జీవుడు ఈ స్థూల దేహాన్ని విడచి, అర్చిరాది మార్గంలో ప్రయాణించి పరబ్రహ్మాన్ని ఎలా చేరుకొని అనంతమైన ఆనందాన్ని అనుభవిస్తాడో, అలా పరబ్రహ్మాన్ని చేరిన జీవుడు మఱి తిరిగి వెనుకకు ఎలా రాడో **"అనావృత్తిః శబ్దాత్ అనావృత్తిః శబ్దాత్"** అనే చివరి సూత్రందాకా వివరిస్తారు. అనావృత్తిః అంటే మళ్ళీ ఈ జనన మరణ చక్రంలోకి రావడం లేదనే కదా అర్థం. ఈ రకంగా ఫలం వివరించబడినది కనుక దీనిని ఫలాధ్యాయం అంటారు. అంటే మొదటి నాలుగు అధికరణాలలో ఉపోద్ఘాతాన్ని, తరువాత 125 అధికరణాలలో బ్రహ్మ ప్రతిపాదనం, బ్రహ్మవిద్య, తరువాత 27 అధికరణాలలో బ్రహ్మ విద్యా ఫలం ....ఇలా 156 అధికరణాలలో మొత్తం బ్రహ్మ సూత్ర భాష్యం విభజించ బడినది.

అమ్మ: ధన్యులము మామయ్యా, చాలా విషయాలు చెప్పేరు. ఈ రోజుకు ఇక్కడితో ఆపుదాము. మళ్ళీ మరొకసారి సూత్రవివరాలలోకి వెళ్ళుదాము.

**నాన్నగారు, అమ్మ, నేను:** దాసోహమ్

**వస్తాము**

---

(మామయ్య గారింట్లో ప్రవేశిస్తూ)

**మేము: అడియేన్ దాసోహం,**

**మామయ్య:** దాసోహం రండి , కూర్చోండి, నిన్న శ్రీభాష్యాన్ని ఏ విధంగా విభజించుకొని అర్థం చేసుకోవాలో తెలుసుకుంటున్నాము కదా, ఇందులో నాలుగు అధ్యాయాలలో మొదటి ఱెండింటినీ కలిపి సిద్ధద్వికము అని అంటారు. పొంద వలసిన పరబ్రహ్మ విషయాన్ని ప్రతి పాదిస్తాయి కదా ఈ ఱెండు అధ్యాయాలూ. ఇందులో మొదటిది అన్ని శ్రుతి వాక్యాలూ పరబ్రహ్మాన్ని, ఆ పరబ్రహ్మ యొక్క జగత్కారణత్వాన్నీ, వ్యాపకత్వాన్నీ

ప్రతిపాదిస్తుంది. రెండవ అధ్యాయం ఇలా ప్రతిపాదించడం లో ఆ వాక్యాలలో పరస్పర విరోధం ఏమీ ఉండదని రెండవ అధ్యాయం చెప్పడం వలన దానిని అవిరోధాధ్యాయమని అంటారనీ అనుకున్నాము కదా. తరువాత రెండు అధ్యాయాలూ కలిపి సాధ్య ద్వికము అని అంటారు. వీటిలో సాధన, ఫలము కదా చెప్పబడినది. ఈ రోజునుండి "ఈక్షత్యధికరణము" తెలుసుకుందాము.

## 1 . ఈక్షత్యధికరణము:

**నేను:** అది సరే మామయ్యా, ఛాందోగ్యోపనిషత్ ఉపనిషత్తులో సద్విద్యా ప్రకరణంలో "సత్ ఏవ సోమ్య ఇదమ్ అగ్ర ఆసీత్" లాంటి వాక్యాలలోనూ, తైత్తిరీయ ఉపనిషత్తులో "యతోవా ఇమాని భూతాని జాయంతే ...." లాంటి వాక్యాలలోనూ చెప్పబడిన సత్, యత్ అంటే పరబ్రహ్మ అని చెప్పి అందువలన పరబ్రహ్మమే జగత్కారణ వస్తువు అని చెప్పింది అమ్మ. ఈ సత్, యత్ అంటే చిత్తు, అచిత్తు కాని పరబ్రహ్మమే అని ఎందుకు అనుకోవాలి. అది కూడా ఏదో అచిత్పదార్థమైనా అవవచ్చును కదా.

**మామయ్య:** అట్లా ఎందుకు అనుకుంటున్నావు?

**నేను:** ఈ కనబడుతున్న ప్రకృతి అంతా త్రిగుణాత్మకం కదా! మట్టి లోంచి మట్టి కుండ వస్తుంది తప్ప బంగారపు హారము రాదు కదా! అంటే చేయబడిన కార్యము గుణాలూ దాని కారణము యొక్క గుణాలూ ఒక్కలా ఉంటాయి. ఆ కారణ ద్రవ్యం అవస్థాంతరము పొందితే కార్యం అవుతుంది, అలాంటప్పుడు కారణంలో గుణాలకూ, కార్య పదార్థపు గుణాలకూ సామ్యత ఉంటుంది. అందువలన ఈ త్రిగుణాత్మక మైన జగత్తుకి కారణం కూడా త్రిగుణాత్మకమైన ప్రాకృతిక పదార్థమే అవాలి, త్రిగుణాతీతమైనది వేరుగా ఏదీ అవలేదు కదా. అమ్మ త్రిగుణాతీతమైన శుద్ధ సత్త్వమయమైన పరబ్రహ్మ ఆ సత్ అనీ, ఈ జగత్తుకంతటికీ కారణమనీ చెప్పింది అంత సబబుగా లేదనిపిస్తుంది. అంతే కాకుండా ఈ జగత్తంతా చేతనులకు భోగ్యమైనది, వికారాలు పొందేదీను. ఇలాంటి గుణాలు ఏమీ లేని కారణపదార్థము పరబ్రహ్మ అని చెప్పడం సమంజసం కాదని నా అభిప్రాయము.

**అమ్మ:** ఇలాగే మామయ్యా, వీడి వాదన, అంతా...

**మామయ్య:** అడుగనీయమ్మా, ఎలాంటి ప్రశ్నలకైనా భగవద్రామానుజులు మనకు సమాధానం ఇవ్వనే ఇచ్చేరు. రామం, నువ్వు చెప్పిన వాక్యాలలోనే "**తత్ ఐక్షత బహుస్యామ్ ప్రజాయేయ**" అని కూడా ఉందికదా, అంటే ఏమిటి?

**నేను:** అది చూచెను, అంటే సంకల్పించెను అనేకముగా అగుదును గాక!..అంటే ఆ సత్ అనేకముగా అగుటకు సంకల్పించినదని

**మామయ్య:** కదా, నువ్వు చెప్పినట్లు అచైతన్య పదార్థానికి సంకల్పించడం కుదరదు కదా, అందు చేత అచైతన్యమైన ప్రకృతి జగత్కారణం కాలేదు అని

"**ఈక్షతేః న అశబ్దమ్**" అనే సూత్రభాష్యంలో రామానుజులవారు వివరించేరు.

**నేను:** అంటే

**మామయ్య:**

## ఈక్షతేః న అశబ్దమ్ (1-1-5)

ఈక్షతేః : (జగత్కారణానికి) ఈక్షణము (సంకల్పము) చెప్పబడినందువలన

అశబ్దమ్: వేదముచే తెలుపబడని(ప్రకృతి)

న: (జగత్కారణము) కాదు

అంటే అర్థము "ఈక్ష ధాతు ప్రయోగం వలన సంకల్పించడమన్నది అచైతన్యమైన ప్రకృతికి కుదరదు కనుక ప్రకృతికి జగత్కారణత్వము చెప్పలేము" అని.

నేను: సంకల్పం అంటే

**మామయ్య:** "సంకల్పమ్ మానసమ్ కర్మ" అని మానసిక ఆలోచన, నిర్ణయమన్న మాట. ఇది ప్రకృతికి కుదరదు కదా! ఈక్ష అనే ధాతువుకు చూడడం అని కూడా అర్థం ఉన్నా "నాకొక వెయ్యి రూపాయలు ఇయ్యమని మీ నాన్నని నేను అడిగితే మీనాన్న చూస్తాను అంటే వెయ్యి రూపాయల నోటు పట్టుకొని చూస్తాను అని కాదు కదా, ఆలోచిస్తాననే కదా, అలాగే ఇక్కడ కూడా ఆలోచన అని తీసుకోవడం సమంజసం".

**నేను:** "తదైక్షత" అన్నప్పుడు అది సత్ నే చెబుతోందా?

**మామయ్య:** తత్ అన్నది సర్వనామం, అంటే అంతకుముందు దేనిని ఉద్దేశించి చెబుతున్నారో అదే ఈ సర్వనామం వలన తెలియబడుతోందన్న మాట. శ్వేతకేతు కథలో "సత్ ఏవ ఇదమగ్ర ఆసీత్" అని చెప్పి, తరువాత "తత్ ఐక్షత" అంటే అక్కడ తత్ అంటే సత్ యే కదా!

**నేను**: మఱి, కార్య పదార్థము లో గుణాలూ కారణ పదార్థం లో గుణాలూ ఒక్కలా ఉండవుకదా!

**మామయ్య:** పరబ్రహ్మ "సర్వజ్ఞుడు, సర్వ శక్తి మంతుడూ, పురషోత్తముడైన నారాయణుడూ, ఆయనే సత్ శబ్ద వాచ్యుడు, "పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ జ్ఞాన బలాక్రియాచ" అన్న శ్రుతి వాక్యము వలన ఈ పురుషోత్తమునికి అన్ని జ్ఞాన, క్రియ, బలాదులు స్వాభావికాలని తెలుస్తోంది. అట్లాగే "యః సర్వజ్ఞః సర్వవిత్ యస్య జ్ఞానమయమ్ తపః" లాంటి శ్రుతి వాక్యాలవలన ఆయన సర్వమును బాగుగా నెఱిగిన వాడు, సర్వప్రకారములును తెలిసిన వాడు జ్ఞానరూపమగు తపస్సు కలవాడు అని తెలుస్తోంది. "తపః ఆలోచనే" కనుక తపస్సు అంటే బాగుగా ఆలోచన చేయగలవాడు అని కదా, అలా ఆలోచన చేసి జగత్సృష్టి చేసేడన్న మాట. ఇంకా "యస్యావ్యక్తమ్ శరీరమ్ యస్యాక్షరమ్ శరీరమ్ యస్య మృత్యుః శరీరమ్ ఏష సర్వ భూతాంతరాత్మా" మొదలైన వాక్యాలవలన ఆయనకు ప్రకృతి, జీవుళ్ళు, మృత్యువు శరీరభూతాలని

తెలుస్తోంది. ఆయన సర్వభూతములకు అంతరాత్మగా కూడా ఉంటాడని తెలుస్తోంది. ముందు ముందు మనకు కార్య, కారణాలకు గుణసామ్యము లేకున్నా వాటికి కార్య, కారణ సంబంధము కుదురుతుందన్న విషయం దాని వివరాలు చూద్దాం. కాని మనకు ఇప్పుడు చెప్పిన శ్రుతి వాక్యాలవలన పరమ శక్తి మంతుడూ, సర్వాంతర్యామీ అయిన పరబ్రహ్మ వలననే జగత్కారణత్వము కుదురుతుందనీ, అచైతన్యమైన ప్రకృతి వలన కుదరదనీ తెలుస్తోంది కదా!

**నేను:** మామయ్యా, మీరు చెబుతున్నది ప్రకృతి అచేతనము కనుక "తదైక్షత" అన్నప్పుడు అచేతనానికి సంకల్పము చేయడము కుదరదని కదా, అక్కడ సంకల్పమన్న మాట లాక్షణికంగా అదే మాట వరుసకు "మీరు లేక ఇల్లు ఏడుస్తోంది" అన్నట్లు ఎందుకు తీసుకోకూడదూ, అక్కడ ఇంటికి చైతన్యము ఉందని కాదు కదా రామాయణం సుందరకాండలో "వర్షేణ బీజమ్ ప్రతి సంజహర్ష" అని వర్షము వలన బీజము సంతసించిందని అంటే బీజానికి చైతన్యం ఉందని కాదు కదా!

**మామయ్య:** ఇందుకే తరువాత సూత్రం "గౌణశ్చేత్ న ఆత్మ శబ్దాత్" అని చెబుతున్నారు.

**నేను:** అంటే

**మామయ్య:**

## గౌణశ్చేత్ న ఆత్మ శబ్దాత్ ( 1-1-6)

గౌణశ్చేత్: (ఈ ఈక్షితృత్వము ) గౌణమని అంటే

న: అట్లు కాదు

ఆత్మ శబ్దాత్: శ్రుతి యందు ఆత్మ శబ్ద ప్రయోగం ఉండడం వలన

నేను: అంటే

మామయ్య: నువ్వు చెప్పినట్లు ఇక్కడ సంకల్పం అన్న పదం ఊరికే గౌణంగా అదే లాక్షణిక ప్రయోగంలా వాడేరా అంటే అలా కాదయ్యా, ఎందుకంటే ఈ సత్ పదార్థాన్నే ఉద్దేశిస్తూ "**ఐతదాత్మ్యమ్ ఇదమ్ సర్వమ్ తత్సత్యమ్ స ఆత్మా**" అని " ఈ కనపడే జగత్తంతా ఆత్మ సంబంధమైనది, ఆ ఆత్మనే సత్ అని అంటారు ఎలాగంటే ఆ పరబ్రహ్మ ఈ చేతనాచేతన జగత్తునకు ఆత్మ "అని చెబుతోంది శ్రుతి. నువ్వు చెప్పినట్లు ప్రకృతే జగత్కారణం అంటే ఇలాంటి శ్రుతి వాక్యాలు కుదరవు కదా. అంతే కాకుండా "**అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి**" మొదలైన శ్రుతి వాక్యాలు పరమాత్మ ఉదకము, తేజస్సు, భూమి మొదలైన ఈ పదార్థాలలో అన్నిటిలో పరబ్రహ్మ అంతరాత్మగా ఉండి వాటికి నామ రూప విభాగము చేస్తున్నాడు అంటే ఆత్మ, శరీరము ఒకటి కానట్లు, సంకల్పించిన వాడు సంకల్ప జనిత కార్యము ఒకటి కాదు, అంటే పరబ్రహ్మ, జగత్తు ఒకటి కాదు, అందు వలన అక్కడ "ఈక్షణ" అన్న పదము మాట వరుసకు వాడిన గౌణ ప్రయోగం కాదు అని చెబుతున్నారు.

నేను: అలాగా!

మామయ్య: అంతేకాదు. తరువాత సూత్రంలో

## తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్ ( 1-1-7)

"తన్నిష్ఠస్య మోక్షోపదేశాత్" అని చెబుతున్నారు, అనగా

తన్నిష్ఠస్య: ఆ సత్ ను ధ్యానించు వానికి

మోక్షోపదేశాత్: మోక్ష ప్రాప్తిని ఉపదేశించడం వలన అని

**నేను:** మరి కొంచెం వివరించరా!

**మామయ్య:** నువ్వు చెప్పినట్లు ఈ అచేతన పదార్థమే సత్ అయితే అది దానిని ధ్యానించిన వారికి మోక్షమెలా ప్రసాదిస్తుంది. అలాంటి సత్ ను అనుసంధించుకుంటే "**తస్యదేవ చిరమ్ యావత్ న మోక్ష్యే అథ సంపత్స్యే**" అని అన్నట్లు పరబ్రహ్మ ప్రాప్తి రూపమైన మోక్షం పొందుతామని కదా శ్రుతి.

అచేతనము అలా మోక్షాన్ని ఇవ్వలేదు కదా. అంతేకాదు, "యథాక్రతుః అస్మిన్ లోకే పురుషో భవతి తథేతః ప్రేత్య భవతి" అంటే ఈ పురుషుడు ఈ లోకంలో ఎటువంటి ధ్యానంతో ఉంటాడో ఈ లోకాన్ని విడచి పైకి పోయినప్పుడు అట్టి స్థితినే కలిగి ఉంటాడు అంటే నువ్వుచెప్పినట్లు బండ, కొండ లాంటి అచేతనాన్ని ధ్యానించి ఈ జీవుడు కూడా అచేతనస్వరూపుడు అవుతాడని  అర్థము. ఇందుకోసమా మహానందమైన మోక్షము. వేలకొలది మాతా పితరుల కంటె నెక్కువ దయగల శ్రుతి అలా ఉపదేశిస్తుందా.

శ్రుతి ఎక్కడా పరబ్రహ్మాన్ని విడిచి పెట్టమని చెప్పలేదే.

**నేను:** మఱి కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** తరువాత సూత్రంలో

"**హేయత్వ అవచనాత్ చ**" (1-1-8)

హేయత్వ: (ఆ సత్ హేయము, వదిలి వేయ బడదగినది) అని

అవచనాత్ చ: చెప్పబడి ఉండక పోవడం వలన

అంటే ఇంతకు ముందు అనుకున్నట్లు కొండా, బండా లా కాకుండా ఉండాలంటే దాని ధ్యానం మాట అలా ఉంచు, దానిని తలవనే కూడదు. కాని శాస్త్రవాక్యాలు "**తస్యదేవ చిరమ్**" అంటూ ఆ సత్ ఉపాదేయము అని చెబుతున్నాయి కదా. "**తత్త్వమసి**" అని ఆ పరబ్రహ్మ అంతరాత్మ కలిగి ఉన్నవాడివని తత్సమాన స్వరూపాన్ని పొందగలవాడవని చెబుతోంది కదా, అందువలన  ప్రకృతిని సత్ అని మనం అనుకోకూడదు.

అంతేకాదు. తత్త్రతు న్యాయం ప్రకారం..

**నేను**: అంటే

**మామయ్య**: అధికారి పని చేసినవాడికి అధికారి వేతనం లభిస్తుంది, సేవకుని పని చేసిన వానికి సేవకుని వేతనం లభిస్తుంది. రోజుకు ఆరు గంటలు పని చేసిన వాడికీ, అరగంట పని చేసిన వాడికీ భృత్యం ఒక్కలా ఉండదు కదా, దంపిన కొద్దీ కూలి అనేవారు దీనినే. అలా దేనిని ధ్యానిస్తే దానికి తగిన ఫలమే కలుగుతుంది అన్నప్పుడు అచేతనాన్ని ఎవడు ధ్యానిస్తాడు, త్యజిస్తాడు కాని. తరువాత సూత్రము చూడు

## "ప్రతిజ్ఞావిరోధాత్" (1-1-9)

అంటే (ప్రకృతి జగత్కారణమని అంటే అది వేదాంత శాస్త్రీయ ) ప్రతిజ్ఞ/ ప్రతిపాదన విరోధించును.

అంటే నువ్వు చెబుతున్న ఛాందోగ్యోపనిషత్ "ఏక విజ్ఞానేన సర్వ విజ్ఞానమ్" అని కదా చెబుతున్నది. అంటే ఒక ఒక వస్తువు తెలుసుకోవడం సమస్త వస్తువులు తెలుకోవడానికి సాధనమవుతోందని కదా. అచేతనమైన ప్రకృతి ఈ సమస్త చేతనాలకు కారణమవడం, తద్విజ్ఞానానికి సాధనమవడం కుదరదు కదా. దాని వలన వేదాంత వాక్యాలకు విరోధంగా ఉంటుంది నువ్వుచెప్పినట్లైతే.

ఇంకా చూడు తరువాత సూత్రం

## "స్వాప్యయాత్" అని (1-1-10)

స్వ: సత్ శబ్ద వాచ్య మైన ఆత్మ (పరబ్రహ్మ) యందు

ఆప్యయాత్: (జీవుడు) లీనమగుట వలన

**నేను: అంటే**

**మామయ్య:** చెబుతున్నా. నువ్వు మంచి నిదురపోతున్నప్పుడు నీ జీవాత్మ ఏమవుతుంది? నువ్వు చెబుతున్న ఛాందోగ్యోపనిషత్ లోనే "స్వప్నాంతమ్ మే సోమ్య విజానీహీతి యత్ర ఏతత్పురుషః స్వపితి నామ సతా సోమ్య తదా సంపన్నః భవతి స్వమపీతో భవతి తస్మాత్ ఏనమ్ స్వపితి ఇతి ఆచక్షతే స్వమ్ హ్యపీతః భవతి ఇతి సుషుప్తమ్ జీవమ్ సతా సంపన్నమ్ స్వమ్ అపీతః స్వస్మిన్ ప్రలీన" అని ఉన్నది. అనగా "ఓ శ్వేత కేతూ! సుషుప్తి అవస్థ యందు నిద్రపోవుచున్నవాడు సత్ వస్తువుతో లీనమవుతుతున్నాడు" అని. జీవాత్మ లో పరబ్రహ్మ "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య " అన్నట్లు ప్రవేశించి ఉంటుంది కద. ఆ పరబ్రహ్మ లో నిద్రాసమయమున జీవుడు లీనమవుతాడు, కలసిఉంటాడు అన్నమాట. మరల నిద్రావస్థ నుండి బయటపడి నప్పుడు " త ఇహ వ్యాఘ్రోవా....మశకోవా యద్యద్భవంతి తథా భవంతి" అని అన్నట్లు తన పూర్వ రూపాన్ని పులి అయితే పులి రూపాన్ని, దోమ అయితే దోమ రూపాన్నీ ఆ జీవుళ్ళు పొందుతాయి. బోధాయన మహర్షి కూడా ఇలాగే చెప్పేరు. అలాంటప్పుడు చైతన్యము గల జీవుడు అచేతనమైన ప్రకృతి తో కలసిపోలేడు కదా. పాలూ, నీళ్ళూ కలుస్తాయి కాని, పాలూ, రాళ్ళూ కలిసిపోవు కదా. అందుచేత సత్ అంటే " సత్" అచేతనమైన ప్రకృతి అవడానికి దీని ప్రకారం కూడా ఆస్కారం లేదు.

తరువాత సూత్రం చూడు

## "గతి సామాన్యాత్" (1-1-11)

గతి: (జగత్కారణమును తెలుపు శ్రుతుల) తాత్పర్యమునందు సామాన్యాత్: సమానత్వము ఉండడం వలన

అంటే జగత్కారణత్వము తెలుపు శ్రుతులు అన్నీ కూడా ఒక్కలా పరబ్రహ్మమే కారణమని చెబుతున్నాయి కాని ఎక్కడా ఒక్కటి కూడా ప్రకృతి కారణమని చెప్పడం లేదు.

**"ఆత్మావా ఇదమ్ ఏక ఏవ అగ్ర ఆసీత్ ...ఇమాన్ లోకాన్ అసృజత"**

అంటే ఈ సృష్టికి పూర్వము ఆత్మ ఒక్కటే ఉండెను. అది ఈ లోకాలను సృజించెను.

**నాన్నగారు:** సృష్టికి పూర్వము ఆత్మ ఒక్కటే ఉందంటే పరమాత్మ కాదా

**మామయ్య:** అక్కడ ఆత్మ అంటే పరమాత్మ అనే అర్థము.

**తస్మాత్ వా ...ఆకాశః సంభూతః...."** అంటూ ఆ పరబ్రహ్మ నుండి, ఆకాశము, ఆకాశ శరీరుడగు పరమాత్మనుండి వాయువు, వాయుశరీరుడగు పరమాత్మనుండి అగ్ని, ... ఇలా లోకాలన్నీ వచ్చాయి అంటే పరమాత్మయే కదా జగత్కారణం.

తరువాత సూత్రంలో కూడా..

**నేను:** ఏమిటది.

**మామయ్య:**

**"శ్రుతత్వాత్ చ"** (1-1-12)అంటే

(సచ్ఛబ్దవాచ్యుడు, సర్వజ్ఞత్వము మొదలగునవి కలవాడని) శ్రుతులయందు ఉపదేశించబడుటచేత (అతడచేతనమగు ప్రకృతి కాదు).

నువ్వు చెప్పిన ఛాందోగ్యోపనిషత్ లోనే చూడు. "ఏష ఆత్మా అపహత పాప్మా, విజరః, విమృత్యుః, విశోకః, విజిఘిత్సః, అపిపాసః, సత్యకామః, సత్యసంకల్పః, " అని పాప రహితుడు, ముదిమి, దప్పిక, మృత్యువు, శోకము ఇవేమీ లేనివాడు, సత్యకాముడు, సత్యసంకల్పుడు అని చెబుతూంటే ఆయనను అచేతనమని అనలేము కదా.

మిగిలిన శ్రుతులూ అలాగే చెబుతున్నాయి. "స కారణమ్ కరణాధిపాధిపః" అని వాడే కారణ భూతుడనీ, వానికి అధిపతి లేడని, "సర్వాణి రూపాణి విచింత్య ధీరః" అని అన్నిటినీ సృజిస్తున్నాడనీ, "విశ్వాత్మానమ్ పరాయణమ్" అని సమస్తానికీ, ఆత్మా, ఆధారమూ అనీ "పతిమ్ విశ్వస్య..." అని ఈ సమస్త విశ్వాన్నీ పాలించువాడనీ, "అంతః బహిః చ తత్సర్వమ్ వ్యాప్య" అని లోపల, బయట అంతటా వ్యాపించి ఉన్నవాడనీ, "....దివ్యః దేవః ఏకః నారాయణః" అని నారాయణుడే ఉత్కృష్టుడు, సచ్చబ్దవాచ్యుడు జగత్కారణుడూ అనీ ఆయనే పరబ్రహ్మ అనీ చెబుతూంటే అచేతనమైన ప్రకృతికి జగత్కారణత్వము అంటగట్టలేము కదా.

నాన్నగారు: బావా, ఈ సందర్భంలో నాకు మరొక విషయం కూడా విశదమవుతోంది, అదేమిటంటే పరబ్రహ్మ నిర్విశేష చిన్మాత్రం అనడానికి కుదరదని. ఎందుకంటే "ఈక్షతేః ..." అని చెప్పినప్పుడు పరబ్రహ్మ చైతన్యము కలది అని కదా అంటున్నావు. జగత్తుని సృష్టి అవీ చేసేడంటున్నావు. అంటే చైతన్యము ఉందని. చైతన్యం ఉండడం వలన నిర్విశేషము అవలేదు, ఎందుకంటే చైతన్యము కూడా విశేషమే అవుతుంది కదా. సృష్టి కర్త అవడం వలన తనను, ఇతర పదార్థాలను వ్యవహార యోగ్యములుగా చేయడం వలన పరబ్రహ్మ కేవలము సాక్షీభూతము అనడం కూడా అసత్యమే అని తెలుస్తోంది. ఇంతేకాకుండా ఈ ఈక్షణాది గుణ సంబంధము ఎప్పుడూ ఉండేది అని కూడా తెలుస్తోంది. నువ్వు చెప్పిన "సత్య కామ సత్య సంకల్పాది" గుణాలన్నీ ఉన్నాయని అనేకములైన శ్రుతులు చెబుతున్నాయంటే పరబ్రహ్మ నిర్గుణుడు అనడం కూడా కుదరదు.

గుణాలూ, సామర్థ్యమూ లేకపోతే ఈ జగన్నిర్మాణాదులు చేయడం అవదుకదా! అలాగయితే ఆ పరబ్రహ్మ శక్తి , సామర్థ్యాదులు కూడా అప్రమాణమని అనాలి.

**మామయ్య:** అవును. అందువలన జగత్కారణమును ప్రతిపాదించే శ్రుతి వాక్యాలు అచేతనమైన ప్రకృతిని కాక సర్వజ్ఞ, సర్వవిత్, సర్వశక్తి మంతుడైన వాడు, అనవధికాతిశయ కళ్యాణ గుణాకరుడు, హేయరహితుడు, పురుషోత్తముడు అయిన నారాయణుడినే జగత్తునకు నిమిత్తోపాదాన కారణమని, మోక్ష ప్రదాత, ముముక్షువులకు ధ్యానించ దగిన వాడు అయిన పరబ్రహ్మ అని తెలుపుతున్నాయి.

**నేను:** సర్వజ్ఞ, సర్వవిత్ అని రెండు పదాలు వాడుతున్నారు, రెండింటికీ ఒక్కటే అర్థం కాదా.

**మామయ్య:** జ్ఞానము అంటే తెలుసును కదా, ఉపాధి రహితమై, ఇతరానపేక్షితమై, సంకోచ రహితమై సర్వవస్తు విషయక స్వరూప, స్వభావములు తెలుపు గుణము, స్థూలరూపజ్ఞానము కలవాడని, సూక్ష్మరూప జ్ఞానము కలవాడని చెప్పడానికి సర్వజ్ఞ, సర్వవిత్ అని వాడుతారు, అంతః బహిః చ తత్ సర్వమ్ వ్యాప్య నారాయణః స్థితః అని కదా శ్రుతి.

**అమ్మ:** ఇప్పటికి "**ఈక్షతేః నాతి శబ్దాత్**" నుండి ఎనిమిది సూత్రాలలో సృష్టి సంకల్పం చేయగలవాడు పరబ్రహ్మయే అని, అక్కడ సంకల్ప శబ్దము లాక్షణిక ప్రయోగం కాదని, ఆ పరబ్రహ్మను ధ్యానించడం వలన మోక్షము కలుగును కనుక త్యాజ్యము కానిదని, శ్రుతి వాక్యాలన్నీ పరబ్రహ్మయే జగత్కారణుడని చెబుతాయనీ, నిదుర పోయేటప్పుడు శ్రుతి చెప్పినట్లు చేతనమున్న ఆత్మ చైతన్యమున్న పరబ్రహ్మతోటే కలసి యుండ గలదని, జగత్కారణం తెలిపే శ్రుతులు అన్నీ సమానభావంతో అలా ఒక్క లాగే చెప్పడం వలన,

సచ్ఛబ్దవాచ్యుడు, సర్వజ్ఞుడు అయిన పరబ్రహ్మ యే జగత్కారణము తప్ప అచేతనమైన ప్రకృతి కాదు అన్న విషయాన్ని నిరూపించినట్లు క్లుప్తంగా నాకు తెలిసింది. బాగుంది మామయ్యా!

**మామయ్య:** అవునమ్మా! శ్రీభాష్యంలో ఈ 8 సూత్రాలను కలిపి "ఈక్షత్యధికరణము" అని అంటారు.

**నాన్నగారు:** అచేతనమైన ప్రకృతి కి జగత్కారణత్వము కుదరదనుకో. చైతన్యమున్న జీవుడికి కుదురుతుందా.

**మామయ్య:** ఈ విషయాన్ని భగవద్రామానుజులు "ఆనందమయాధికరణము" అని తరువాత అధికరణములో వివరిస్తారు. ఇది మరొక సారి చూద్దాము.

అందరమూ: కృతజ్ఞులము. దాసోహమ్. మళ్ళీ వస్తాము.

---

(మఱియొక రోజు మళ్ళీ మామయ్య గారింట్లో)

## 2 . ఆనందమయాధికరణము:

**మామయ్య:** ఈరోజు నుండి మనము "ఆనంద మయాధికరణము" గురించి చెప్పుకుందామనుకున్నాము కదా! మనం ప్రారంభించే ముందు రామం నీకేమైనా సందేహాలుంటే చెప్పు, అదయిన తరువాత మొదలుపెడదాము.

**నేను:** పోయిన సారి నాన్నగారు చైతన్యం లేకపోవడం వలన ప్రకృతి జగత్కారణం కాకపోవచ్చు కాని చైతన్యమున్న జీవుడు జగత్కారణం కావచ్చు కదా అన్నారు. సరిగ్గా అలాంటి సందేహమే నాకూ కలిగింది. అప్పుడెప్పుడో ఒక స్వామీజీ వద్ద ఏవో ఉపన్యాసాలు, తైత్తిరీయోపనిషత్తు లో బ్రహ్మానందవల్లి మీద,

వింటున్నప్పుడు కూడా ఇలాంటి సందేహాలే వచ్చేయి. మీరెలాగూ ఈరోజు ఆనందమయాధికరణము చెబుతానన్నారు కదా అని చూసుకుందికి ఆ పుస్తకం కూడా తీసుకొని వచ్చేను. మీరు చెబుతూంటే ఆ సందేహాలకన్నిటికీ నాకు సమాధానము వచ్చేస్తుంది లెండి.

**మామయ్య:** ఆ బ్రహ్మానందవల్లిలో ఏమి చెప్పేరో కొంచెం మాకూ చెప్పు.

**నేను:** మిడి మిడి జ్ఞానంతో ఏవో రెండు ముక్కలు విన్నాను మామయ్యా....

**మామయ్య:** అదే, ఆ రెండు ముక్కలే చెప్పు, మన చర్చ అక్కడినుండే ప్రారంభద్దాం

**నేను:** బ్రహ్మానందవల్లి "బ్రహ్మ విత్ ఆప్నోతి పరమ్" అని ప్రారంభమవుతుంది. అంటే బ్రహ్మను తెలుసుకున్నవాడు పరమపదాన్ని పొందుతాడు అని కదా.

దాని తరువాత ఆ బ్రహ్మ ఏమిటి అంటే "సత్యమ్ జ్ఞానమనంతమ్ బ్రహ్మ" అని ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని నిర్వచించి, "యో వేద నిహితమ్ గుహాయామ్ పరమే వ్యోమన్ సోఽశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా" అని ఆ బ్రహ్మను తెలుసుకున్నవాడు బ్రహ్మతోబాటు సమస్త కామములను అనుభవిస్తాడు అని చెప్పి, తరువాత  క్రమంగా "తస్మాద్వా ఏతస్మాత్ ఆత్మన ఆకాశః సంభూతః ఆకాశాత్ వాయుః వాయోరగ్నిః అగ్నేరాపః అద్భ్యః పృథివీ పృథివ్యామ్ ఓషధయః ఓషధీభ్యః అన్నమ్..." అంటూ సృష్టిక్రమాన్ని చెబుతూ పరబ్రహ్మ నుండి ఆకాశము, ఆకాశము నుండి వాయువు, వాయువు నుండి అగ్ని, అగ్ని నుండి జలము, జలమునుండి భూమి, భూమి నుండి ఓషధులు, ఓషధులనుండి అన్నము ...అంటూ ఆపై  "స వా ఏష పురుషః అన్నరసమయః" అని అన్నమయ కోశము,   దాని విశిష్టతను చెప్పి, క్రమంగా తదంతర్గతమైన ప్రాణమయ కోశాన్ని, ఆపై మనోమయ కోశాన్ని దాని తరువాత విజ్ఞాన మయ కోశాన్ని చెప్పి తరువాత ఆనందమయ కోశము గురించి చెబుతుంది ఉపనిషత్. తరువాత

"యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా  సహ ఆనందో బ్రహ్మణో విద్వాస్ న బిభేతి కదాచనేతి..." అంటూ వాఙ్మనస్సులకు అందని బ్రహ్మానందమును వివరిస్తుంది. ఈ సందర్భంలో ఆ ఆనందమయ కోశమును వివరిస్తూ "తస్యైష ఏవ శారీర ఆత్మా యః పూర్వస్య తస్మాత్ వా ఏతస్మాన్ విజ్ఞాన మయాత్ అన్యః అంతరః ఆత్మా ఆనందమయః తేనైష పూర్ణః స వా ఏష పురుష విధ ఏవ తస్య పురుషావిధతామ్ అన్వయమ్ పురుష విధః.

తస్య ప్రియమేవ శిరః మోదో దక్షిణః పక్షః ప్రమోద ఉత్తరః పక్షః ఆనంద ఆత్మా బ్రహ్మ పుచ్ఛమ్ ప్రతిష్ఠా . " అని ఆ ఆనందమయ కోశాన్ని ఒక పక్షి ఆకారంలో వర్ణిస్తూ  "దానికి ప్రియమే శిరస్సు, మోదము కుడి పక్షము(రెక్క), ప్రమోదము ఎడమ పక్షము, ఆనందము ఆత్మ, బ్రహ్మ పుచ్ఛము(తోక) అని వర్ణిస్తారు. ఈ సందర్భంలో స్వామీజీ చెప్పినదాన్ని బట్టి

"ఆనందమయ కోశము శరీరభావము తో సూచితమై శిరస్సు, ఉత్తర, దక్షిణ పక్షములు వంటి అవయవములు కలిగి ఉండడం వలన ఏదయినా అవయవాలు కలిగి ఉన్నది శాశ్వతము కాదు కనుక ఆనందమయ కోశము పరబ్రహ్మ కాలేదు కదా. అదే అనువాకములో ఉపనిషత్తు "బ్రహ్మ పుచ్ఛమ్ ప్రతిష్ఠా" అని చెబుతోంది కనుక పరబ్రహ్మ ఆనందమయ కోశాన్ని అతిక్రమించి యున్నది అని తెలుస్తుంది, దూరంగా ఆకాశములో చంద్రుని చూపడానికి ఒక చెట్టు చూపించి, ఆ చెట్టుకి ఉన్న కొమ్మ చూపించి ఆ కొమ్మ మీద ఆకులను చూపి వాటి మధ్యనుండి కనపడే చంద్రుడిని చూపే "శాఖా చంద్ర న్యాయం" లాగా మనకు కనబడని పరబ్రహ్మను గురించి చెప్పడానికి మనకు కనబడుతున్న అన్నమయ కోశం నుండి ప్రారంభించి, తరువాత ప్రాణమయ కోశము, మనోమయ కోశము, విజ్ఞాన మయకోశము చెప్పి అలాగే ఆనందమయ కోశము కూడా చెప్పి దానికి కూడా అతీతమై వాఙ్మనస్సులకందనిది పరబ్రహ్మ"  అని ఉపనిషత్తు చెప్పినట్లు నాకు అర్థమైనది. అందువలన అవిద్య వలన మనం అనుభవిస్తున్న ఈ శరీరాలకు అతీతమైన సత్య, జ్ఞాన, అనంత స్వరూపమైన జీవాత్మయే ఈ

కనబడుతున్న జగత్తుకి కారణము కావచ్చును కదా అని సందేహము. "తదైక్షత" అని చెప్పబడిన "సంకల్పము" చైతన్య స్వరూపమైన జీవాత్మకు కుదురుతుంది కదా అని.

తరువాత వచ్చే వాక్యాలు"**అసన్నేవ స భవతి అసత్ బ్రహ్మేతి వేద చేత్ అస్తి బ్రహ్మేతి చేద్వేద సంతమేనమ్ తతో విదుః**" అని బ్రహ్మ ఉన్నట్లు తెలుసుకున్నవాడు అస్తిత్వము ఉన్నవాడు, అలాకాక ఉన్నవాడు లేనట్టి వాడే అంటూ చెప్పే వాక్యాలలో ఆనందమయ కోశమే బ్రహ్మ అని లేదుకదా. అందువలన ఆనందమయకోశము, పరబ్రహ్మ వేర్వేరేనా అన్నది ఇంకొక సంశయము.

ఇంకా సందేహాలున్నాయనుకోండి, మరికొంచెం సేపు అయిన తరువాత నాకు ఇంకా తెలిసిరాక పోతే మళ్ళీ అడుగుతాను.

**అమ్మ:** మామయ్యా, వాడు అక్కడా, ఇక్కడా విన్నదేదో చెబుతూ కలగాపులగం చేస్తున్నట్టుంది.

**మామయ్య:** దీనిని పుచ్ఛ బ్రహ్మ వాదమని కూడా అంటారమ్మా.

**అమ్మ:** అదేదో వివరంగా చెప్పరా మామయ్యా!

మామయ్య: మనకందరికీ అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ కోశాల గురించి తెలుసును కదా. ఉపనిషత్తు ప్రతి యొక్క కోశానికి ఒక పక్షి రూపంగా వర్ణిస్తుంది. పక్షికి తల, రెండు రెక్కలు, ఆత్మ భాగమైన మొండెము, తోక భాగము అని ఐదు భాగాలు ఉంటాయి కదా. అలాగే ప్రతి కోశానికి ఈ ఐదు భాగాలూ వర్ణిస్తుంది ఉపనిషత్తు. ఉదాహరణకు ప్రాణమయ కోశానికి ప్రాణము శిరస్సు, వ్యాన, అపానములు రెండు పక్షములు, ఆకాశము ఆత్మ, పృథ్వీ పుచ్ఛము. అలాగే మనో మయ కోశానికి యజుః శిరస్సు, ఋక్సామములు పక్షములు, ఆదేశము ఆత్మ, అధర్వాంగీరసము పుచ్ఛము. విజ్ఞానమయ కోశానికి శ్రద్ధ శిరస్సు, ఋతము, సత్యము పక్షములు, యోగము ఆత్మ, మహత్తు పుచ్ఛము. ఇక ఆనందమయ కోశానికి

ప్రియము శిరస్సు, మోద, ప్రమోదాలు పక్షములు, ఆనందము ఆత్మ, బ్రహ్మ పుచ్ఛము అని వివరిస్తుంది. దీనిని బట్టి క్రింద విషయాలు తెలుస్తాయి.

1. శరీరమున్నది, అవయవాలు లేదా భాగాలూ ఉన్నాయి అంటే అది శాశ్వతము కాలేదు. ఎందుకంటే ప్రపంచంలో అవయవి ఏదయినా శాశ్వతం కాదు. ఒక మంచము ఉందనుకోండి, దానికి కోళ్ళు, బల్ల, కర్రలు ఇలా భాగాలుంటాయి. అవి విరిగి పోయో, అరిగి పోయో పాడయి పోతాయి కదా. అందువలన అది శాశ్వతంగా ఉండలేదు. అందువలన ఈ కోశాలు, ఆనందమయ కోశం కూడా, శాశ్వతమైనవి కాలేవు. బ్రహ్మ అంటే అశాశ్వతము కాదుకనుక ఆనందమయ కోశము పరబ్రహ్మ కాలేదు.

2. అన్నమయాది కోశాలను చెబుతున్నప్పుడు కనపడని పరబ్రహ్మాన్ని చెప్పే ప్రయత్నంలో ముందు కనపడుతున్న అన్నమయకోశం గురించి చెప్పి, తరువాత అంతకంటే సూక్ష్మమైనది, తరువాత దానికంటే సూక్ష్మమైనది...ఇలా ఒక క్రమంలో పరబ్రహ్మని దూరంగా ఉన్న అరుంధతీ నక్షత్రమో, చందమామో చూపించడానికి చెట్టు, చెట్టు కొమ్మ....ఇలా కనబడుతున్న వస్తువులు చూపించి దాని మీద నున్నది అన్నట్లు చెబుతున్నారే తప్ప దానిని బట్టి మనం ఈ కోశాలను పరబ్రహ్మ అనుకొననక్కరలేదు.

3. ఆనందమయ కోశము గురించి చెబుతున్నప్పుడు బ్రహ్మ ఆ ఆనందమయ కోశానికి పుచ్ఛముగా చెప్పబడింది. పుచ్ఛముగా చెప్పబడిన బ్రహ్మ ఆనందమయ కోశము కాలేదు కదా.

ఈ యుక్తి ని అనుసరించే ఈ వాదాన్ని పుచ్ఛ బ్రహ్మ వాదమని అంటారు

4. తరువాత "**అసత్ బ్రహ్మేతి చేదచేత్...**" మొదలైన వాక్యాలలో ఎక్కడా బ్రహ్మయే ఆనందమయ కోశము చెప్పినట్లు లేదు, అలాగయితే "**అసత్ ఆనందమయేతి చేదచేత్....**" అని చెప్పి యుండవలసినది కదా,

5. నిర్గుణ మైన పరబ్రహ్మను తెలియలేని సామాన్యులకు ముందు  సగుణ బ్రహ్మగా చెప్పి తరువాత నిర్గుణ బ్రహ్మను తెలియపరచి నట్లు ఇక్కడకూడా ముందు తెలిసిన, ఊహించుకోగలిచిన ఈ వివిధ కోశాలను ముందు

చెప్పేరే తప్ప ఈ కోశాలే పరబ్రహ్మ అని కాదు కదా, పరబ్రహ్మ అంటే ఇలా శరీరమూ, అవయవాలూ, రూపమూ అవీ ఉండవు కదా.

ఈ పై కారణాల వలన ఆనందమయ కోశము అంటే పరబ్రహ్మ కాదు.

అని వారి వాదము.

రామం, ఇంకా సందేహాలుండి పోయినాయన్నావు, అవి కూడా చెప్పు, మనం వాటినీ చర్చించుదాం.

నేను: ఏంలేదు మామయ్యా! ఈ ఆనందమయ కోశాన్ని జీవాత్మ అని అనుకోవచ్చా. ఎందుకంటే

1. ఈ ఆనందమయ కోశానికి జీవాత్మలా శరీర సంబంధం ఉంది. అవయవాలున్నాయి.

2. మిగిలిన కోశాలన్నీ జీవాత్మకు సంబంధించినవే. అందువలన ఇది కూడా జీవాత్మకు సంబంధించినదే అవాలి.

3. జీవాత్మ, పరమాత్మలకు భేదము శరీర సంబంధమే కదా, ఈ భవబంధము పోతే జీవాత్మ, పరమాత్మ ఒక్కటే కదా, అందువలన శరీర సంబంధమున్న ఆనందమయ కోశము జీవాత్మే కావాలి.

4. ఆనందమయ కోశము జీవాత్మ అయితే "తదైక్షత" అన్నప్పుడు కావలసిన చేతనత్వానికి అభ్యంతరమేమీ ఉండదు.

అందువలన కోశమంటే జీవాత్మగా చెప్పబడే ప్రత్యగాత్మ యేనా.

నాన్నగారు: బావా! రామాయణ కోశాలన్నట్లు ఈ అన్నమయ కోశము, ప్రాణమయ కోశమూ అంటే కోశము అన్న పదానికి ఇక్కడ అర్థమేమిటి!

**మామయ్య:** కోశము అన్న పదానికి చాలా అర్థాలున్నాయి. నువ్వు చెప్పిన రామాయణ కోశము అంటే రామాయణం పుస్తకం. సంస్కృతము తెలుగు కోశము అంటే నిఘంటువు. కాని ఇక్కడ కోశము అంటే ఒక తొడుగు sheath అన్న మాట.

ఇంక రామం ప్రశ్నలకు వద్దాం. రామం మొదటి ప్రశ్న పరబ్రహ్మ ఆనంద మయకోశము కంటే భిన్నమైనదా అని. ఎందుకంటే శరీరము, అవయవాలు అంటే అశాశ్వతమయి పోతుంది కదా అని. ఇక్కడ ఆనందము ఆత్మ, మోద, ప్రమోదాలు ఱెక్కలు, బ్రహ్మ పుచ్ఛము అంటే ఇక్కడ మనకు కనపడే భౌతికమైన శరీరము, అవయవాలు అన్నట్లు తీసుకోకూడదు. ఈ రకమైన చిత్రీకరణ యోగ శాస్త్రానికి, ధ్యాన, ధారణా విధానానికి సంబంధించినది. అన్ని కోశాల చిత్రీకరణ లోనూ ఈ శిరస్సు, ఱెక్కలూ, ఆత్మ, పుచ్ఛము అని వస్తుంది. ఇవన్నీ ఆయా కోశ అవయవాలని కాదు. లేకపోతే పరబ్రహ్మని తోక అని ఉపనిషత్తు వర్ణించదు కదా, అక్కడ పుచ్ఛము అంటే ఆధారము అని అర్థము. ఉపనిషత్తులను సమంగా అర్థం చేసుకోకపోతే వచ్చే చిక్కులివే. అందుకే నిర్హేతుక కృపతో భగవద్రామానుజులు ఉపనిషత్ దుగ్ధాబ్ధి మధ్యనుండి మనకు అమృతాన్ని తన అక్షరాలతో మనకు అందిస్తానని అన్నారు. రామం, నువ్వు చెప్పి నట్లు తీసుకున్నా బ్రహ్మ పుచ్ఛమను కుంటే అదీ అవయవమే, అలాగయినప్పుడు అదీ శాశ్వతము కాకూడదు కదా. అందువలన నువ్వు చెప్పినది కుదరదు.

తరువాత శ్లోకాలలో "**అసత్ బ్రహ్మ ఇతి వేదచేత్....**" వంటి శ్లోకాలలో ఆనందమయ అని రాలేదు కనుక ఆనందమయుడంటే బ్రహ్మ కాదు అని అంటున్నావు, అక్కడ సందర్భము వేరు, అక్కడ బ్రహ్మ ఉనికిని తెలియని వాడు వృథా అని చెబుతున్నారు. అందువలన అక్కడ ఆనందమయ పదము రానక్కరలేదు. కనబడుతున్న అన్నమయ కోశం అయిన ఈ శరీరం నుండి ప్రారంభించి, క్రమ క్రమంగా విజ్ఞానమయ కోశము వద్దకు వచ్చీ సరికి జీవాత్మను చెప్పి, దాని తరువాత తదంతర్యామి అయిన పరబ్రహ్మ ను ఆనందమయకోశ సందర్భంలో చెప్పేరు.

ఇంక నీ రెండవ శంక, ఆ ఆనందమయకోశము అన్నప్పుడు జీవాత్మే అని ఎందుకు అనుకోకూడదు అని, అంతకుముందు విజ్ఞానమయ కోశమును చెప్పినప్పుడు జీవాత్మను చెప్పి మళ్ళీ ఆనందమయ కోశానికి కూడా జీవాత్మ అనే ఎందుకు చెబుతారు. జీవాత్మ, పరబ్రహ్మ ఒక్కటి కాదు కదా! సర్వజ్ఞుడు, సర్వేశ్వరుడు, జగత్కారణుడు అయిన పరబ్రహ్మ, కర్మ పరవశ్యుడై సుఖ దుఃఖములననుభవిస్తూ ఆ పరబ్రహ్మ కృపా వాత్సల్యముల వలన మాత్రమే మోక్షము పొందే జీవుడు ఒకటి కాలేరు కదా.

**నేను:** మఱి "తత్త్వమసి శ్వేత కేతో" అన్న ఛాందోగ్యోపనిషత్ వాక్యము ఓ శ్వేతకేతూ, ఇంతకు ముందు జగత్కారణముగా చెప్పబడిన పరబ్రహ్మ నువ్వుగా పిలువబడే జీవుడూ ఒక్కటే అనికదా చెబుతోంది. ఉదాహరణకు దేవదత్తుడనే వాడిని ప్రొద్దున్న కుండ చేస్తూండగా చూసేము. తరువాత మధ్యాహ్నము వాడే ఆటలాడుతూ కనపడ్డాడు. అప్పుడు ఆ కుండ చేస్తున్న దేవదత్తుడే ఈ ఆటలాడుతున్నవాడు అని చెబుతాము కదా, " సః అయమ్ దేవదత్తః" అని. అలాగే అలా జగత్తు నిర్మాణము చేసే పరబ్రహ్మ, ఈ నువ్వులా కనబడుతున్న జీవుడూ ఒక్కటే అని చెప్పినట్లు కాదా తత్త్వమసి అంటే. "బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్" అన్న ఇందాకా మనమనుకున్న శ్రుతి వాక్యము బ్రహ్మను తెలుసుకున్న బ్రహ్మత్వాన్ని పొందుతున్నాడని కాదా. "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామ రూపే వ్యాకరవాణి" అన్నప్పుడు అనేన, జీవేన, ఆత్మనా అన్న మూడు పదాలూ ఒకే లింగ, వచన, విభక్తులలో ఉండి ఒకే వ్యక్తిని అదే జీవుడినే తెలుయచేస్తున్నాయి కదా. అంటే...

**మామయ్య:** నిరస్త నిఖిల దోషుడు, సత్య సంకల్పుడు, సర్వజ్ఞుడూ, సర్వశక్తుడూ, అనవధికాతిశయ అసంఖ్యేయ కళ్యాణ గుణాకరుడు సకలమునకు కారణ భూతుడైన బ్రహ్మము నానావిధానంత దుఃఖ భాజనుడు, కర్మాధీనుడు అయిన జీవుడు కాడు, కానేరడు అన్న విషయాన్ని భగవద్రామానుజులు

వివరంగా మొట్టమొదటే నువ్వు చెప్పిన వాక్యాలే కాకుండా ఇంకా ఎన్నో శ్రుతి వాక్యాలు సమన్వయ పరుస్తూ వివరించేరు.

మళ్ళీ అందులో కొన్ని విషయాలను క్లుప్తంగా మనం జ్ఞప్తికి తెచ్చుకుందాము.

ఆ ఛాందోగ్యోపనిషత్ లో "**సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్**" మొదలైన వాక్యాలలో సృష్టికి పూర్వము నామరూప విభాగము లేదని, తన అసాధారణ సంకల్పము చేత పరబ్రహ్మ తానొక్కడే సృష్టి చేసేడని, ఆ సకల చేతనా చేతనాలలో అంతర్యామి గా ప్రవేశించి నామరూప విభాగము చేసేనని చెబుతూ వాటన్నిటికీ, తానే మూలమనీ, ఆశ్రయమనీ, తనవలననే జీవించి ప్రవర్తిస్తాయని, తానే ఆధారమనీ వివరిస్తున్నప్పుడు ఆ జీవుడు పరబ్రహ్మాత్మకుడు అంటే పరబ్రహ్మయే ఆత్మగా కలవాడు అని చెప్పే వాక్యమది. లేక పోతే పూర్తిగా వ్యతిరేక గుణ, విశేషములున్న జీవ, బ్రహ్మలు ఒక్కటి కారు కదా. అలాగే "**అనేన జీవేన...**" అన్న శ్రుతి వాక్యానికి "జీవునితో బాటు చేతనాచేతనములయందు తానుకూడ అనుప్రవేశము చేసి నామరూపములు కల్పించి వ్యవహార యోగ్యములుగా చేసి ఈ జగజ్జీవాలకు ఆత్మగా అయినాడు అని అర్థము. లేకపోతే తత్, త్వమ్ అనే రెండు సర్వనామాలూ ఇద్దరి గురించి చెప్పి నప్పుడు ఆ రెండింటినీ ఒక్కటే అనడం కుదరదు.

తరువాత నువ్వు చెప్పిన దేవదత్తుడి ఉదాహరణ ఇక్కడ కుదరదు. అక్కడ కాలము, దేశమూ వేర్వేరు. ఇక్కడ అలా కాదు. బ్రహ్మ విత్ ఆప్నోతి పరమ్ అంటే బ్రహ్మను తెలుసుకున్నవాడు పరమపదాన్ని పొందుతాడు అని తప్ప బ్రహ్మ అయి పోతాడు అని ఎక్కడ ఉంది, అలాగయితే "**సోశ్నుతే ...సహ బ్రహ్మణా**"అని బ్రహ్మతో కూడా అని వాడ కూడదు కదా.

**అమ్మ:** ఈ విషయం అదే జీవుడు, బ్రహ్మ ఒకటి కావనీ, తత్త్వమసి లాంటి వాక్యాలకు అలా అర్థం తీసుకోకూడదనీ మేము ఇంతకు ముందు మొదటి సూత్రం సందర్భంలో వివరంగా చెప్పుకున్నాము మామయ్యా, మళ్ళీ మీ దగ్గర ఆ విషయం మరచి పోయినాడో, లేక సరి చూసుకుంటున్నాడో మరి.

మామయ్య: పరవాలేదమ్మా, విషయం కూడా కష్టమైనది అవడం వలన మళ్ళీ మళ్ళీ సందేహాలు పుడుతూంటాయి.

సరే, అందువలన ఆనందమయుడు అంటే జీవుడు కాదు పరబ్రహ్మమే అని చెప్పడానికే తరువాత బ్రహ్మ సూత్రము

"**ఆనందమయః అభ్యాసాత్**"( 1-1-13) అనగా

ఆనందమయః: ఆనందమయ శబ్ద వాచ్యుడు (పరమాత్మయే)

(అన్యః: జీవాత్మ కంటే భిన్నుడు)

అభ్యాసాత్: (శ్రుతులయందు ఆనందగుణమును ) అనేక సార్లు గణించుటవలన

అని చెబుతుంది.

**నేను:** అంటే ఏమిటి మామయ్యా!

**మామయ్య:** నువ్వు ఆనందమయ కోశమూ అదీ చెప్పినప్పుడు అసలు బ్రహ్మానందము అంటే ఏమిటో చెప్పిన వాక్యాలూ ఆ ఉపనిషత్ లోవి చెప్పలేదు. విను

"సైషా ఆనందస్య మీమాంసా భవతి. యువాస్యాత్ సాధుయువాధ్యాయకః. ......స ఏకో మానుషా ఆనందః

....తేయే శతమ్ మనుష్య గంధర్వాణమానందః. ....స ఏకో బ్రహ్మణ ఆనందః. "

అని చెప్పి "శ్రోత్రియస్య చ అకామహతస్య" అని ముక్తపురుషుడికి కూడా అంత ఆనందం ఉంటుంది అని చెప్పింది.

**నేను:** కొంచెం వివరించండి మామయ్యా,

**మామయ్య:** బ్రహ్మానందాన్ని లెక్కించడానికి శ్రుతి ప్రారంభించింది. దానికి ముందు ఒక ప్రమాణము తీసుకోవాలి కదా, ఒక కొలబద్ద. అందుకు ఒక మంచి యువకుడిని, శాస్త్రాలన్నీ తెలిసినవాడిని, బలిష్ఠుడు, ఆరోగ్యవంతుడు అయిన వాడిని, ఈ ప్రపంచంలో ఉండే ఐశ్వర్యాలన్నీ కలవాడిని, ఆశిష్ఠుడు అంటే positive character అన్నమాట, ద్రఢిష్ఠుడూ, మంచి మనో బలమున్నవాడు...ఇలా అన్ని గొప్ప గుణాలూ ఉన్న వాడి ఆనందం ఒక ప్రమాణంగా తీసుకొని దానిని మానుష ఆనందము అని నిర్వచించింది. దానికి నూఱు రెట్లు మనుష్య గంధర్వ ఆనందమనీ, దానికి నూఱు రెట్లు దేవ గంధర్వ ఆనందమనీ దానికి నూఱు రెట్లు పితృదేవ ఆనందమనీ, దానికి నూఱు రెట్లు అజానజ దేవ ఆనందమనీ, దానికి నూఱు రెట్లు కర్మదేవ ఆనందమనీ, దానికి నూఱు రెట్లు దేవ ఆనందమనీ, దానికి నూఱురెట్లు ఇంద్ర ఆనందమనీ, దానికి నూఱు రెట్లు బృహస్పతి ఆనందమనీ, దానికి నూఱు రెట్లు పితామహా ఆనందమనీ, దానికి నూఱు రెట్లు బ్రహ్మ ఆనందమనీ చెప్పి వేదాంత శ్రవణం చేసి, బ్రహ్మోపాసనం వలన ముక్తి పొందిన వానికి కూడా అంత ఆనందం ఉంటుంది అని చెప్పింది శ్రుతి. ఇక్కడ నూఱు సంఖ్య అనేకత్వాన్ని కూడా సూచిస్తుంది. కనుక ఈ ముక్తానందం ఉపాసనా ప్రీతుడైన పరబ్రహ్మ సంకల్పము చేత కల్పించబడినదని తెలుస్తోంది. అంటే ముక్తానందం నిరుపాధికం కాదు. అంటే స్వతః సిదధమైనదీ, స్వాభావికమైనదీ కాదు అన్నమాట. నిరుపాధికం కాని స్వాభావికమైన ఆనందం కలిగి ఉండడం ఒక్క పరబ్రహ్మకు తప్ప వేరొకరికి ఎవ్వరకూ లేదని తెలుస్తోంది. అటువంటి ఆనందం గలది

ఆనందమయ శబ్దం చేత నిర్దేశించబడిన వస్తువు జీవుడి కంటే వేరయిన పరబ్రహ్మ అని చెప్పబడినదన్న మాట ఈ సందర్భంలో .

ఆ పరబ్రహ్మ గూర్చి చెప్పే ప్రయత్నంలో "**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ**" అంటూ వేదవాఙ్మనస్సులకు అందని వాడు ఆ పరబ్రహ్మ అని చెబుతుంది. అంతే కాదు, "**తస్మాత్ వా ఏతస్మాత్ విజ్ఞానమయాదన్యః అంతర ఆత్మా ఆనందమయః**" అనగా ఈ విజ్ఞానమయుడైన జీవునికంటె వేరుగా లోననుండు నట్టి అంతర్యామి ఆనందమయుడు అని చెబుతోంది శ్రుతి.

**నేను**: విజ్ఞానమయుడు అంటే జీవుడేనా! మఱి "విజ్ఞానమ్ యజ్ఞం తనుతే" అంటే విజ్ఞానము యజ్ఞము చేయును అని మాత్రమే ఉంది శ్రుతిలో.

**మామయ్య**: జ్ఞాతయే అయిన జీవాత్మ యొక్క స్వరూపం స్వయంప్రకాశకం అవడం వలన దానిని "విజ్ఞానమ్" అని చెబుతున్నారు. తప్పులేదు. జ్ఞానాన్ని బట్టియే కదా జ్ఞాత యొక్క స్వరూపము నిర్ణయించబడుతుంది. మీ తాతగారు ఏదయినా సభలో ప్రవేశించినప్పుడు అదుగో వ్యాకరణం వచ్చింది అనేవారట. అక్కడ వ్యాకరణం అన్న పదాన్ని మీ తాతగారిని సూచిస్తూ వాడేవారన్నమాట, ఆయనకు ఆ విద్య బాగా రావడం వలన. అలాగే అక్కడ విజ్ఞానమన్న పదాన్ని కర్తగా వాడ వచ్చు. పాణిని వ్యాకరణ సూత్రాలు కూడా ఉన్నాయి దీనిని సమర్థిస్తూ. అదంతా చెప్పుకుంటే నీకు బరువయిపోతుంది. " యో విజ్ఞానే తిష్ఠన్" " **య ఆత్మని తిష్ఠన్**" అన్నప్పుడు కూడా విజ్ఞాన శబ్దము జీవ వాచకం అనే చెబుతారు. అందుకే చెబుతున్నారు, విజ్ఞానమయుడికి భిన్నమైన వాడు, వాని లోపల నుండువాడు పరమాత్మయే ఆనందమయుడని తెలుసుకోవాలి.

**నేను**: ఇక్కడ "ఆనంద మయుడు" అన్నప్పుడు మయట్ ప్రత్యయానికి అర్థం ఏమిటి మామయ్యా,

మామయ్య: ఇంతకు ముందు చదువుకొనే ఉంటావు, అయినా మరొకసారి విను. మయట్ ప్రత్యయాన్ని స్వార్థానికి గాని, వికారార్థానికి గాని, ప్రాచుర్యానికి గాని వాడ వచ్చును. స్వార్థము అంటే సాదృశ్యాన్ని చెబుతుంది. అన్నమయbఅన్న చోట మయట్ ఈ అర్థంతోటే వాడబడింది. దీనిని స్వార్థ ప్రత్యయం అంటారు. అంటే ప్రత్యయం వలన పదం అర్థం మార్పు చెందక అదే అర్థం ఇస్తుంది. బాలః అన్న పదానికి క ప్రత్యయం చేరి బాలకః అయితే దాని అర్థం మారదు కదా, అలాగన్న మాట. దేవః, దేవతా కూడా ఇలాంటిదే అనుకో.

**నేను:** మరి వికారార్థే మయట్ అంటారు కదా, అది వర్తించదా, ఆనందమయుడు అన్నప్పుడు.

**మామయ్య:** హిరణ్మయ పాత్ర అన్నచోట్ల వికారార్థముతో వాడబడుతుంది. అంటే బంగారం తో పాత్ర చేసినప్పుడు బంగారం వికారము పొంది, అంటే మార్పు పొంది పాత్రగా మారింది అన్నమాట. విజ్ఞానము వికారము పొంది జీవుడవడం, ఆనందం వికారం పొంది పరబ్రహ్మ అవడం కుదరదు కదా. విజ్ఞానము, ఆనందము అనేవి గుణాలు కదా, గుణాలు వికారం పొంది చైతన్య స్వరూపం సిద్ధించదు కదా.

**నాన్నగారు:** వికారం అన్న పదాన్ని అంతకుముందు ఉన్నదానికంటే పాడయితే వాడుతూంటాము కదా కొంచెం చెడు అర్థము వచ్చేటట్లు

**మామయ్య:** అవును వికారం అన్న పదాన్ని negative మార్పు గాను, వికాసం అన్న పదాన్ని positive మార్పు గాను వాడుతాం సాధారణంగా. కాని వికారం అని ఎటువంటి మార్పుకు వాడినా తప్పులేదు. అలా కాకుండా ఆనందం negative మార్పు చెంది పరబ్రహ్మ అయిందంటే ఇంకా హాస్యాస్పదం కదా.

**నేను:** మరి ప్రాచుర్యార్థం లో అంటే

**మామయ్య:** లవణమయమ్ అన్నమ్ అంటే అన్నములో ఉప్పు బాగా ఎక్కువ ఉందని అర్థము. అలాగే విజ్ఞానమయుడని జీవుడికి, ఆనందమయుడని పరబ్రహ్మ కు వాడుతున్నారన్నమాట.

**నేను:** ప్రాచుర్యం అని చెప్పి నప్పుడు ఆ గుణం ఎక్కువగా ఉందని అర్థం కనుక ఆనందం పాలు ఎక్కువ దుఖం పాలు తక్కువ, పరబ్రహ్మకు ఉంటుందనుకోవాలా. అంటే దుఃఖము కూడా కొలదిగా ఉంటుందని కదా పరబ్రహ్మకు.

**మామయ్య:** ఒక గుణం ఎక్కువగా ఉన్నదంటే దానిలో దోషాలున్నాయనే అర్థం రాదే. అయినా పరబ్రహ్మ లో అనేక కళ్యాణ గుణాలున్నాయి కదా, ఆనందంతో బాటు అందువలన ఆనందమన్నది సూచీకరణానికే అని తీసుకోవాలి.

నేను: పరబ్రహ్మ తన భక్తుల దుఃఖానికి తానూ రామాయణంలో రాముడి గురించి "భృశమ్ భవతి దుఃఖితః" అన్నట్లు దుఃఖిస్తాడంటారే. అది దుఃఖం కాదా. అంటే పరబ్రహ్మకు దుఃఖం ఉన్నట్లు కాదా.

**మామయ్య:** పరబ్రహ్మ ఆనందమయుడు అంటే కొలదిగా దుఃఖం ఉన్నవాడు అని కాదు. ఈ విషయం ముందు ముందు సూత్రాలలో ఇంకా విశదమవుతుంది.

ఏతావతా మనకు తెలిసినదేమిటంటే ఆనందమయుడు అని చెప్పబడినది పరబ్రహ్మయే, ఎందుకంటే అమితమైన బ్రహ్మానందాన్ని "**తే యే శతమ్..తే యే శతమ్....**" అంటూ శ్రుతి గణించే ప్రయత్నం చేయడం వలన.

ఇంక మయట్ ప్రత్యయం ప్రాచుర్యమే చెబుతుందని తరువాత సూత్రంలో కూడా వివరిస్తారు.

**నేను:** మామయ్యా, సాధారణంగా "మయట్ ప్రత్యయం" వికారార్థానికే వాడడం విన్నాను. అలాంటప్పుడు

సర్వ సాధారణమైన అర్థం మానేసి వేరుగా ప్రాచుర్యార్థం గా చెప్పడం సబబే నంటారా,

అంతేకాకుండా పాణిని వ్యాకరణ సూత్రాలలో "నిత్యమ్ వృద్ధశరాదభ్యః" అని "ఆ, ఐ, ఔ" లతో పదం ప్రారంభం

అయినప్పుడు వచ్చిన మయట్ ప్రత్యయం "వికారార్థాన్ని" చెబుతుందని అంటారే. "ఆనంద" అనే పదం కూడా

ఆ తో మొదలవుతుంది కదా, అందువలన వికారార్థమే వస్తుంది కదా.

అన్నమయో యజ్ఞః, మృణ్మయమ్, హిరణ్మయమ్ వంటి చోట్ల మయట్ ప్రత్యయం వికారార్థాన్నే చెబుతుంది,

అలాగే కాదా ఇక్కడ కూడా,

మనం ఇందాకా అనుకున్నట్లు మయట్ ప్రాచుర్యాన్నే చెబుతుందంటే ఎక్కువ ఆనందం, కొంచెం దుఃఖం

ఉన్నవాడు పరబ్రహ్మ అని కాదా.

ఈ పై కారణాల వలన ఆనందమయుడు అన్నప్పుడు మయట్ ప్రత్యయం ప్రాచుర్యార్థంతో తీసుకోవాలేమో.

మామయ్య: ఈ సందేహం తీర్చడానికే తరువాత సూత్రమూ, దాని భాష్యమూ వచ్చేయి

నేను: ఏమిటి మామయ్యా అది

**మామయ్య:** విను

**"వికార శబ్దాత్ నేతి చేత్ న ప్రాచుర్యాత్"** (1-1-14) అంటే

వికారశబ్దాత్: వికారార్థమునిచ్చు (మయట్ ప్రత్యయము యొక్క ) ప్రయోగముండుటవలన

న: (ఆనందమయుడు పరమాత్మ) కాడు

ఇతిచేత్: ఇట్లు అన్నచో

న: (అట్లు ) కాదు(ఏలనన)

ప్రాచుర్యాత్: (మయట్ ప్రత్యయము) ప్రాచుర్యార్థమున ప్రయోగింపబడినదగుటచే

**నేను:** అంటే

**మామయ్య:** ఆనందమయ శబ్దముననుండు మయట్ ప్రత్యయము వికారార్థమును తెలిపేది అవడం వలన ఆనందమయుడనగా పర బ్రహ్మ కాదంటే అది యుక్తము కాదు. ఎందుకంటే ప్రాచుర్యార్థముగా మయట్ ప్రత్యయము వాడ బడడం వలన అని దానికి అర్థము.

దీనిని వివరిస్తాను చూడు. ఇక్కడ మయట్ ప్రత్యయం ప్రాచుర్యార్థమే కుదురుతుంది సందర్భాన్ని బట్టి. ఎందుకంటే శ్రుతిలో మనుష్యానందము ముందుగా చెప్పి దానికంటె మిగిలిన ఆనందాలు ఒకదానికొకటి శతాధికం అని చెబుతూ చివరకు బ్రహ్మానందాన్ని గురించి చెప్పింది. ఇలా శతాధికంగా చెప్పబడిన నిరతిశయ ఆనందము నిరుపాధికంగా జీవునికి ఉండడం అసంభవం. అందువలన అది పరబ్రహ్మకే వర్తించాలి. ఇలా పరబ్రహ్మ నిరతిశయ ఆనందము కలవాడు అంటే అది చెప్పడానికి ఆనందమయుడు అంటే మయట్ ప్రాచుర్యాన్నే బోధించాలి.

పరబ్రహ్మ కు వికారాన్ని అంటగట్టడం పరబ్రహ్మత్వానికి కుదరకపోవడమే కాదు, హాస్యాస్పదం కూడా.

మిగిలిన ప్రాణ మయ, మనో మయ, విజ్ఞాన మయ కోశాల విషయంలో కూడా ప్రాచుర్యార్థమే మయట్ వాడబడింది. ప్రాణ మయకోశమన్నప్పుడు ప్రాణము ప్రాచుర్యాన్నీ, మనోమయ కోశమన్నప్పుడు మనస్సు ప్రాచుర్యాన్నీ చెబుతుంది. అలాగే విజ్ఞాన మయుడు అన్నప్పుడు విజ్ఞానము కల జీవుడిని చెబుతున్నాము. అలాగే ఆనందమయుడు అన్నప్పుడు ఆనంద గుణము నిరతిశయంగా ఉన్న పరబ్రహ్మ ను చెబుతున్నాము. ఇక్కడ వికారార్థము ప్రసక్తే లేదు.

ఇంక నువ్వు ఇందాకా చెప్పిన ఒక్కొక్క సందేహానికి సమాధానాలు చెబుతున్నాను చూడు.

నువ్వు చెప్పినట్లు మయట్ వికారార్థం లోనే కాదు, ప్రాచుర్యానికీ ఎక్కువగానే వాడుతారు. మనం రోజూ వాడే బియ్యం రాళ్ళమయం, పప్పు ఉప్పుమయం లాంటి మాటలన్నీ అలాంటివే.

పాణిని సూత్రము అంటున్నావు, నువ్వు చెప్పిన సూత్రము అష్టాధ్యాయి లో 4 వ అధ్యాయంలో 4-4-144 వ సూత్రము. కాని తరువాత 5 వ అధ్యాయంలో 5-4-21 వ సూత్రంలో "తత్ ప్రకృత వచనే మయట్" అని మయట్ ప్రత్యయం ప్రాచుర్యార్థాన్ని చెబుతుంది అని ఉంది. పరిభాషానియమము ప్రకారం "**ఉత్తరోత్తరమ్ బలీయమ్**" అని కదా, అంటే తరువాత వచ్చిన సూత్రం ముందు సూత్రాన్ని త్రోసిరాజంటుంది అని కదా. దాన్ని బట్టి మయట్ ప్రత్యయానికి ప్రాచుర్యార్థమే ఎక్కువ సబబు.

అన్నమయో యజ్ఞః అన్నప్పుడు మయట్ ప్రత్యయానికి అర్థం ఆ యజ్ఞం జరుగుతున్నప్పుడు భోజన వితరణ విస్తృతంగా జరిగింది అని, ఆ యజ్ఞం అంతా భోజనాలే అన్నట్లు.అంటే ప్రాచుర్యార్థమే కదా.

నిరతిశయమైన ఆనందము కలవాడు, అంటే కొలదిగా దుఃఖం కలవాడు అని ఎలా చెబుతావు. ఒకవేళ దుఃఖం ఉందో లేదో తెలుసుకోవాలంటే దానికి సంబంధించిన శ్రుతి వాక్యాలు చూడాలి. దుఃఖం కర్మ పరవశుడైతే, పాపకర్మల వలన వస్తుంది. ఆయనకు కర్మ సంబంధము లేదు అనీ, పాపాలు అంటవనీ "అపహత పాప్మా" లాంటి శ్రుతి వాక్యాలు చెబుతున్నప్పుడు ఆయనకు దుఃఖం కూడా ఉందని చెప్పలేము.

మనం ఇంతకు ముందు అనుకున్న శ్రుతి వాక్యము బ్రహ్మానందాన్ని మించిన ఆనందము లేదని కదా చెబుతోంది. అటువంటప్పుడు ఆనంద ప్రాచుర్యాన్నే మయట్ ప్రత్యయం వలన అర్థం చేసుకోవాలి.

**నేను:** మఱి, జీవుడు కూడా జ్ఞానానంద స్వరూపుడు కదా, ఆ జీవుడే మట్టి నుండి కుండ వచ్చినట్లు పరబ్రహ్మగా పరిణమించలేడా.

**మామయ్య:** అలా కాదని వివరించడానికి తరువాత సూత్రము చూడాలి.

**నేను:** అదేమిటి

మామయ్య: "**తద్ధేతువ్యపదేశాచ్చ**" (1-1-15)

తద్ధేతువ్యపదేశాత్: ఈ ఆనందమయుడైన పరబ్రహ్మ జీవులకానందము కలుగ చేయువాడుగ శ్రుతులయందు చెప్పి యుండుట వలన

చ: కూడ

అంటే ఈ ఆనందమయుడైన పరబ్రహ్మమే ఈ జీవులకు ఆనందము కలుగజేయునని శ్రుతుల యందు చెప్పబడి యున్నది. ఆనందమునిచ్చువాడు, ఆనందము పొందువాడు ఒక్కరు కారు కనుక పరబ్రహ్మ జీవాత్మ కంటే ఎప్పుడూ వేరే అనునది స్పష్టము.

**నేను:** వివరించరా,

**మామయ్య:** నువ్వు చెబుతున్న తైత్తిరీయోపనిషత్తు బ్రహ్మానందవల్లిలో ఏడవ అనువాకం చూడు.

"రసోవై సః. రసమ్ హ్యేవాయమ్ లబ్ధ్వానందీ భవతి. కో హ్యేవాన్యాత్ కః ప్రాణ్యాత్. యదేష ఆకాశ ఆనందో న స్యాత్. ఏష హ్యేవానందయాతి. "

అంటే ఆ పరబ్రహ్మమే ఆనందమును కలుగ జేయును, ఆయన లేకున్న ఎవరు ప్రాణాపానాది వ్యాపారాలు చేస్తాడు? అతడు లేకపోతే ఈ ఆకాశము ఉండక పోవును. " అంటూ ఆ పరబ్రహ్మ జీవులకు ఆనందము కల్గించువాడు అని చెప్పింది ఉపనిషత్. అలాంటప్పుడు ఆనందాన్ని ఇచ్చేవాడు, పుచ్చుకొనే వాడు ఒక్కరే అవరు కదా. "యో వేద నిహితమ్ గుహాయామ్ పరమే వ్యోమన్" అన్నట్లు పరబ్రహ్మ ను హృదయ కుహరంలో

తెలుసుకున్న జీవులకు పరమ పదములో ఆయన సమక్షంలోనున్న జీవులకు ఆనందాన్ని ప్రసాదించేవాడు పరబ్రహ్మ అయినప్పుడు పరబ్రహ్మ జీవులకంటే వేరని కదా అర్థము. అందువలన పైన చెప్పబడిన ఆనందము ఆనందమయపరమని తెలుస్తోంది.

ఇలాగే తరువాత సూత్రము కూడా చూడు.

## మాంత్ర వర్ణికమేవచ గీయతే (1.1.16)

మాంత్రవర్ణికమ్: శ్రుతి మంత్రములైన ("సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ") మున్నగు వాని యందు చెప్పబడిన

ఏవచ గీయతే: పరబ్రహ్మయే (ఆనందమయుడుగా) చెప్పబడుచున్నాడు.

**నేను**: వివరించండి మామయ్యా

**మామయ్య**: ఇంతకుముందు చూసేము కద, బ్రహ్మానందవల్లి "బ్రహ్మవిత్ ఆప్నోతి పరమ్. ....సత్యమ్ జ్ఞానమనంతమ్ బ్రహ్మ." అని బ్రహ్మను తెలుసుకున్నవాడు పరమపదమును పొందుతాడు అంటూ ప్రారంభమయినది. తెలుసుకొనేవాడు, తెలుసుకొనబడేవాడు ఒకటికాదు కదా. ఇంక ఆ బ్రహ్మ ఎవరు అంటే "సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ" అని ఆయన లక్షణాలు చెప్పింది. "యో వేద నిహితమ్ గుహాయామ్ పరమే వ్యోమన్ .." అంటూ ఆయనను హృదయ కుహరంలో నున్నట్లు తెలుసుకొను జీవుల గురించి చెప్పి తరువాత "సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా విపశ్చితా" అంటూ మోక్షం పొందినవాడు పరబ్రహ్మతో కలసి ఆయన సమస్త గుణాలనూ అనుభవిస్తున్నాడు" అని ...

**నేను**: కామాన్ అంటే కోరికలు అని కాదా

**మామయ్య:** ఇంతకుముందు తెలుసుకునే ఉంటావు. "కామ్యన్త ఇతి కామాః" అంటే కోరుకొన దగినవి, అంటే ఆయన సౌశీల్య, వాత్సల్య, కారుణ్యాది కళ్యాణ గుణాలే కదా. కామాః అంటే ఆయన కళ్యాణ గుణాలన్నమాట.

ఆ సందర్భంలోనే "తదేషా భ్యుక్తా" అను వాక్యము వేదాధ్యేతలు అట్టి పరబ్రహ్మాన్ని ప్రతిపాదించ తలచి ఈ ఋక్కులు చెప్పేరని తెలుపుతోంది. అంటే బ్రాహ్మణ ప్రతిపాదితార్థాన్నే మంత్రము చెబుతోందన్నమాట.

తరువాతి వాక్యాలు "తస్మాద్వా ఏతస్మాదాత్మన ఆకాశస్సంభూతః" అంటూ పరబ్రహ్మ నుండి ఆకాశము మొదలైన సృష్టి జరిగిందని చెబుతూ ఆయన వైలక్షణ్యం చెబుతోంది. ఈ క్రమంలో ఆ బ్రహ్మానందాన్ని చెప్పి ఆ ఆనందమయుడు గా పరబ్రహ్మాన్ని చెబుతోంది శ్రుతి. ఇందువలన "సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ" ఇత్యాది శ్రుతి వాక్యాలలో చెప్పబడిన పరబ్రహ్మయే ఆనందమయుడు గా తరువాత వర్ణించబడినాడు. ఆయన జీవుడు కాడు.

**నేను:** మీరు చెప్పినట్లు సాధారణంగా ఉపాసకుడు, వాడు పొందే ప్రాప్యము వేరుగా ఉంటాయన్నది నిజమేకావచ్చు. కాని ఈ సందర్భంలో అలా కుదరనక్కరలేదేమో. ఎందుకంటే అవిద్య అంతా పోయిన తరువాత పరిశుద్ధమై నిర్విశేష చిన్మాత్రైక రసమైన ఉపాసకుని స్వరూపము నే కదా "సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ" అని శ్రుతి తెలుపుతోంది. అక్కడ సత్యము, జ్ఞానము, అనంతము మీరు చెప్పి నట్లు గుణాలుగా కాక అసత్యము కానిది,...అంటూ అర్థం చెప్పుకుంటే సరిపోతుంది. ఆ బ్రహ్మనే "యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ" అనే శ్రుతి వాక్యము దానినే అవాఙ్మానసము అని నిర్విశేషముగ చెప్తోంది. ఈ వాక్యాల వలన జీవుని పరిశుద్ధ స్వరూపమే చెబుతున్నట్లుంది కాని, ఆనందమయుడు జీవునికంటె వేరయినవాడు అని ఉన్నట్లు లేదే.

అంతేకాకుండా "సహ బ్రహ్మణా విపశ్చితా" అన్నప్పుడు విపశ్చితా అను పదము అవిద్యా నివృత్తి పొందిన పరిశుద్ధమైన ముక్తాత్మ అని ఎందుకు అనుకోకూడదు.

**మామయ్య:** దీని వివరణ కోసం తరువాత సూత్రం చూడాలి.

**"నేతరః అనుపపత్తేః"** (1-1-17)

ఇతరః: బ్రహ్మేతరుడగు ముక్తజీవుడును

న: (ఆనందమయుడు ) కాడు

అనుపపత్తేః: (ఏలనన) ముక్తునికి నిరుపాధికమగు విపశ్చిత్త్వముండుట అసంభవము అగుట వలన

అంటే ముక్తపురుషునికి విపశ్చిత్తముండుట అసంభవమవడం వలన ముక్త పురుషుడు కూడ

ఆనందమయుడు కాడు.

**నేను:** వివరించరా మామయ్యా,

**మామయ్య:** ఇక్కడ నీ ఱెండు ప్రశ్నలకు సమాధానము చెబుతున్నారు

మొదటిది పరిశుద్ధమైన నిర్విశేష చిన్మాత్రైకరసమైన ఉపాసకుడైన జీవుడే పరబ్రహ్మము కాకూడదా  అనికదా. దీనికి సమాధానము ఉపనిషత్తులో భృగువల్లిలో భృగు, వరుణ సంవాదంలో "**యతోవా ఇమాని భూతాని జాయంతే..**" అంటూ పరబ్రహ్మయే జగత్కారణుడు అని చెప్పబడింది. ఆ పరబ్రహ్మ అన్నం, ప్రాణం, మనస్సు, ఆత్మ కాక ఆనందమయుడే అని నిర్ణయిస్తుంది ఉపనిషత్తు.ఆ ఆనందమయుడైన పరబ్రహ్మయే తన సంకల్పము చేత సృష్ట్యాదులు చేస్తాడని "**తదైక్షత బహుస్యామ్**" అని చెబుతుంది, అందువలన ఆయన ప్రకృతి వలె కాక చేతనత్వము కలవాడని తెలుస్తోంది. "**సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ**" అనుట వలన ఆయన సత్య, జ్ఞానాది గుణములు కలవాడుఅనగా నిర్విశేషుడు కాడు అని తెలుస్తోంది. నువ్వు చెప్పినట్లు "**యతో వాచో నివర్తంతే అప్రాప్య మనసాసహ**" అన్న వాక్యము నిర్విశేష వస్తువును ప్రతిపాదించలేదు. అలా కాకుండా వాఙ్మనస్సులు బ్రహ్మమును తెలుపు ప్రమాణము కావని అంటే పరబ్రహ్మ తెలియబడనేరని కుందేటి కొమ్ములా తుచ్ఛమవుతాడు. అది సరి కాదు కదా.  ఈ జగత్తంతా సృజించిన వాడని, ఆ సృజించిన వాటిలో అంతర్యామి

గా ఉండేవాడని, భయాభయ హేతువని, వాయువు, ఆదిత్యుడు మున్నగు వాటిని నియమించు వాడని మానుషానందము నుండి మొదలుపెట్టి శతాధికంగా గుణిస్తే నిరవధికానందము కలవాడని ఇట్లు అనేకవిధాలుగా చెప్పినప్పుడు ఆపై వాఙ్మనస్సులకు బ్రహ్మతో ప్రవృత్తే లేదని పరబ్రహ్మ ను తెలుసుకొనుటకు ప్రమాణమే లేదనడం సరికాదు. "ఆనందమ్ బ్రహ్మణః విద్వాన్" అన్నప్పుడు బ్రహ్మ యొక్క(బ్రహ్మణః) ఆనందము అంటూ షష్టీ విభక్తి కదా వాడబడింది అంటే వాఙ్మనస్సులకు అగోచరమైన బ్రహ్మానందాన్ని తెలుసుకున్నవాడు అని అర్థము. అంటే బ్రహ్మ, ఆయనకు సంబంధించిన ఆనందమూ ఉన్నట్లేకదా. ఆ బ్రహ్మానందము చెప్పనలవి కాదు అని చెప్పడానికే "**యతో వాచో నివర్తంతే ...**" అన్న శ్రుతి వాక్యము. అంతే తప్ప బ్రహ్మ  నిర్విశేషమని చెప్పడానికి కాదు. అట్టి బ్రహ్మానందాన్ని తెలుసుకొనిన విద్వాంసుడు అభయము పొందుచున్నాడు అని ఆ శ్రుతి అర్థము.

పొందిన వాడు, పొందించేవాడు ఒకరు కారు కనుక జీవుడు బ్రహ్మ కాలేడు.

రెండవది "విపశ్చితా" ఆ పదము అన్నప్పుడు ముక్తాత్మకు ఎందుకు వర్తించదని కదా. బ్రహ్మణా విపశ్చితా అన్నప్పుడు ఒకే లింగ, వచన, విభక్తులుండడం వలన విపశ్చితా అన్న పదం బ్రహ్మకే వర్తిస్తుంది. "విపశ్చిత్" అంటే అర్థం చూడు. ఈ పదం పృషోదరాది గణానికి సంబంధించినది.

**నేను:** అంటే ఏమిటి మామయ్యా!

**మామయ్య:** పాణిని సుమారుగా 2,200 ధాతువులను చెప్పి ఆధాతువులనుండి శబ్దాలకు వ్యుత్పత్తి ఎలాగో కూడా చెప్పేడు. కాని కొన్ని పదాలను అవ్యుత్పన్న ప్రాతిపదికములని నిర్వచించేడు. అంటే వీటికి సాధారణ వ్యుత్పత్తి నియమాలు వర్తించవన్నమాట. అందులో పృషోదరాది పదగణానికి చెందినది ఈ విపశ్చిత్ అన్న పదము "పృషోదరాదీని యథోపవిష్టమ్" పృషోదరాదిత్వాత్ సాధుః" అని చెబుతుంది పాణిని అష్టాధ్యాయి. దాని

ప్రకారం "వివిధమ్ పశ్యచ్చిత్త్వమ్" అంటే వివిధమ్:నానా విధములుగా అంటే సర్వదేశ, సర్వ కాల సర్వావస్థలలో

పశ్యత్: తెలుసుకొనుచుండు

చిత్త్వమ్: జ్ఞానమును కల్గి యున్నవాడు. అని అర్ధము. ఛాందోగ్య ఉపనిషత్ దహరవిద్యోపాసన సందర్భంలో సత్యకామ, సత్య సంకల్పాది గుణాలు పరబ్రహ్మ కు నిరుపాధికమని ఆయన కృపవలన ముక్తాత్మకు సంక్రమిస్తాయని కదా చెప్పింది. అంటే సత్య సంకల్పాది గుణాలు ముక్తాత్మకు స్వాభావికం కాదు, ఎందుకంటే ముక్తుడు కాకుండా ఉన్న బద్ధదశలో ఈ గుణాలు జీవునికి ఉండవు. "సః అకామయత బహుస్యామ్" అన్న శ్రుతి వాక్యం వలన సత్య సంకల్పాది గుణాలు పరబ్రహ్మ స్వాభావికమని తెలుస్తోంది. ఎందుకంటే "సత్ ఏవ ఆసీత్" అని కదా, మరొక ఉపాధి ఉండడానికి అవకాశము లేదు బ్రహ్మకు అప్పుడు. అందువలన ముక్తునికి విపశ్చిత్త్వము కుదరదు. ఇంక ముక్తుడు నిర్విశేష చిన్మాత్రుడంటే ఈ సత్య సంకల్పాది గుణాలుండడం అసలే కుదరదు. అందుచేత విపశ్చిత్త్వము ఎంతమాత్రము సంభవము కాదు.

అంతే కాదు, తరువాత సూత్రము కూడా చూడు

**నేను**: ఏమిటి మామయ్యా!

## మామయ్య:

### "**భేదవ్యపదేశాచ్చ**(1-1-18)"

భేదవ్యపదేశాత్: (శ్రుతులు జీవుడు ఆనందమయుని కంటె ) భిన్నుడని చెప్పుట వలన

చ: కూడ

శ్రుతులు జీవుడు ఆనందమయుని కంటే వేరయిన వాడని చెప్పుట వలన జీవుడు ఆనందమయుడైన పరబ్రహ్మ కంటే భిన్నుడు.

వివరిస్తాను, చూడు. "**తస్మాత్ వా ఏతస్మాత్ ఆత్మన ఆకాశ...**" అని ప్రారంభించిన ఉపనిషత్ "తస్మాత్ వా ఏతస్మాత్ విజ్ఞానమయాత్ అన్యః అంతర ఆత్మా ఆనందమయ" అని ప్రాణము కంటె మనస్సుకంటె విజ్ఞానమయుడు అనగా జీవుడు కంటె ఆనందమయుడు అయిన పరబ్రహ్మ వేరయి నట్లు ఇదే ఉపనిషత్ చెబుతోంది కదా. అందువలన జీవాత్మ పరబ్రహ్మ కాదు.

**నేను:** జీవుడు సృష్టి చేయలేడా, కుమ్మరి కుండలు చేస్తున్నట్లు

**మామయ్య:** తరువాత సూత్రము చూడు

**"కామాచ్చ నానుమానాపేక్షా**(1-1-19)

కామాత్ చ: తన కోరిక చేతనే (జగత్తును సృజించి నట్లు వేదమునందు చెప్పబడి యుండుట చేత),

అనుమాన అపేక్షా: (ఇతనికి) అచిత్సంయోగము యొక్క అపేక్ష

న: ఆవశ్యకత లేదు

ఈ ఆనందమయుడు తన కోరిక వలన జగత్తును సృజించినట్లు వేదమునందు చెప్పబడినందున ఈతనికి ఆ సృష్ట్యాది కార్యములకు అచిత్సంబంధము అవసరము కాదు.

నువ్వు చెప్పినట్లు ఏ జీవుడైనా ఏదయినా వస్తువును తయారుచేయాలి అంటే అచిత్పదార్థము అవసరముంటుంది. నువ్వు నీ శరీరాన్ని ఉపయోగించి మట్టితో కుండ చేసేవంటే అక్కడ శరీరమూ, మట్టీ లాంటివన్నీ అచిత్పదార్థాలే.

**నేను**: మఱి ఆలోచనలో

**మామయ్య**: దానికీ మనస్సు, బుద్ధి కావాలి కదా, అవీ అచిత్పదార్థాలే. కాని తానొక్కడూ "**తదైక్షత బహుస్యామ్**" "**సర్వమ్ అస్రుజత**" అన్నట్లుగా కేవలము తన సంకల్పముచే సృష్ట్యాది కార్యాలు చేసే ఆనందమయుడైన పరబ్రహ్మకు అచిత్ అవసరము లేదు. అందుచేత పరబ్రహ్మ జీవునికంటె భిన్నుడు.

తరువాత సూత్రము కూడా చూడు

## "అస్మిన్నస్యచ తద్యోగమ్ శాస్తి(1-1-20)"

అస్మిన్: ఈ ఆనందమయుని యందు

అస్య: ఈ జీవునికి

తద్యోగమ్: ఆనంద సంబంధమును

శాస్తి: శాస్త్రము తెలుపుచున్నది

చ: కూడ

శాస్త్రము ఈ జీవుడు ఆనందము పొందునది పరబ్రహ్మ వలననే అని తెలుపుచుండుట వలన (జీవుడు, పరబ్రహ్మ ఒక్కరు కారు)

జీవునికి ఆనందయోగము సంక్రమించేది పరబ్రహ్మ వలననే నని శ్రుతి చెబుతోంది. నువ్వు చెప్పిన ఉపనిషత్ లోనే "**రసోవై సః రసమ్ హ్యేవాయమ్ లబ్ధ్వా ఆనందీ భవతి**" అనగా రసమనబడు ఆనందమయుని జీవుడు పొంది ఆనందము కలవాడు అవుతాడు. అంటే ఆనందమును ఇచ్చువాడు, పొందువాడు ఇద్దరూ ఒక్కరవరు కదా.

"ఆనందమ్ బ్రహ్మణో విద్వాన్" అనగా బ్రహ్మ యొక్క ఆనందమును తెలుసుకున్న విద్వాంసుడు

"ఆనందమ్ అయమ్ ఆత్మానమ్ ఉపసంక్రామతి" అనగా జ్ఞాని యగు పురుషుడు ఆనందమయుడిని పొందుచున్నాడు. అంటే ఆనందమయుడే పొందబడే పరబ్రహ్మ అని తెలుస్తోంది.

అంతేకాక భృగు వరుణ సంవాదంలో అన్నమయాదుల ఉత్తరానువాకమున "అన్నమ్ బ్రహ్మేతి విజానాత్" అనీ "ప్రాణమ్ బ్రహ్మేతి విజానాత్" అనీ "మనో బ్రహ్మేతి విజానాత్ " అనీ "విజ్ఞానమ్ బ్రహ్మేతి విజానాత్" అనీ చెప్పి చివరకు "ఆనందో బ్రహ్మేతి" అని చెప్పడం వలన ఆనంద శబ్దముచేత ఆనందమయుడే చెప్పబడుతున్నాడు.

**నేను**: ఆనంద అన్నా ఆనందమయుడన్నా ఒక్కటేనా,

**మామయ్య**: ఇంతకుముందు అనుకున్నట్లు ఆనందమయుడు అంటే మయట్ ప్రాచుర్యార్థము కనుక ఆనందము బాగుగా కలవాడు అని అర్థము. స్వరూపమును నిరూపించే శబ్దాలు ధర్మమును తెల్పుతూ ధర్మయుక్తమైన పదార్థమునుకూడా తెలుపుతాయి. అందువలన ఆనందమయుడు, ఆనందవాన్, ఆనందిన్, ఆనంద అని కూడ వాడ వచ్చును.

పైన చెప్పబడిన కారణాలవలన బ్రహ్మము జీవుని కంటె వేరయిన వాడని తెలుస్తోంది. ఈక్షత్యధికరణంలో "తదైక్షత" మున్నగు పరబ్రహ్మ ప్రకృతి కంటే భిన్నుడనీ, విజ్ఞానమయ, ఆనందమయ కోశములను వేరుగా నిర్వచించి "బ్రహ్మవిదాప్నోతి పరమ్" "సోశ్నుతే సర్వాన్ కామాన్ సహ బ్రహ్మణా.." అని చెప్పడం వలన జీవుడు పరబ్రహ్మను పొంది ఆయన గుణాలను ఆయనతో కూడ అనుభవిస్తాడని చెప్పడం వలన జీవుని కంటే పరబ్రహ్మ వేరని తెలుస్తోంది.

దీనితో "ఆనంద మయాధికరణము" పూర్తి అయింది.

మొదటి నాల్గింటినీ,ఈ రెండు అధికరణాలనూ కలిపి బ్రహ్మసూత్రాలకు ఉపోద్ఘాతమని చెప్పవచ్చు. తరువాత వచ్చే సూత్రాలున్నీ వీటి ప్రాతిపదిక మీదనే నడుస్తాయి.

**అమ్మ**: బాగుంది మామయ్యా, ఈ అధికరణంలో

శతాధికమని శ్రుతిలో చెప్పడం వలన ఆనందమయ వాచ్యుడు అయిన పరబ్రహ్మ విజ్ఞానమయ వాచ్యుడైన జీవుని కంటే వేరనీ, అందులో మయట్ ప్రత్యయం ప్రాచుర్యాన్నే చెబుతుందనీ, ఆ జీవుల ఆనందానికి కారణం పరబ్రహ్మే కనుక ఆ ఇద్దరూ ఒక్కరు కారనీ, సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ లాంటి శ్రుతులలో చెప్పబడిన పరబ్రహ్మయే ఆనందమయ వాచ్యుడనీ, సత్య సంకల్పాది గుణాలు స్వాభావికం కాకపోవడం వలన విపశ్చిత్ అను పదము ముక్త జీవునికి వర్తించదు కనుక ముక్త జీవుడు కూడా బ్రహ్మ కంటే భిన్నుడనీ, శ్రుతులు కూడా జీవుడు ఆనందమయుని కంటే భిన్నుడనే చెబుతున్నాయనీ, పరబ్రహ్మ జగత్సృష్ట్యాదులకు కేవలము తన సంకల్పం తో చేస్తాడు కాని జీవునికి వలె అచిత్పదార్థాల అవసరం ఉండదని, జీవునికి ఆనందయోగము కలిగేది ఈ ఆనందమయుడైన పరబ్రహ్మ యందే అవడం వలన పొందేది, పొందబడేది ఒకటి కావు కనుక పరబ్రహ్మ జీవుని కంటే భిన్నము, ఆయనే సృష్ట్యాదులకు కారణము అని తెలిసింది మీ అనుగ్రహం వలన

**మామయ్య**: నాదేముందమ్మా, పూర్వాచార్యుల, భగవద్రామానుజుల కృప. వారిని స్మరించుకొని ఈ రోజుకు ఆపుదాం. మళ్ళీ మరొకసారి కలుసుకుందాం.

**అందరూ**: యోనిత్యమచ్యుత...

---

# 3 . అన్తరధికరణమ్:

**మామయ్య:** రండి రండి చాలా రోజులయిపోయింది మనం కలుసుకొని, ఈ మధ్య మీరు రాకపోవడం వలన నాకూ ఏదో వెల్తిగా ఉంటోంది, మనము చదువు కోవడం లేక

**అమ్మ:** అవును మామయ్యా, ఏవో సంసార తాపత్రయాలు, దానికి తోడు రామ నవమి నవరాత్రులా, తెరిపి లేకుండా అయి పోయింది, పారాయణలూ, ప్రవచనాలూ నాకూ మావారికీ, పరీక్షలు మావాడికీను. మాకూ ఇన్నాళ్ళూ మీ సత్సంగము లేక ఏదో తప్పు చేసి నట్లు అపరాధ భావనే. మాకు ఆర్తి తక్కువవడం వలన కాబోలు, ఈ అంతరాయాలు.

మామయ్య: జీవితం అన్న తరువాత అవన్నీ తప్పదు కదమ్మా, ఇంతకూ మనం ఎక్కడి దాకా వచ్చేం?

**నేను:** పరబ్రహ్మ అంటే చిత్, అచిత్ లకు భిన్నము అని చెప్పేరు మామయ్యా ఆనందమయాధికరణము లోనూ, ఈక్షత్యధికరణంలోనూ. మీరు చెప్పినట్లే సామాన్యమైన మాలాంటి వాళ్ళ కంటే పరబ్రహ్మ వేఱు అనడం బాగానే ఉంది, కాని బ్రహ్మేంద్ర, రుద్రాదిత్యులవంటి దేవుళ్ళ కంటే కూడా వేఱేనా పరబ్రహ్మ. మఱి వాళ్ళనూ దేవుళ్ళనే అంటాము, కావలసిన వాటికోసం వాళ్ళను ప్రార్థిస్తాము, అందువలన మనకు కావలసిన ప్రయోజనాలు సిద్ధిస్తూంటాయి కూడానూ. అంతెందుకు కొన్ని కొన్ని ఉపనిషత్తులలో వాళ్ళే పరబ్రహ్మగా వర్ణించ బడతారు కూడా కదా!

**మామయ్య:** ఏ ఉపనిషత్తులో అంటావు?

**నేను:** ఛాందోగ్యోపనిషత్తులో చూడండి, "య ఏషః అంతరాదిత్యే హిరణ్మయః పురుషో దృశ్యతే హిరణ్యశ్మశ్రుః హిరణ్య కేశ అప్రణఖాత్ సర్వ ఏవ సువర్ణః తస్య యథా కప్యాసమ్ పుండరీకమేవమ్ అక్షిణీ ..."

**మామయ్య:** దానికి అర్థం కూడా చెప్పు

**నేను:** "అక్కడ కనబడుతున్న ఆదిత్యుడు అంటే సూర్యుని యందు బంగరు మీసములు, బంగరు కేశములు తో నఖాది పర్యంత శరీరమూ పసిడి చాయతో నుండి మర్కట పృష్ఠమును పోలి ఎఱ్ఱగా ఉండెడి పద్మముల వంటి కనులు కలిగిన హిరణ్మయ పురుషుడు ఉత్ అను నామము కలవాడు. ఇతడు సర్వ పాప విముక్తుడు. ఇతనినెవ్వరుపాసించెదరో వారు సర్వ పాప విముక్తులు" అని ఇక్కడ ఛాందోగ్యోపనిషత్ లో ఆదిత్యుడు పరబ్రహ్మ గా కీర్తించబడుతున్నాడు కదా. అలాగే ...

**మామయ్య:** ఆగాగు. అక్కడ "ఆదిత్యే హిరణ్మయః పురుషః" అంటే ఆదిత్యుడని ఎలా చెబుతున్నావు. సంధ్యావందనం చేస్తూంటావు కదా. ధ్యేయః సదా..

**నేను:** అవును, "ధ్యేయః సదా సవితృమండల మధ్యవర్తీ నారాయణ సరసిజాసన ..."

**మామయ్య:** కదా, సవితృమండల మధ్యవర్తి నారాయణుడు. ఆయనే పరబ్రహ్మ. ఆదిత్యుడు కాదు. మనం ఉపాసించడానికి తగినట్లుగా పరబ్రహ్మ స్వరూపాన్ని వర్ణిస్తున్నారు ఇక్కడ. హిరణ్యశ్మశ్రుః అంటూ. అపహత పాప్మ అయిన ఆయనకే సర్వ పాప విముక్త శబ్దం చెల్లుతుంది. ఆధికారిక పురుషుడైన సూర్యునికి కాదు.

తరువాత నువ్వు కప్యాసమ్ పుండరీకమేవమ్ అక్షిణీ అన్న దానికి కప్యాసమ్ అంటే కపి పృష్ఠము అని చెప్పడం సరి కాదు. యాదవ ప్రకాశులు ఇలా అర్థం చెబితేనే శతకోటి మన్మథాకారుడు, అపూర్వ సౌందర్యరాశి దివ్యశరీరుడు అయిన పరబ్రహ్మ నేత్రాలకు మర్కట పృష్ఠ దృష్టాంతమును విని భగవద్రామానుజులకు కన్నీరు మున్నీరయినదట, నా తండ్రి నేత్రాలను ఇలా వర్ణిస్తున్నారే అని.

**నేను:** కప్యాసమ్ అంటే కపి అంటే కోతి, ఆసమ్ అంటే పృష్ఠము కాదా. అయినా అక్కడ పరబ్రహ్మ నేత్రాలను కప్యాసమ్ తో పోల్చలేదే, కప్యాసమ్ వంటి ఎఱుపు దనము గల నేత్రాలన్నారంతే.

**మామయ్య**: పరబ్రహ్మ నేత్రాల రంగుకు మాత్రము అటువంటి ఉపమానము తగునా, అందుకే భగవద్రామానుజులు దానికి సరి అయిన అర్థం చెప్పేరు.

**నేను**: ఏమిటని

**అమ్మ**: మీరు కొంచెం వివరించండి మామయ్యా ఆ శ్రుతి సందర్భాన్నీ, అర్థాన్నీ

**మామయ్య**: ఈ వాక్యాలు ఛాందోగ్యోపనిషత్ లోవి అమ్మా. పరబ్రహ్మ ఉపాసనా వివరాలు చెబుతూ ప్రణవోపాసన గురించి చెప్పి, అంతరాదిత్య విద్యా, అంతరక్షి విద్యా అనే బ్రహ్మ విద్యలు వివరించే సందర్భం లో వస్తాయి ఈ వాక్యాలు.

**అమ్మ**: ఆ విద్యలేమిటో కొంచెం క్లుప్తంగా చెప్పరా మామయ్యా!

**మామయ్య**: 32 బ్రహ్మ విద్యలలోవే ఈ అంతరాదిత్య విద్యా, అక్షి విద్యా కూడా. పరబ్రహ్మను ఉపాసన చేయాలంటే శుభాశ్రయమైన స్వరూపము కావాలని ఇంతకు ముందు అనుకున్నాము కదా. ఆ పరబ్రహ్మ స్వరూపాన్ని ఆదిత్యమండల అంతర్వర్తి గా గుర్తించి ఉపాసన చేసే విద్యకు అంతరాదిత్య విద్య అని పేరు. మఱి ఉపాసన చేయడానికి ఆ పరబ్రహ్మ స్వరూపం ఏమిటి అంటే మేలి బంగరు చాయతో, బంగారు మీసములతో బంగారు కేశములతో ఆనఖాగ్రమూ బంగారు రంగుతో పద్మ నయనములతో సర్వ పాప రహితుడైన హిరణ్మయ పురుషుడైన పరబ్రహ్మను ఉపాసించిన వాడు సర్వ పాప విముక్తుడవుతాడు అని చెబుతున్న సందర్భంలో పద్మనయనానాలను వర్ణించే శ్రుతి వాక్యము "**కప్యాసమ్ పుండరీకమేవమక్షిణీ**" అని. అలాగే "**య ఏతస్మిన్ పురుషో యశ్చాయమ్ దక్షిణే అక్షిన్ ఇతి....**" కుడి నేత్ర మధ్యములో ఏ పురుషుడు కనబడుతున్నాడో ఆయనే

పరబ్రహ్మ అని కూడా చెబుతుంది శ్రుతి. ఈ రకంగా ఉపాసించే విద్యకు అక్షి విద్య అని పేరు. ఇలా ఆదిత్యుడి లోను, నేత్రమునందూ ఉన్నట్లు చెప్పబడే పురుషుడు పరబ్రహ్మ అని వర్ణిస్తున్నారు అన్న మాట.

ఇందులో "**కప్యాసమ్ పుండరీకమేవమక్షిణీ**" అన్న దానికి రామం అంటున్న మర్కటపృష్ట దృష్టాంతాన్నే కాకుండా మన లాంటివారు తప్పుదారి పట్టకుండా మఱి కొన్ని అపార్థాలకు కూడా ఎలా అర్థం సరిపడదో భగవద్రామానుజులు వివరించి సరిఅయిన అర్థాలను సిద్ధాంతీకరించేరు.

అందులో ఒక అపార్థము,

కపి అంటే ఆదిత్యుడు. (కపిర్బిభర్తి తేజనమని వైదిక ప్రయోగం ఉంది కదా)

ఆసమ్ అంటే మండలము.

అంటే కప్యాసమ్ అంటే ఆదిత్య మండలము. అంటే ఆదిత్య మండలము, హృదయ పుండరీకము పరబ్రహ్మకు ఉపాసనా స్థానాలు. అలాగే ఆ ఉపాసకుడి యొక్క నేత్రద్వయము కూడా ఉపాసనా స్థానమే అని ఒక అర్థము చెప్పేవారు కూడా ఉన్నారు. కాని ఇలా సరిపోదు. ఎందుకంటే పుండరీకమని ఉంది కదా అని హృదయ పుండరీకమనే పదాన్ని తెచ్చి పెట్టుకొని, తరువాత శ్రుతి వాక్యంలో ఉన్న పుండరీక శబ్దాన్ని పక్కన పెట్టి అందులో హృదయ శబ్దానికి ప్రాధాన్యతనిచ్చి హృదయ పుండరీకము అంటే హృదయము ఉపాసనా స్థానము అని చెప్పడం సబబు కాదు కదా.

అలాగే ఉపాసకుడి నేత్రద్వయము ఉపాసనా స్థానము అని చెప్పడం కూడా తప్పు. ఎందుకంటే "**అయమ్ దక్షిణే అక్షిన్**.." అని కుడి కన్ను అని ఏక వచనం ఉంది తప్ప నేత్ర ద్వయం అని ద్వివచనము లేదు అక్షి విద్యా సందర్భంలో. ఈరకంగా అర్థం చెప్పడం సందర్భోచితమూ కాదు, చెప్పబడుతున్న బ్రహ్మ విద్యలకూ కుదరదు.

ఇంక కపిపృష్ట దృష్టాంతము ఇందాకా అనుకున్నట్లు నిరవద్యమూ, అపౌరుషేయమూ అయిన ఉపనిషత్తూ చెప్పదు, పరబ్రహ్మ విషయంలో కలలో కూడా ఊహింప శక్యమూ కాదు.

అమ్మ: అయితే అసలు అర్థం ఏమని చెప్పేరు భగవద్రామానుజులు

మామయ్య: ఒక్కముక్కలో మూడు అర్థాలు వచ్చే టట్లు "గంభీరాంభస్సముద్భూత సుమృష్ట నాళ రవికరవికసిత పుండరీక దళ అమలాయతేక్షణః" అన్నారు.

అమ్మ: అంటే

మామయ్య:

1. కే: జలములందు

    అప్యాసమ్: నిలబడి యుండిన

    పుండరీకమేవమక్షిణీ : తామరల వంటి నేత్రద్వయము కల

2. కమ్: నీటిని

    పిబతి: త్రాగు (తామరకాడ యందు) ఆసమ్: ఉండిన

    పుండరీకమేమక్షిణీ: ఇంతకుముందులాగే అర్థం

3. కమ్: జలమును

    పిబతి: ఆకర్షించు చున్న (సూర్యుడు)

    ఆస్యతే: వికసింపజేయబడుచున్న

    పుండరీక...: ఇంతకుముందు లాగే అర్థం

ఈ పై మూడు అర్థాలూ కలుపుకుంటే

లోతయిన జలములయందు నీటిని బాగుగా పీల్చి దృఢముగానున్న తామరకాడ పైనున్న, సూర్యకిరణములచే వికసించిన విశాలమైన పుండరీక దళముల వంటి నేత్రద్వయము కలవాడు. అని అర్థము.

**అమ్మ**: చాలా బాగా చెప్పేరు, విశాలమైన దళాలని శ్రుతిలో లేదే

**మామయ్య**: నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్ వంటి ఆళ్వారాచార్యుల ననుసరించి అలా చెప్పేరు

నాన్నగారు: అంతేకాదు. నేత్ర ద్వయము అనడం వలన చతుర్ముఖ బ్రహ్మ, త్రినేత్రుడైన రుద్రుడు, సహస్రాక్షుడైన ఇంద్రుడు పరబ్రహ్మ కాదని చెప్పకనే చెప్పింది అన్నమాట ఉపనిషత్ . మఱి తక్కిన దేవతల మాట చెప్పేదేముంది. వాళ్ళెవ్వరూ పరబ్రహ్మ కాదనే కదా.

**నేను**: భగవద్రామానుజులు తన సంస్కృత జ్ఞానాన్ని ఉపయోగించి అందంగా అర్థం చెప్పేరా శ్రుతి వాక్యానికి

మామయ్య: ప్రారంభంలో "భగవద్బోధాయన కృతామ్....తన్మతానుసారేణ సూత్రాక్షరాణి వ్యాఖ్యాస్యంతే" అని ప్రతిజ్ఞ చేసిన భగవద్రామానుజులు మరొకలా ఎలా చెబుతారు. బోధాయన మహర్షిని అనుసరించే చెప్పేరు.

**అమ్మ**: మనమందరమూ పరమాత్మ నారాయణుడు నీలమేఘశ్యాముడు అని అంటాము కదా, మఱి ఇక్కడ బంగారు రంగు అని ఎందుకు అంటున్నారు. లేక ఈయన నారాయణుడు కాదా!

**మామయ్య**: "ఆదిత్య వర్ణమ్ తమసః పరస్తాత్" అని కూడా చెప్పింది కదమ్మా శ్రుతి. ఇక్కడ హిరణ్మయ శబ్దము స్వర్ణము వలె ప్రకాశవంతమై, ఉజ్జ్వలమై ఉండడాన్ని, వైశుద్ధ్యాన్ని తెలియ చేస్తుంది. ఇక్కడ ఉపాసనకు జాజ్జ్వల్యమానంగా ప్రకాశిస్తున్న పరబ్రహ్మ స్వరూపమును నిర్దేశిస్తోందన్నమాట శ్రుతి. లావణ్యమంటే సముదాయ శోభ, సౌందర్యమంటే అవయవ శోభ కదా, ఆ రెండూ వర్ణింపబడుతున్నాయి. ఆ

వాక్యంలోనే "స ఏష సర్వేభ్యో పాప్మభ్యః ఉదితః" అని అన్నారు కదా. అంటే అతడు ఎట్టి పాపములతో సంబంధము లేనివాడని అర్థము. పాప , పుణ్యాలు కర్మ సంబంధితములు. అంటే ఆయన కర్మ వశ్యుడు కాదన్న మాట.

**నేను:** మఱి శరీరాన్ని వర్ణిస్తున్నప్పుడు, శరీరము ఎప్పుడైనా కర్మానుసారము ప్రియాప్రియ యోగమును అనగా ఇష్టానిష్టాలను కలుగ చేయడానికి కదా ఏర్పడేది. "న హ వై సశరీరస్య సతః ప్రియాప్రియయోః అపహతిరస్తి అశరీరమ్ వా న సంతం న ప్రియాప్రియే స్పృశతః" అంటే శరీర సంబంధం ఉంటే కర్మ సంబంధిత సుఖ దుఃఖాలకు వశుడై ఉండాలి కదా.

**మామయ్య:** నువ్వు చెప్పినది జీవులకు వర్తిస్తుంది. మన మన కర్మల బట్టి దేవ, మనష్య, తిర్యక్ శరీరాలు లభించడం జరుగుతుంది. కాని పరబ్రహ్మ శరీరము అప్రాకృతము, దివ్యము. విజరో, విమృత్యుః, విజిఘిత్సః, అపిపాసః అంటూ పరబ్రహ్మ గుణాలు చెబుతాము కదా. అందువలన ఆయనను "ఏష సర్వ భూతాంతరాత్మా అపహత పాప్మా, దివ్యో దేవ ఏకో నారాయణః" అని వర్ణిస్తుంది శ్రుతి. అంటే కర్మలు, తద్వారా సంక్రమించే పాపాలూ లేనివాడాయన.

**నేను:** నిత్యుల శరీరాలు కూడా అలాగేనా

**మామయ్య:** అవి కూడా పరమాత్మ అనుగ్రహం వలన వచ్చినవి. కేవలం పరమాత్మకు మాత్రమే నిరుపాధికత వర్తిస్తుంది.

**నేను:** శరీరమంటే త్రిగుణాత్మకం కాదా!

**మామయ్య:** పరమాత్మ విషయంలో శరీరం త్రిగుణాత్మకం కాదు. ఆయన సకలేతర విలక్షణుడు, నిరవధికాతిశయ కళ్యాణ గుణాకరుడు, సత్యకామ, సత్యసంకల్పాది దివ్య గుణ సంపన్నుడు, నిత్య, నిరవద్య, నిరవతిశయ ఔజ్జ్వల్య, సౌందర్య, సౌకుమార్య, లావణ్య, యౌవనాది అనంత గుణ సంఘాతుడు, అపార కారుణ్య, సౌశీల్య, వాత్సల్య, ఔదార్యాది గుణోపేతుడు, నిరస్త నిఖిల హేయ గంధుడు, అపహతపాప్ముడు. ఈ జగత్ సృష్టి, స్థితి, లయాది కార్య కారకుడు. వికార రహితుడు,

అందుకే ఆయన గుణాలు "పరాస్య శక్తిః వివిధైవ శ్రూయతే స్వాభావికీ..." అని స్వాభావికమైనవి, నిరుపాధికమైనవి అని చెబుతాం. "తమీశ్వరాణామ్ పరమమ్ మహేశ్వరమ్ తమ్ దైవతానామ్ పరమమ్ చ దైవతమ్" అని ఆ పరబ్రహ్మ శాసకులలో గొప్ప శాసకుడు, దేవతలలో గొప్ప దేవత, అనిన్నీ

"న చాస్య కశ్చిత్ జనితా న చ అధిపః" అంటూ ఆయనకు సముడు అధికుడు ఎవ్వరూ లేరు అని అంటుంది శ్రుతి. "సర్వే నిమేషా జజ్ఞిరే విద్యుతః పురుషః" అంటే సకల కాలములలో మెఱుపు వలె ప్రకాశించుచుండు పురుషుడని చెబుతూ ఆయనకు ప్రకృతి సంబంధాన్ని, కర్మ సంబంధాన్ని ప్రతిషేధిస్తుంది శ్రుతి.

అలాగే "అజాయమానో బహుధా విజాయతే" అనగా కర్మ వలన కాక మనలనుద్ధరింప అనేక విధములుగా జన్మిస్తాడని కదా శ్రుతి వాక్యము.

భగవద్గీతలో "అజోపిసస్ అవ్యయాత్మా భూతానామ్ ఈశ్వరోపి సస్ ప్రకృతిమ్ స్వామ్ అధిష్టాయ సంభవామి ఆత్మ మాయయా" అనియు

"పరిత్రాణాయ సాధూనామ్ వినాశాయచ దుష్కృతామ్ ధర్మ సంస్థాపనార్థాయ సంభవామి.." అని నా సంకల్పంతో నా భక్తులకోసం జన్మిస్తున్నాను తప్ప కర్మ వలన కాదు అని స్పష్టంగా చెప్పేడు పరమాత్మ.

విష్ణు పురాణంలో పరాశరుడు "సమస్తాః శక్తయః చైతాన్నృప యత్ర ప్రతిష్ఠితా తద్విశ్వరూప వైరూప్యమ్ రూపమన్యత్ హరేః మహత్" అని "సర్వమునకు కారణభూతుడైన ఏ పరబ్రహ్మ రూపమునందు ఈ శక్తులన్నీ ఉన్నాయో ఆ పరబ్రహ్మ రూపము మిగిలిన వాటికంటే విలక్షణమైనది, గొప్పది" అని చెప్పేడు.

అదే విష్ణు పురాణంలో "సమస్త శక్తి రూపాణి తత్కరోతి జనేశ్వర దేవ తిర్యక్ మనుష్యాఖ్యా చేష్టావంతి స్వలీలయా" అని అట్టి పరబ్రహ్మ దేవ మనుష్యాది రూపములగు చేష్టలతో గూడి, సకల శక్తులతో కూడి యున్నట్టి శరీరములను తన లీలచే నొనర్చు చున్నాడు అనిన్నీ

భారతంలో "జగతాముపకారాయ న సా కర్మ నిమిత్తజా" అంటే అతని పుట్టుక జగదుపకారమునకు కాని కర్మ వశ్యము వలన కాదు అనిన్నీ ,"న భూత సంఘ సంస్థానో దేహోస్య పరమాత్మనః" అని

అట్టి పరమాత్మ శరీరము పంచభూతములచే నిర్మించ బడినది కాదని భగవచ్ఛరీరము ప్రకృతి సంబంధము లేనిదని స్పష్టము చేయబడుతోంది.

అందుకే " య ఏష అంతరాదిత్యే హిరణ్మయః " అని భగవచ్ఛరీరము తేజోమయమని, అప్రాకృతమనీ శ్రుతి చెబుతోంది.

"యతోవా ఇమాని భూతాని జాయంతే" అన్నప్పుడు "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" అన్నప్పుడు అట్టి పరబ్రహ్మే ఈ సకల చరాచర జగత్తునకు కారణ భూతమని చెప్పబడుతోంది.

"ఏకోహవై నారాయణ ఆసీత్, న బ్రహ్మా, న ఈశానః, నేమే ద్యావా పృథివీ" అని చతుర్ముఖ బ్రహ్మ, రుద్రుడు, పృథివ్యంతరిక్షములు ఏవీ లేనప్పుడు ఒక్క నారాయణుడే ఉండెనని,

"సత్యమ్, జ్ఞానమ్, అనంతమ్ బ్రహ్మ", "విజ్ఞానమ్ ఆనందమ్ బ్రహ్మ" అని ఆ పరబ్రహ్మ ను స్వసంకల్ప మాత్ర సమస్త విశ్వ కారణుడు, సత్య, జ్ఞానాది గుణకుడు, చిదచిద్విలక్షణుడు అని చెప్పిన తరువాత ఆయన శరీరమూ

మన శరీరం లాంటి దనుకొంటే ఎలా. అందుకే ఇంద్రాది దేవతలు ఆ పరబ్రహ్మ వలె సృష్ట్యాది కార్యములు చేయుటకు అసమర్థులు. ఈ విషయమే తరువాత బ్రహ్మ సూత్రంలో వివరించేరు.

**నేను:** అది ఏమిటి మామయ్యా

**మామయ్య:**

"**అంతః ధర్మోపదేశాత్**"(1-1-21)

అంటే

అంతః: ఆదిత్యుని యందు, అక్షి యందు (ఉన్నట్లు శ్రుతిలో వర్ణించ బడిన పురుషుడు పరబ్రహ్మయే)

ఏలనన

తత్ ధర్మ ఉపదేశాత్: ఆ (పరబ్రహ్మ) ధర్మములు (అతనికి) ఉన్నట్లు చెప్పడం వలన

అంటే అపహత పాప్మత్వాది అసాధారణ ధర్మములు అక్షి, ఆదిత్య మండలాంతర్వర్తి అయిన పురుషునికి ఉన్నట్లు చెప్పడం వలన ఆతడు పరబ్రహ్మయే.

ఎందుకంటే ఆ శ్రుతి వాక్యము లో "**సర్వేభ్యః పాప్మభ్యః ఉదితః** " అని అపహత పాప్మభ్యము చెప్పబడినది, అది మనం ఇంతకు ముందు అనుకున్నట్లు పరబ్రహ్మకు మాత్రమే వర్తిస్తుంది. కొద్దో, గొప్పో పుణ్య కర్మల వలన ఇంద్రాదిత్యాది ఆధికారిక శరీరాలు, స్థానాలు తాత్కాలికంగా ఆ పరబ్రహ్మ చే అనుగ్రహింపబడిన జీవులకు వర్తించదు. అన్న మాట. అందువలన అలా వర్ణించబడిన పురుషుడు పరబ్రహ్మ తప్ప ఇంద్రాదిత్యాది దేవతలు కారు.

**అమ్మ:** బాగుంది మామయ్యా! బాగా చెప్పేరు.

**నేను:** అంటే పరబ్రహ్మ జీవుళ్ళందరికంటే కూడా గొప్ప వాడు, వేఱు అయిన వాడు అంటారు.

**మామయ్య:** నేను అనడం కాదు. శ్రుతి చెప్పింది. దానినే సంశయం పూర్తిగా పోవడానికి తరువాత బ్రహ్మ సూత్రం కూడా నొక్కి వక్కాణించింది.

**అమ్మ:** ఆ బ్రహ్మ సూత్రం ఏమిటి మామయ్యా!

**మామయ్య:**

"**భేద వ్యపదేశాత్ చ అన్యః**" (1-1-22) అని

**అమ్మ:** అంటే

**మామయ్య:**

భేద: (జీవుల కంటె) వేరయిన వాడని

వ్యపదేశాత్ చ : చెప్పియున్నందునను

అన్యః: పరబ్రహ్మ జీవుల కంటె వేరయిన వాడు.

**అమ్మ:** శ్రుతి అలా స్పష్టంగా చెప్పిందా.

**మామయ్య:** ఒక్కసారి కాదమ్మా, లెక్కలేనన్ని సార్లు.

ఉదాహరణకు బృహదారణ్యకోపనిషత్తు లో అంతర్యామి బ్రాహ్మణము తీసుకో.

"య ఆదిత్య తిష్ఠన్ న ఆదిత్యాదంతరో యమ్ ఆదిత్యః న వేద యస్య ఆదిత్యః శరీరమ్ య ఆదిత్యమ్ అంతరో యమయతి" అంటే "ఏ పరబ్రహ్మ ఆదిత్యుని యందున్నవాడై వానిచే తెలియబడక ఆదిత్యుని శరీరముగా కలవాడై వానిలోన నుండి నియమించుచున్నాడో" అని

అలాగే

"య ఆత్మని తిష్ఠన్ ఆత్మనః అంతరో యమ్ ఆత్మా నవేద యస్యాత్మా శరీరమ్  య ఆత్మానమ్ అంతరో యమయతి"

అంటే

"ఎవరు ఆత్మ యందుండి ఆత్మ లోపలనున్నవాడై ఆత్మచే తెలియబడక ఆత్మను శరీరముగా కలవాడై ఆత్మలోననుండి నియమించుచున్నాడో" అని

అటులనే

"అక్షరమ్ అంతరే సంచరన్ యస్య అక్షరమ్ శరీరమ్ యమ్ అక్షరమ్ న వేద"

అంటే

ఏ పరమాత్మ అక్షరుని లోపల సంచరిస్తూ అక్షరుని శరీరముగా కలిగి యుండి అక్షరునిచే తెలియబడకుండా ఉన్నాడో అని

మఱియు

"యః మృత్యుమ్ అంతరే సంచరన్ యస్య మృత్యుః శరీరమ్ యమ్ మృత్యుః న వేద ఏష సర్వ భూతాంతరాత్మా అపహత పాప్మా దివ్యో దేవ ఏకః నారాయణః" అనగా

ఎవడు మృత్యువుతో సంచరించుచూ మృత్యువును శరీరముగా కల్గి మృత్యువుచే తెలియ బడక ఉండువాడో వాడు సర్వ భూతాంతరాత్మయు, అపహత పాప్ముడును, దివ్యుడును, భగవానుడును అయిన నారాయణుడు ఒక్కడే.

అంటూ పరబ్రహ్మకు, మిగిలిన చిదచిత్తులకు శరీరి, శరీర భావాన్ని అంటే వీటన్నిటికీ ఆయన శరీరి, అంతర్యామి అనిన్నీ, ఇవన్నీ ఆయనకు శరీరము అనిన్నీ వాటి భేదాన్ని చెప్పినది శ్రుతి. ఇందులో ఇవన్నీ ఆయనకు శరీరాలు, ఆయన వీటికి శరీరి, అంతర్యామి అని రెండు పక్కల నుండీ చెప్పడం వలన మనకు సంశయానికి తావే లేదు. ఇలా మాట వరుసకు ఏదో ఒక్కసారి కాక ఈ ఒక్క అంతర్యామి బ్రాహ్మణంలోనే ఈ విషయాన్ని 22 సార్లు చెప్పింది శ్రుతి మనలాంటి వాళ్ళకి సంశయ నిర్మూలనకోసం. అలాంటి పరబ్రహ్మలు నలుగురైదుగురున్నారేమోననే సంశయం పోవడానికి "ఏకః " అంటూ అలాంటి వాడు మరొకడు లేడనీ, వాడు చతుర్ముఖ బ్రహ్మో మరొకడో అనుకోవడానికి అవకాశం లేకుండా ఆయన నారాయణుడేనని, ఆయనకు కూడా కర్మ సంబంధమూ అదీ ఉంటుందేమో అన్న సంశయం పోగొడుతూ ఆయన అపహత పాప్మ అని, ప్రాకృత సంబంధము లేదనడానికి "దివ్యుడు" అనీ ఇంత స్పష్టంగా చెబుతూంటే మనమింకా అనుమానపు పక్షులలా ఉంటే ఎలా!

**అమ్మ:** అందుకేనన్న మాట మన సిద్ధాంతంలో జీవాత్మ, పరమాత్మల ఈ శరీర, శరీరి భావం అంత ముఖ్యమని చెబుతారు.

**మామయ్య:** అవునమ్మా, ఈ రోజు చెప్పుకున్న

అంతః ధర్మోపదేశాత్, భేద వ్యపదేశాత్ చ అన్యః అన్న ఈ రెండు సూత్రాలను కలిపి "అంతరధికరణం" అంటారు.

**అమ్మ:** బాగుంది మామయ్యా, "అంతరాదిత్య విద్యలోను, అక్షి విద్య లోను చెప్పబడిన అపహత పాప్మడైన పురుషుడు పరబ్రహ్మయే అయినందు వలననూ, శ్రుతులు సుస్పష్టంగా జీవుల కంటే పరబ్రహ్మ వేరని ఆ పరబ్రహ్మ ఈ జీవుళ్ళందరికీ అంతర్యామిగా నుండి వీరికి తెలియకుండా వీరిని నియమిస్తూంటాడని చెప్పడం వలననూ జగత్కారణత్వము పరబ్రహ్మకు తప్ప మరే ఇతర జీవులకూ వర్తించదు" అన్న విషయం అర్థం అయింది ఈ అధికరణంలో.

**మామయ్య:** సంతోషమమ్మా, తరువాత అధికరణం మరొకసారి చూద్దాం

**అందరూ:** యోనిత్యమచ్యుత పదాంబుజ యుగ్మ రుక్మ.......

---

## 4 . ఆకాశాధికరణమ్:

**మామయ్య:** రండి, రండి. పనులన్నీ అయినాయా!

**అమ్మ:** అవి ఉంటూనే ఉంటాయి మామయ్యా, అయిపోవడం అంటూ ఉండదు. తెరిపి చేసుకోవడమే.

**మామయ్య:** అవునమ్మా, ఏం రామం! సంశయాలన్నీ తీరినట్టేనా, మనం చెప్పుకుంటున్న దానిలో, లేక ఇంకా ఏమయినా సంశయాలున్నాయా?

**అమ్మ:** మీరన్నట్లు వాడు అనుమానాల పుట్ట, సంశయాలు అలా వస్తూనే ఉంటాయి. మా కాలంలో పెద్దవాళ్ళు చెప్పిన తరువాత అది నిజమని, తదనుగుణంగా ప్రవర్తించాలనీ తప్ప ప్రశ్నించడం తెలియదు. "సంశయాత్మా వినశ్యతి" అనే మేము అనుకొనే వాళ్ళము. కాని వీళ్ళ కాలం వచ్చే సరికి అంతా పద్ధతులు వేరు

**మామయ్య:** ఏదయినా విపరీతం కానంత కాలం logic ను పక్కకు పెట్టి మొండిగా ఉండనంత సేపు సంశయమైనా, విపర్యయమైనా పరవాలేదు, మన భగవద్రామానుజులు పూర్తిగా శాస్త్ర ప్రకారముఅన్నిటికీ సమాధానాలిచ్చేరు.

**నేను:** సంశయానికి, విపర్యయానికీ భేదం ఏమిటి?

**మామయ్య:** సంశయం అంటే శంక. అంటే విన్నది, తెలుసుకున్నది పూర్తిగా నమ్మకం కలుగలేదు, అర్ధం కాలేదన్నమాట. విపర్యయం అంటే జ్ఞానం పూర్తిగా లేకపోవడం. ఇప్పటి దాకా భగవద్రామానుజులు మన సంశయ నివృత్తి చేస్తున్నారు. ఇక ముందు అధికరణాలలో విపర్యయ నివృత్తి చేస్తారు.

**నేను:** సంశయమంటే గుర్తు వచ్చింది, నిన్న మీరు "భేద వ్యపదేశాత్ అన్యః"సూత్రం చెబుతున్నప్పుడు "యః అక్షరమ్ అంతరే సంచరన్..." అని చెబుతున్నప్పుడు అక్షరుని లోపల సంచరించుచూ అని చెప్పేరు. ఇక్కడ అక్షరుడు అంటే జీవాత్మా, పరమాత్మా, ప్రకృతియా.

మామయ్య: ఇక్కడ పరబ్రహ్మ అంతర్యామిత్వాన్ని నిస్సంశయంగా తెలుసుకోవడం కోసం వివరిస్తున్నారు. అలా వివరించడానికి వేర్వేరు స్థితులలోనూ, అవస్థలలోను పరబ్రహ్మ అంతర్యామిత్వాన్ని నిరూపించవలసి యుంది. ఇంక పరమాత్మ వేరు, అంతర్యామి అంటూన్నప్పుడు అక్షరుడు అంటే పరమాత్మే అని చెప్పడం కుదరదు కదా. ఇంక అక్షరము అంటే జగత్సృష్టి లో మనం చెప్పుకొనే "అక్షరము" అనే ప్రాకృతిక తత్త్వమేనా అవాలి, లేదా జీవాత్మ యేనా అవాలి. నిజానికి ఎలాగైనా అనుకోవచ్చునేమో. ఎందుకంటే అంతర్యామిత్వము జీవాత్మకూ, ప్రకృతికీ కూడా వర్తిస్తుంది కదా.   కాని ఇక్కడ ఈ సందర్భంలో  జీవాత్మ అనుకోవడమే సబబు అనుకుంటాను. ఎందుకంటే జీవాత్మ, పరమాత్మ ల భేదాన్ని కదా చెబుతూ ఇక్కడ పరమాత్మ అంతర్యామిత్వాన్ని చెబుతున్నారు.

అలా అక్షరుడు అన్నది జీవాత్మకు వర్తిస్తుంది అనుకుంటే సూక్ష్మావస్థలో అంటే సృష్టికి ముందు కారణావస్థలో సమష్టిగా అంటే విడి విడి గా కాకుండా సమస్త చేతనాచేతనాలు కలసి ఉన్న అవస్థలో ఉన్న జీవాత్మకు ఈ అక్షరుడు అన్న పదం వర్తిస్తుంది.

## నేను: అంటే

మామయ్య: ఇందాకల్లా అనుకున్నట్లు  వివిధ అవస్థలలో పరమాత్మ యొక్క అంతర్యామిత్వము నిర్ధారించవలసి యుంది కదా. లేకపోతే ఈ అవస్థ లో అంతర్యామిత్వము ఉండదేమోనని నీలాంటి వాళ్ళకి మళ్ళీ సంశయం కలుగవచ్చును. అందుచేత వివిధ అవస్థలలో పరమాత్మ అంతర్యామిత్వము చెబుతూ

- య ఆదిత్యే తిష్ఠన్ అన్నప్పుడు అధి దైవత స్థితినీ

-చక్షుషి అన్నప్పుడు అధి ఆత్మ స్థితినీ

- పృథివీమ్....ఆపః....తేజః.....వాయుః....ఆకాశ అన్నప్పుడు అధి భూత స్థితినీ

-లోకేషు అన్నప్పుడు అధి లోక స్థితిని

-వేదేషు అన్నప్పుడు అధి వేద స్థితిని

-యజ్ఞేషు అన్నప్పుడు అధి యజ్ఞ స్థితినీ

వివరించేరు.

ఇంక చేతనా, చేతనాల కార్య, కారణావస్థలలో అంటే పరమాత్మలో సూక్ష్మావస్థలో ఉండి, తదనంతరం ఆయన సంకల్పం వలన స్థూలావస్థ పొందడం, ప్రళయ సమయంలో మళ్ళీ ఆయన లో లీనమవడం జరుగుతుంది కదా, అలాంటప్పుడు కూడా పరమాత్మ అంతర్యామిత్వము వర్తిస్తుందా అంటే

అక్షరమ్ అంతరే అన్నప్పుడు అక్షర శబ్దంతో కారణావస్థలో అంటే సృష్టికి ముందు సూక్ష్మావస్థలో అచిత్తుతో కూడియున్న చిత్పదార్థ సమష్టి యందు కూడా పరబ్రహ్మ అంతర్యామియే అన్న విషయం చెప్పేరు. ఈ స్థితిలో చేతనములన్నీ విడివిడిగా కాక సమష్టిగా ఉంటాయి కదా.

ఇంక ప్రళయ సమయంలో చిత్పదార్థమంతా అచేతనంతో కలసి వెనుకకు వెళ్ళిపోతుంది కదా. ఆ పరిస్థితిలో కూడా అంతర్యామిత్వాన్ని నిర్ధారించడానికి మృత్యుమ్ అంతరే అని మృత్యు(ప్రళయ) సమయంలో చిత్పదార్థంతో కూడియున్న అచిత్పదార్థానికి కూడా అంతర్యామి పరమాత్మేనని వివరించేరు.

ఇలా ఏ అవస్థ లోనైనా పరబ్రహ్మ అంతర్యామిత్వమును, చిదచిత్తులతో ఆయన శరీర, శరీరి భావము నిర్ద్వంద్వంగా వివరించేరన్న మాట.

అలాకాక ప్రాకృతిక తత్త్వాలైన పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం, మనోబుద్ధ్యహంకారచిత్తాలు, అవ్యక్తము  లయందు పరమాత్మ అంతర్యామిత్వాన్ని చెబుతూ అదే క్రమంలో అక్షరమునకూ పరమాత్మ అంతర్యామిత్వాన్ని చెప్పేరని కూడా చెప్పవచ్చునేమో కాని మన సందర్భాన్ని బట్టి (జీవ, బ్రహ్మ భేదం) కారణావస్థలో అచేతనముతో కలసియున్న ఉన్న జీవాత్మ సమూహము అనే చెప్పుకోవడం సందర్భోచితంగా ఉంటుందనిపిస్తుంది.

**నాన్నగారు:** ఇన్ని సార్లు చెప్పాలంటావా బావా ఒకటే విషయాన్ని

**మామయ్య:** విషయం వివరణలో ఒకే విషయం చెబుతున్నట్లనిపించినా, వేర్వేరు దృక్కోణాలు , సందర్భోచిత  ప్రత్యేకతలూ కనబడుతూంటాయి ఆ వివరణలలో. ఉదాహరణకు తరువాతి అధికరణాలయిన "ఆకాశాధికరణము", "ప్రాణాధికరణము", "జ్యోతిరధికరణము", "ఇంద్రప్రాణాధికరణము" అనే నాలుగు అధికరణాలూ ఒక్కలాగే ఆకాశమంటే పరమాత్మే, జ్యోతి అంటే పరమాత్మే అంటూ ఇలా సాగుతాయి.

వీటన్నిటిలోనూ కూడా చెప్పిన విషయమే మళ్ళీ చెప్పినట్లనిపించ వచ్చు. కాని, ప్రతి అధికరణంలోనూ వేర్వేరు విషయాలను, ప్రత్యేకతలను, దృక్కోణాలనూ ఆవిష్కరిస్తారు భగవద్రామానుజులు.

**నేను:** ఆ "ఆకాశాధికరణము" ఏమిటి మామయ్యా

మామయ్య: "యతోవా ఇమాని భూతాని జాయంతే" మొదలైన శ్రుతులు పర బ్రహ్మము జగత్కారణము అని తెలిపిన తరువాత ఆ పర బ్రహ్మము ఏమిటి, ఎలాంటిది అంటే " సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" అంటూ ఈ సృష్టికి పూర్వము సత్ మాత్రము ఉండెను, అది తన సంకల్పముచే "బహుస్యాస్" అనేకముగా అగుదునని "తత్ తేజః అసృజత" అని తేజస్సును సృజించెను అని వివరిస్తూ "ఆత్మా వా ఇదమగ్ర ఆసీత్" ఈ కన్పించెడి సృష్టికి పూర్వము ఆత్మగా నుండెను, అనిన్నీ "ఇమాన్ లోకాన్ అసృజత" అంటూ ఆ పర బ్రహ్మము ఈ లోకాలను సృష్టించెను అనిన్నీ "తస్మాత్ వా ఏతస్మాత్ ఆత్మన ఆకాశః సంభూతః" అని ఆ ఆత్మనుండే ఆకాశము పుట్టెను అని పరబ్రహ్మకు జగత్కారణత్వాన్ని నిర్దేశించింది కదా ఉపనిషత్తు. ఆ పరబ్రహ్మ తన సంకల్పంతో సృష్టించేడు అని అనడం వలన సంకల్పము అచేతనమునకు కుదరదు కనుక పరబ్రహ్మ అచేతనము కంటే వేరని, కర్మ వశుడైన జీవుడికంటే వేరని ఇంతకుముందు అధికరణాలలో చెప్పేరు.

కాని ఛాందోగ్యోపనిషత్ లో "అస్య లోకస్య కా గతిః ఇతి ఆకాశ ఇతి హోవాచ సర్వాణి హవా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యంతే ప్రత్యస్తమ్ యంతి ఆకాశో హ్యేవైభ్యో జ్యాయాన్ ఆకాశః పరాయణమ్ ఇతి"

అని ఉన్నది.

**నేను:** అంటే ఏమిటి మామయ్యా

**మామయ్య:** ఇది ప్రవహణ జైవళి, శాలావత్య సంవాదము లోనిది. ప్రణవోపాసన వివరాల తరువాత వస్తుంది. ఇందులో ఈ లోకానికి ఏమిటి ఆధారము అని ప్రశ్న. దానికి సమాధానంగా ఈ లోకానికి ఆకాశమే

ఆధారము, ఆకాశమునుండియే సకల భూతాలూ సముత్పన్నములై ఆకాశమునందే సంయుక్తములవుతాయి. ఈ భూతములన్నిటి కంటే ఆకాశమే ఉత్కృష్ట మైనది. కనుక ఆకాశమే సర్వాధారము అని అర్థము. ఇక్కడ సంశయము ఆకాశమన్నప్పుడు అది మనకు కనపడే భూతాకాశమా లేక పరబ్రహ్మమా అని

**నేను:** నేనడిగాల్సిన ప్రశ్న మీరే అడిగేసారన్న మాట. అయినా ఆకాశమంటే ఆకాశం కాక పరబ్రహ్మమని ఎలా చెబుతాము?

**మామయ్య:** ఆకాశమని ఎలా చెబుతున్నావు?

**నేను:** మనకు ఏదయినా శబ్దము వలన మొదట ప్రాచుర్య భావముతో బుద్ధికి స్ఫురించేది దానికర్థం అవుతుంది కాని, ఏదో ఊహించి కల్పించినది అవదు కదా.

**మామయ్య:** కాని, ఇంతకుముందు అదే ఈక్షత్యధికరణంలో అచేతన పదార్థమునకు జగత్కారణత్వము కుదరదని కదా అనుకున్నాము. భూతాకాశము ప్రాకృతికము, అచేతనము కదా?

**నేను:** కాని, "యతోవా ఇమాని భూతాని జాయంతే" అని నిర్దేశించిన శ్రుతే "ఇమాని భూతాని ఆకాశాత్ ఏవ సముపద్యంతే" అని స్పష్టంగా వివరిస్తున్నప్పుడు ఆకాశమే జగత్తునకు కారణం అని అర్థం చేసుకోవడంలో తప్పేమున్నది. "సదేవ సోమ్య ఇదమ్ అగ్ర ఆసీత్" అని సామాన్యంగా అంటే ఆ సత్ అంటే ఏమిటో ఇదమిత్థమని అప్పుడు చెప్పని శ్రుతి ఈ వాక్యంలో ఆ సత్ ఆకాశమేనని విశేష నిర్ధారణ చేసిందేమో. "ఆత్మా వా ఇదమ్ ఏక ఏవాగ్ర ఆసీత్" అను శ్రుతిలో కూడా ఆత్మ ఈ సృష్టికి మొదట ఉన్నదనే చెప్పబడింది కదా. ఆత్మ అంటే చేతనమే కానక్కర లేదు. ఆప్నోతి ఇతి ఆత్మా అని కదా. అంటే వ్యాపించి ఉండేది అని. "మృదాత్మకః ఘటః" అంటే మట్టి చేత వ్యాపించబడినదనే కదా. అక్కడ కూడా మట్టి చైతన్య పదార్థము కాదు. అలాగే అంతటా వ్యాపించి ఉండేదే ఆకాశము. అందువలన ఆకాశమే పరబ్రహ్మ అనుకోవడంలో తప్పేముంది. "తద్రైక్షత"

అన్నప్పుడు అక్కడ ఈక్షణం ఇంతకు ముందనుకున్నట్లు "రాముడు అడవికి వెళ్ళడం వలన అయోధ్య ఏడుస్తోంది" అన్నట్లు అంటే అచేతనమైన ఊరు ఏడుస్తోంది అన్నట్లు లాక్షణికం, గౌణం కావచ్చుకదా. అందు వలన ఆకాశం అంటే పరబ్రహ్మ అని అనుకోవచ్చునేమో.

**మామయ్య:** అది వివరించడానికే తరువాత సూత్రం

"**ఆకాశః తల్లింగాత్**" (1-1-23) అని కటాక్షించేరు

**అమ్మ:** అంటే ఏమిటి మామయ్యా

**మామయ్య:**

ఆకాశః: (ఛాందోగ్యోపనిషత్ లో "ఆకాదాశాదేన సముపద్యంతే" అన్న శ్రుతిలో ) ఆకాశము (పరబ్రహ్మమే కాని భూతాకాశము కాదు ఎందుకంటే)

తత్: ఆ ఆకాశముయొక్క

లింగాత్: (పరబ్రహ్మ యొక్క) ధర్మములు (అచట) చెప్పబడుట వలన

అంటే ఆ ఛాందోగ్యోపనిషత్ వాక్యములో జగదాధారము, జగత్కారణము అని చెప్పబడినది పరబ్రహ్మమే, భూతాకాశము కాదు. ఎందుకంటే అచ్చట ఆకాశము అను పదమునకు పరబ్రహ్మ లక్షణాలు కలదిగా చెప్పబడడం వలన

**అమ్మ:** అవును. లేక పోతే "ఆత్మన ఆకాశః సంభూతః" అని పరమాత్మ నుండి ఆకాశము పుట్టు చున్నది శ్రుతి వాక్యము ఉండదు కద, భూతాకాశమే పరబ్రహ్మ అయితే.

నేను: అలా కాదమ్మా, సృష్టి వివరణ చదువుకున్నప్పుడు ఆకాశము, వాయువు వీటన్నిటికీ సూక్ష్మ స్థూలావస్థలు అని రెండుంటాయని తెలుసుకున్నాము కదా. అందులో సూక్ష్మావస్థ యుక్తమగు ఆకాశము కారణము. స్థూలావస్థలో నున్నది కార్యము కదా. సూక్ష్మ రూపయుక్తమైన ఆకాశమే జగత్కారణత్వము కలది. "ఆత్మన" అంటే ఇక్కడ "వ్యాపించి ఉండేది అని" సూక్ష్మావస్థలో నున్న ఆకాశమే చెప్పబడుతోందేమో. దాని నుండి "ఆత్మన ఆకాశః సంభూతః" అంటే సూక్ష్మాకాశమునుండి స్థూలాకాశము సముత్పన్నమయినది అని అర్థం చేసుకుంటే సరిపోతుంది. ఈ సూక్ష్మాకాశము నుండి సర్వభూతములు పుట్టుచుండడం చేత ఇదే పరబ్రహ్మమని, పరబ్రహ్మము దీనికంటె వేరు కాదని తెలుస్తోంది కదా.

మామయ్య: అచేతనానికి జగత్కారణత్వము కుదరదని ఇంతకు ముందనుకున్నాము కదా. ఎందుకంటే సంకల్ప సామర్థ్యము అచేతనానికి లేక పోవడం ఒక కారణం కాగా, అచేతనం నుండి చేతన పదార్థము ఉత్పన్నమవడం అసంభవము కావడం ఇంకొక కారణము.

పరబ్రహ్మ లక్షణాలైన నిఖిల జగదేక కారణత్వము, సమస్త చేతనాచేతనాధిక్యము, సకల చిదచిద్వస్తు పరాయణత్వము అంటే అన్ని చిత్తులకూ, అచిత్తులకూ పరమ ప్రాప్యము, గమ్యము అవడం, అఖిల హేయ ప్రత్యనీకత్వము ....ఇలాంటి గుణాలన్నీ అచేతనమైన, సకల పురుషార్థ విరోధి అయిన హేయ పదార్థాశ్రితమైన ఆకాశానికి కుదరదు కదా.

అంతే కాదు. భూతాకాశము నిరుపాధికం కాదు. పరబ్రహ్మకు సకలేతర వస్తు ఉత్కృష్టత, స్వాభావిక సమస్త కళ్యాణ గుణ విశిష్టత, మొదలైన వాటిచే జగత్కారణత్వము నిర్దేశించబడినవాడు. ఇవేవీ అచేతనమైన భూతాకాశానికి వర్తించవు.

"తత్ ఐక్షత బహుస్యామ్ ప్రజాయేయ",

"**సః అకామయత బహుస్స్యామ్ ప్రజాయేయ**" అంటూ చెప్పబడి సత్య కామ, సత్య సంకల్ప, సర్వజ్ఞాది గుణ విశిష్టుడైన పరబ్రహ్మ అచేతనం కాలేడు కదా.

నువ్వు చెప్పినట్లు "**ఆప్నోతి ఇతి ఆత్మా**" అనే వ్యుత్పత్తి ప్రకారము వ్యాపించి యున్నది అనే అర్థం ఉన్నా దానిని బట్టి ఆత్మ అంటే అచేతనము అని ఎక్కడా చెప్పబడ లేదు.

"**ఆత్మా వా ఇదమ్ ఏక ఏవ అగ్ర ఆసీత్**"

"**ఆత్మనః ఆకాశః సంభూతః**"

అన్నప్పుడు ఆత్మ శబ్దము చేతన పదార్థాన్నే తెలుపుతోంది.

నువ్వన్నట్లు మృదాత్మకః ఘటః అన్న పదంలో మృత్ అన్నప్పుడు మట్టి అచేతనము. అందు వలన మృదాత్మకః అనే ఉదాహరణ ఇక్కడ వర్తించదు.

**నేను:** కాని ఆకాశము అంటే భూతాకాశము కాకుండా పరబ్రహ్మ అని అర్థము ఎలా చెబుతాము.

**మామయ్య:** "**ఆ సమంతాత్ కాశతే**" అని

"**సమంతాత్ కాశయతి చ**" ఆకాశః అని వ్యుత్పత్తి.

అంటే "సంపూర్ణముగా ప్రకాశించునది,  సంపూర్ణముగా ప్రకాశింప చేసేది" అని అర్థము. కోటిసూర్య సమప్రభుడు, సమస్త చిదచిద్వస్తు ప్రదీపుడు, స్వాభావిక స్వయంప్రకాశుడు అయిన పరబ్రహ్మ కంటె "ఆకాశ" పదము మరెవ్వరికి ఎక్కువ సరిపోతుంది. మిగిలిన ఏ వస్తువులకైనా ప్రకాశము ఆయన వలననే కదా.

**నేను:** కాని ఆకాశ శబ్దానికి రూఢిగా అంటే వాడుకగా భూతాకాశమే కదా పరిగణిస్తాము. "**యోగాత్ రూఢిః బలీయసి**" అన్నట్లు యౌగిక అంటే వ్యుత్పత్తి అర్థము కంటే రూఢి అర్థమే కదా బలమైనది. అందు వలన

స్పష్టంగా రూఢి అర్థము తెలుస్తున్నప్పుడు డొంక తిరుగుడుగా ఎక్కడిదో వ్యుత్పత్తి అర్థాన్ని తెచ్చుకొని చెప్పుకోవడం సబబేనా? గోవు అంటే ఆవు అని రూఢి అర్థము తెలుస్తున్నప్పుడు అలా కాకుండా గోవు అంటే వ్యుత్పత్తి అర్థము ప్రకారము కదిలేది అని కనుక గాడిద, గుఱ్ఱము అంటూ అర్థము చెప్పుకొని, గోవుని తెమ్మంటే గాడిదను తెచ్చినట్లు, ఆకాశానికి అలా అర్థం చెప్పడం కుదురుతుందా?

**మామయ్య:** నువ్వు చెప్పినది సరికాదు. ఒక కారణం తో చెప్పినప్పుడు "రూఢ్యాత్ యోగః బలీయసి" అని రూఢి అర్థము కంటే అలాంటి సందర్భాలలో వ్యుత్పత్తి తో అర్థం చేసుకోవడమే సబబు. లేకపోతే "కప్యాసమ్ పుండరీకమేవమక్షిణీ" అన్నప్పుడు నువ్వు చెప్పిన మర్కట పృష్ఠ దృష్టాంతంలాగే హాస్యాస్పదంగా ఉంటుంది.

**నేను:** "ఆకాశాత్ తల్లింగాత్" అని కదా సూత్రము. ఇక్కడ లింగము అంటే

**మామయ్య:** మళ్ళీ రూఢి అంటూ శివ లింగమని అర్థం చేసుకునేవు. లింగము అంటే అనేక అర్థాలున్నాయి. కారణము అని ఒక అర్థము.

చిహ్నము అని ఒక అర్థము. అంటే సులభంగా అర్థము తెలియ బడ చేసేది అని( లీనమ్ అర్థమ్ గమయతీతి)ఏ వస్తువునైనా తెలుసుకొనేది దాని గుణాలబట్టే కదా,

ఇక్కడ మన సూత్రంలో "అఖిల జగత్కారణత్వ, సత్య సంకల్పత్వాది గుణాలు "ఆకాశాదేవ సముపద్యంతే..." అన్న శ్రుతిలో ఆకాశానికి చెప్పబడడం చేత,

ఆ గుణాలు "సదేవ సోమ్య ఇదమగ్ర ఆసీత్" , "యతోవా ఇమాని భూతాని జాయంతే..." , "తదైక్షత" మొదలైన శ్రుతుల ప్రకారము పరబ్రహ్మకే వర్తిస్తాయి కనుక

ఆ ఛాందోగ్య శ్రుతిలో( "ఆకాశాదేవ సముపద్యంతే అన్న శ్రుతి) ఆకాశము అంటే పరబ్రహ్మమే" (భూతాకాశము కాదు) అని ఆ సూత్రానికి అర్థము.

ఈ అధికరణంలో ఇదొక్కటే సూత్రము. దీనిని "ఆకాశాధికరణము" అని అంటారు.

**అమ్మ**: బాగుంది మామయ్యా, ఆ శ్రుతిలో ఆకాశమంటే పరబ్రహ్మ అని బాగా అర్థమయ్యేటట్లు చెప్పేరు.

**మామయ్య**: ఈ రోజుకు ఇంతటితో ఆపుదామమ్మా. తరువాత అధికరణము మరొక సారి చూద్దాము

అందరూ: "యో నిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ ....

---

## 5 . ప్రాణాధికరణము:

**మామయ్య**: రావోయ్  బావా, ఈ చర్చా కార్యక్రమము నీకూ రుచిస్తోందా

**నాన్నగారు**: చాలా బాగుంటోందయ్యా, అందరికీ ఉపయోగించేటట్లు ఉంటోంది. ఈరోజు ఇంతకీ ఏమిటి పాఠం.

**మామయ్య**: తరువాతి అధికరణం "ప్రాణాధికరణము". దీనిలో ఇంతకుముందు ఛాందోపనిషద్వాక్యంలో "ఆకాశం" అంటే భూతాకాశము కాదు పరబ్రహ్మ అని చెప్పినట్లు ఇక్కడ కూడా ఛాందోపనిషత్తులో "ప్రాణమ్" అని వచ్చిన వాక్యంలో ప్రాణము అంటే ప్రాణ వాయువు కాదు పరబ్రహ్మ అని చెబుతారన్నమాట.

**నాన్నగారు**: ఆకాశము, వాయువూ అన్నీ కలిపి ఒక్కసారి చెప్పేస్తే సరిపోదూ, ఇలా వేరు వేరుగా చెప్పాలా?

మామయ్య: ఆకాశ విద్య, ప్రాణ విద్య, జ్యోతిర్విద్య అంటూ ఇవన్నీ వేరు వేరు బ్రహ్మ విద్యలు. ఇంతకుముందు అనుకున్నట్లు ప్రణవోపాసన చెప్పిన తరువాత ఉపాసనా పద్ధతులలోఇలా వేరు వేరు బ్రహ్మ విద్యలు వస్తాయి ఛాందోగ్యోపనిషత్తులో. మఱి ఒక్కొక్క బ్రహ్మ విద్య వివరణకూ ఒక్కొక్క అధికరణం అన్నమాట.

**నాన్నగారు:** ఆకాశాత్ వాయుః, వాయోరగ్నిః ...అన్నట్లుగా అదే క్రమంలో సూత్రీకరించేరన్నమాట.

మామయ్య: అవును. ఈ సూత్రానికి సంబంధించిన ఉపనిషద్వాక్యాలు ఛాందోగ్యోపనిషత్ లో ఉషస్తి చాక్రాయణ మహర్షి, ప్రస్తోత అయిన రాజు సంవాదము లోనివి. దానిలో

"ప్రస్తోతర్యా దేవతా ప్రస్తాతమన్వాయత్తా" అంటూ ప్రస్తావించబడే దేవత గురించి చెబుతూ

"కతమా సా దేవతేతి ప్రాణ ఇతి హోవాచ సర్వాణి హ వా ఇమాని భూతాని ప్రాణమేవ అభిసంవిశంతి ప్రాణమ్ అభ్యుజ్జిహతే స ఏషా దేవతా ప్రస్తావమన్వాయత్తా తామ్ చేద విద్వాన్ ప్రాస్తోష్యో మూర్ధా తే వ్యపతిష్యత్"

అని చెబుతుంది ఉపనిషత్తు.

**అమ్మ:** అంటే అర్థం ఏమిటి మామయ్యా?

**మామయ్య:** "ఆ దేవత ఏది అనగా అది ప్రాణము అని చెప్పబడినది. ప్రసిద్ధములైన సర్వ భూతములు ప్రళయమున ప్రాణములో ప్రవేశించును. సృష్టి సమయమున ప్రాణమునుండి బయల్వెడలును. ప్రాణమే ఇట్లు (సమస్తమునకు) ఆధారము. ప్రాణమే ప్రస్తావ భక్తియందు ఉపాస్య దేవత. ఇట్టి ప్రస్తావ దేవతను గూర్చి జ్ఞానము లేక ప్రస్తావము చేసినచో నీ శిరస్సు తెగి పడును" అని అర్థము.

**అమ్మ:** ప్రస్తావమంటే సాధన, ఉపాసన అనేనా అర్థం. కాని "జ్ఞానం లేకుండా చేస్తే తల తెగి పడి పోతుంది" అని చాలా ఘాటుగా చెప్పేరే.

**మామయ్య:** ఇది లాక్షణిక ప్రయోగం అని అనుకోవచ్చమ్మా. నీకు బుఱ్ఱ లేదురా అంటే బుఱ్ఱ లేదని కాదు కదా, బుద్ధి లేదని కదా. అట్లాగే తల తెగి పడుతుంది అంటే తలకు ప్రయోజనం లేకుండా అయిపోయినట్లవుతుంది, అంటే బ్రహ్మ జ్ఞానం లభించడం గాని తద్వారా మోక్ష ప్రాప్తిగాని కుదరదు. అని అర్థం చెప్పుకోవాలమ్మా ఇక్కడ. మన మహర్షులు మరీ తల పడి పోవాలని శపించేటంత కఠినులు కాదు, కరుణామయులే.

**నేను:** ఇక్కడ కూడా ప్రాణమంటే ప్రాణ వాయువు కాదు పరబ్రహ్మే అంటారు, అంతేనా మామయ్యా.

**మామయ్య:** అనడానికి నేనెంత వాడిని నాయనా, బాదరాయణులు అన్నారు, భగవద్రామానుజులు అన్నారు ఈ తరువాతి సూత్రంలో.

**అమ్మ:** ఏమిటి మామయ్యా ఆ సూత్రము

**మామయ్య:**

"**అత ఏవ ప్రాణః**" (1-1-24) అని

అంటే

అత ఏవ: పూర్వ సూత్రమున ప్రస్తావించ బడిన కారణములచేత

ప్రాణః: ప్రాణ శబ్ద వాచ్యుడు (పరబ్రహ్మమే)

అనగా ఇంతకు ముందు సూత్రములో చెప్పుకున్నట్లు  ప్రాణమునకు చెప్పబడినట్లున్న అఖిల జగత్కారణత్వము, సత్య సంకల్పత్వము, సర్వజ్ఞత్వము, అపహత పాప్మత్వము మొదలయిన గుణములు

పరబ్రహ్మకే వర్తిస్తాయి కనుక  ఛాందోగ్యోపనిషత్తులో ప్రాణ విద్య యందు చెప్పబడుచున్న ప్రాణ శబ్ద వాచ్యుడు పరబ్రహ్మమే. "

అని అర్థము.

**నేను:** సకల భూతముల అస్తిత్వానికి ఆధారమయినది, సమస్త భూతముల స్థితి, గతులకు కారణమయినది, చైతన్య మూలమైనది పంచ వృత్త్యాత్మకము అయినది (ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అను పంచ ప్రాణాల సమన్వయము) ప్రాణ వాయువు కదా. అందు వలననే ఆ ప్రాణ వాయువుకు ఈ శ్రుతి వాక్యము జగత్కారణత్వమును ఆపాదిస్తోందేమో?

**మామయ్య:** ఆ శ్రుతి వాక్యాన్ని మరొక సారి చూడు. "ప్రళయ కాలమున సకలభూతములు అట్టి ప్రాణమున ప్రవేశించుచున్నవి. ప్రాణమునుండి బయల్వెడలు చున్నవి" అని కదా చెప్పబడినది. నువ్వు ప్రాణము అంటే ప్రాణ వాయువు అని అంటే ఇదే ఛాందోగ్యోపనిషత్తులో వేరొక చోట ఉత్క్రమణ విధానము చెబుతూ "వాక్ మనసి, మనః ప్రాణే, ప్రాణః తేజసి, తేజః పరస్యామ్ దేవతాయామ్" అని

"మరణించునప్పుడు వాక్కు మనస్సునందు, మనస్సు ప్రాణమునందు, ప్రాణము తేజస్సునందు, తేజస్సు పరదేవతయందు లీనమవుతుంది" అని ఎందుకు చెప్పబడింది.

ఈ ప్రాణ వాయువు సమస్త జగదాధారము అని అంటే కర్రలకు, ఱాళ్ళకు ఈ ప్రాణవాయువుతో సంబంధము కాని వాటిలో ఈ ప్రాణ వాయువు ప్రవేశించడం, నిష్క్రమించడం కాని కనబడదే.

జగత్కారణత్వము చెబుతూ ఉపనిషత్తు "నారాయణాత్ ప్రాణో జాయతే" అని నారాయణుడి నుండి ప్రాణము జనించింది అని చెబుతుంది కాని వాయువుకు జగత్కారణత్వము చెప్పదే.

సృష్టి ప్రకరణం లోకూడా ఆకాశాత్ వాయుః అని చెబుతుంది ఉపనిషత్తు. అంతే తప్ప ప్రాణ వాయువునుండి సృష్టి అంతా జరిగిందని చెప్పదు.

అంతేకాక ప్రాణ వాయువు అచేతనమవడం వలన ఇంతకుముందు అనుకున్నట్లు సత్య సంకల్పత్వము, సర్వజ్ఞత్వము, అఖిల హేయ ప్రత్యనీకత, అపహత పాప్మత్వము, నిఖిల జగదేక కారణత్వము, చైతన్య సృష్టి ఇవన్నీ కుదరవు. ఇవన్నీ అనంత కళ్యాణ గుణాకరుడు, అఖిల హేయ ప్రత్యనీకుడు, "**యతోవా ఇమాని భూతాని జాయంతే....**" అన్నట్లు సమస్త జగత్సృష్టి, స్థితి, లయ కారకుడు అయిన పరబ్రహ్మ కే చెల్లుతాయి.

**నేను:** కాని ప్రాణ శబ్దము కూడా పరబ్రహ్మ కు చెందుతుందా?

**మామయ్య:** "**ప్రాణయతి సర్వాణి భూతాని**" అని కదా వ్యుత్పత్తి. అంటే సకల భూతముల యొక్క ప్రాణన వ్యాపారములు చేయించునది అని అర్థము. సర్వేశ్వరుడైన పరబ్రహ్మయే కదా సమస్త జగద్వ్యాపారాలకు కర్త, నియంత, అనుమిత కూడా. అందు వలన ప్రాణ శబ్దవాచ్యుడు ఆ పరమాత్మే. "అనః ప్రాణనే" అనే ధాతువును బట్టి కూడా ప్రాణ శబ్దం పరమాత్మకే చెల్లుతుంది. "**పవనః పవతామస్మి**" అని భగవద్గీతలో వాయువును నేనే అని భగవానుడు తనే చెప్పుకున్నాడు.

అందువలన పై శ్రుతి వాక్యంలో ప్రాణ శబ్దం పరమాత్మకే వర్తిస్తుంది.

**అమ్మ:** బాగుంది మామయ్యా అర్థం అయేటట్లు బ్రహ్మ విద్యలయందు ప్రాణ విద్య సందర్భంలో "ప్రాణము" అంటే "పరమాత్మే" అని చక్కగా చెప్పేరు.

**మామయ్య:** ఇంతటితో ప్రాణాధికరణము పూర్తి అయినది. తరువాతి అధికరణము తరువాత చూద్దాము

**అందరూ: యో నిత్యమచ్యుత పదాంబుజ యుగ్మరుక్మ....**

---

## 6 . జ్యోతిరధికరణము:

**నాన్నగారు:** దాసోహమ్ బావా, పనులన్నీ అయినాయా,

**మామయ్య:** ఈ నెపంతో మనం తరచుగా కలుసు కోవడం అవుతోంది.

**నాన్నగారు:** అవును బావా, నీ ధర్మమా అని భగవద్రామానుజుల గొప్ప దనము తెలుస్తోంది. లేకపోతే ఏమయి పోయే వారమో కదా. మిడి మిడి జ్ఞానంతో రకరకాలుగా చెప్పే వారి మాటలు వింటూ. తాళ్ళపాక పెద తిరుమలా చార్యులన్నట్లు గంట వేటగాళ్ళు (అన్ని పక్కల నుండి గంటలు, డప్పులు వాయించి అమాయక జంతువును గాభరా పెట్టి ఉచ్చులో పడవేసేవారు) సమాజంలో లెక్కలేనంత మంది, భగవద్రామానుజులు మనకు సరి అయిన దారి చూపక పోయి ఉంటే మన బ్రతుకులు ఎలా ఉండేవో కదా.

**మామయ్య:** నిజమే బావా, భగవద్రామానుజులకూ, మన పూర్వాచార్యులకూ సర్వదా సర్వథా ఎంతో ఋణపడి ఉంటాము మనమందరమూ.

**నాన్నగారు:** కాసేపు శ్రీభాష్యం పాఠంలోంచి బయటకు వద్దాం.

మన చర్చలో భగవద్రామానుజులు జగత్కారణుడైన పరబ్రహ్మను చిదచిద్విలక్షణుడు గా నిరూపించడం, ఆయన సకల కళ్యాణ గుణాకరుడు, హేయ ప్రత్యనీకుడు అని చెప్పడం బాగానే ఉంది. కాని తరువాత ఇలా ఒక్కొక్క బ్రహ్మ విద్య ప్రస్తావించి, అందులో చెప్పబడ్డ ఆకాశం అంటే పరబ్రహ్మ, ప్రాణం అంటే పరబ్రహ్మ, జ్యోతి అంటే పరబ్రహ్మ అని చెప్పే సూత్రాలు నా లాంటి వాళ్ళకు ఎంతవరకూ అంటే ఈ కాలం వాళ్ళకు ఎంత వరకూ ఉపయోగం అంటావు. ఈ బ్రహ్మ విద్యలేమీ నాకు తెలియదు. నాకేమిటి, నాకు తెలిసినంత మట్టుకు ఈ

రోజులలో బ్రహ్మ విద్యలను ఉపాసన చేసే వారు ఎవళ్ళున్నారో నాకు తెలియదు. అలాంటప్పుడు ఈ బ్రహ్మ విద్యల గురించీ, వాటిలోఉపాసన గురించి తెలుసుకోవడం ఈ రోజులలో అప్రస్తుతం కాదా!

**మామయ్య:** శాస్త్రం అన్నది ఒక వ్యక్తికి, ఒక కాలానికి సంబంధించి మాత్రమే ఉండదు కదా. ఏ వ్యక్తికైనా, ఏ కాలం లోనైనా సమాధానం ఈయగలగాలి శాస్త్రమన్న తరువాత. నువ్వు చెప్పినట్లు పాత రోజులలో ఈ బ్రహ్మ విద్యలను అభ్యసించేవారు ఎక్కువ మంది ఉండి ఉండవచ్చును. ఇప్పుడు అరుదుగా ఉండి ఉండ వచ్చును. మఱి కొన్నాళ్ళు పోతే మళ్ళీ కొన్ని బ్రహ్మ విద్యలు ప్రాచుర్యం లోకి రావచ్చును. అందు వలన శాస్త్రము వీటిని తప్పక వివరించాల్సి ఉంది. లేక పోతే ఒక చోట ఆకాశమనీ, మరొక చోట ప్రాణమనీ, వేరొకచోట జ్యోతి అనీ ఇలా పరబ్రహ్మను శ్రుతి వాక్యాలు చెబుతూ ఉన్నప్పుడు ఆస్తికులకు కూడా అర్థం అవక, నమ్మకం కుదరక నాస్తికులయే ప్రమాదముంది. లేదా ఒక్కొక్కళ్ళూ ఒక్కొక్క దానిని పరబ్రహ్మమనుకొని వేరు వేరు ఉపాసనలతో, పద్ధతులతో అడ్డదారులు, అడ్డమైన దారులు పట్టి పోయే అవకాశముంది. అంతే కాదు, బ్రహ్మ విద్యలు ఇప్పటివారు అభ్యసించక పోవచ్చు, కాని దేవతోపాసనలు చేస్తూన్నారు కదా. అలాంటప్పుడు ఏ పేరు చెప్పినా ఉపాసించాల్సింది పరబ్రహ్మ అయిన శ్రీమన్నారాయణుడినే అన్న వైశద్యము ఉండాలి. భగవద్గీతలో భగవానుడు ఈ విషయాన్ని అనేక సార్లు కంఠరవేణా చెప్పేడు కదా. అందుకోసం ఈ చర్చ మనందరకూ కూడా ఉపయోగపడుతుందనుకుంటాను.

**అమ్మ:** మఱి ఈ బ్రహ్మ విద్యలు ఏమీ తెలియకపోతే మఱి మన కెలా మామయ్యా.

**మామయ్య:** శ్రీభాష్యంలో భగవద్రామానుజులు ఉపదేశించినది భక్తి. కాని, తరువాతి కాలంలో మనలాంటి వాళ్ళకోసం శరణాగతి చేసి, దానిని ఎలా చేయాలో చూపించి మనకు అందించేరు. అందువలన శరణాగతియే, దీనినే న్యాసము అని కూడా అంటారు, మన బోటివారు అవలంబించాలిసినది.

**నాన్నగారు:** పాఠం నుండి పక్కదారి పట్టి నందుకు క్షమించు.

ఈరోజు ఏమిటి మాకు పాఠం?

**మామయ్య:** తరువాతి అధికరణం జ్యోతిరధికరణము. ఇందులో నాలుగు సూత్రాలు వస్తాయి.

ఛాందోగ్యోపనిషత్ లో మూడవ అధ్యాయము, పన్నెండవ ఖండములో నున్న గాయత్రీ విద్యా, జ్యోతిర్విద్యా ఈ అధికరణంలో ప్రస్తావించి వాటిలో ఉపాసిత మగునది కూడ పరబ్రహ్మమే అని చెబుతారు.

**నేను:** కాని మాకు ఆ విద్యల విషయాల గురించి అసలు తెలియదే. ముందు వాటి గురించి కొంచెం చెప్పండి మామయ్య, క్లుప్తంగా. లేకపోతే అంతా గోడ అయిపోతుంది.

**మామయ్య:** బ్రహ్మ విద్యలంటే రహస్యాలు కదా. అంతేకాక దుర్గ్రాహ్యాలు కూడా. అందువలన మరీ వివరాలలోకి వెళ్ళకుండా మనం సూత్రం అర్థం చేసుకోవడానికి అవసరమైనంత మట్టుకు ఆ ఉపనిషద్వాక్యాలు తెలుసుకొని తరువాత సూత్రంలోకి వెళదాం.

ముందు గాయత్రీ విద్య గురించిన ఉపనిషత్ వాక్యాలు చూద్దాం.

"గాయత్రీ వా ఇదమ్ సర్వ భూతమ్ యదిదమ్ కించ వాగ్వై గాయత్రీ।

వాగ్వా ఇదమ్ సర్వ భూతమ్ గాయతి చ త్రాయతే చ।।

యా వై సా గాయత్రీయమ్ వావ సా యేయమ్ పృథివ్యస్యాహేద ।

సర్వ భూతమ్ ప్రతిష్ఠితమ్ ఏతామేవ నాతిశీయతే।।

యావై సా పృథివీయమ్ వావ సా యదిదమస్మిన్ పురుషే।

శరీరమస్మిన్ హీమే ప్రాణాః ప్రతిష్ఠితామ్  ఏతదేవ నాతిశీయంతే।।

యద్వై తత్పురుషే శరీరమిదమ్ వావ తద్యదిదమ్ అస్మిన్నంతః।

పురుషే హృదయమస్మిన్ హీమే ప్రాణాః ప్రతిష్ఠితా ఏతదేవ నాతిశీయంతే ।।

సైషా చతుష్పదా షడ్విధా గాయత్రీ తదేత దృచాభ్యానూక్తమ్ ।

తావానస్య మహిమా తతో జ్యాయాంగ్ శ్చ పూరుషః పాదోస్య సర్వా భూతాని త్రిపాదస్య అమృతమ్ దివి।।

యద్వై తత్ బ్రహ్మ ఇతి ఇదమ్ వావ తద్యోయమ్ బహిర్ధా పురుషాదాకాశో యో వై స బహిర్ధా పురుషాదాకాశః।

అయమ్ వావసయః అయమంతః పురుష ఆకాశో యోవై సః అంతః పురుషః ఆకాశః।।

అయమ్ వావ సయః అయమంతః హృదయ ఆకాశః తదేతత్ ।పూర్ణమప్రవర్తిమ్ పూర్ణానుప్రవర్తినీమ్ శ్రియమ్

లభతే య ఏవమ్ వేద।।

**నేను:** దానికి అర్థం క్లుప్తంగా చెబుతారా మామయ్యా!

**మామయ్య:** పై వాక్యాలకు క్లుప్తంగా అర్థం ఇది.

గాయత్రి సమస్త భూత వ్యాప్తము. సర్వ భూత శబ్ద మూలము గాయత్రి. పలుకుట వలన(గానము చేసిన) రక్షించును.

ఆ గాయత్రి భూమి కూడ. ఇచ్చట నున్నదంతా ఆ భూమిపై నుండును, వేరొకచోటికి పోదు.

గాయత్రి శరీరము. ప్రాణములు దీనిలో నుండును. వేరొక చోటికి పోవు.

ఆ శరీరము జీవుని హృదయము. ప్రాణములు అందులో ఉండును. దానిని విడచి పోవు

ఆ గాయత్రి నాలుగు పాదములు కలది. ఆఱు విధములైనది. ఋక్సూక్తమునందు అట్లే చెప్పబడినది.

దాని మహిమ అట్టిది. పురుషుడు అంత కంటె గొప్పవాడు. ఈ భూతమయ లీలా విభూతి ఆయనకు ఒక పాదము. త్రిపాద్విభూతి అయిన పరమపదము మూడు పాదములు.

ఈ విధముగా వర్ణించబడిన పరబ్రహ్మము బాహ్యమున నున్న భూతాకాశము, లోన నున్న అంతరాకాశము, హృదయాకాశము ల నుండును. హృదయమునందుగల ఆకాశము ఎల్లెడల కలదు, అది మార్పు లేనిది. ఇది తెలిసిన వాడు అనంతమైన సంపూర్ణమైన శ్రీని పొందుతాడు.

ఈ పైన చెప్పబడిన అర్థానికి రహస్యార్థాలు చాలా ఉన్నాయి. మీ నాన్న అన్నట్లు మనకు అవన్నీ అప్రస్తుతాలు, ఎందుకంటే మనకు బ్రహ్మ విద్యలు నేర్చుకొనే అర్హతా, సామర్థ్యమూ లేవు కనుక. కాని ఇందులో మనం తెలుసుకొన వలసినవి

1. గాయత్రి తనను పలికెడి వారిని రక్షించును. శబ్దములకు మూలమైనది.

2. గాయత్రిలో అన్ని భూతాలూ ప్రతిష్ఠితమై ఉంటాయి.

3. శరీరమునకు, ప్రాణములకు, హృదయమునకు ఆధారమైనది. అవి అన్నియు దానియందే యుండి వేరొక చోటికి పోవు.

4. గాయత్రి నాల్గు పాదములు కలది. భూత విశ్వము ఒక పాదముగాను, త్రిపాద్విభూతి అయిన పరమపదము మూడు పాదములుగాను గలది.

5. అంతటా వ్యాపించి యున్న దానిని తెలిసికొనిన వాడు అనంత, పరిపూర్ణ శ్రీ పొందుతాడు.

**నేను:** అలాగే జ్యోతిర్విద్యా వాక్యాలు, వాటి అర్థాలు కూడా చెప్పండి మామయ్యా, తరువాత సూత్రాలలోకి వెళ్ళవచ్చును.

**మామయ్య:** ఈ జ్యోతిర్విద్య గాయత్రీ విద్య తరువాత అంటే పదమూడవ ఖండములో వస్తుంది. ఆ వాక్యాలు క్రిందవిధంగా ఉంటాయి.

"తస్య హ వా ఏతస్య హృదయస్య పంచ దేవ సుషయః సయః అస్య।

ప్రాజ్ సుషిః స ప్రాణః తత్ చక్షుః స ఆదిత్య తదేత తేజో ఆనాద్యమ్ ఇతి ఉపాసీత తేజః వ్యన్నాదో భవతి య ఏవమ్ వేద।।

అథ యః అస్య దక్షిణః సుషిః స వ్యానః తత్ శ్రోత్రా సచస్ ।

దరమా సతదేతచ్ ఛ్రీశ చ యశస్ చేత్ యుపాసీత శ్రీమాస్ యశస్వీ భవతి య ఏవమ్ వేద।।

అథ యః అస్య ప్రత్యక్ సుషిః సః అపానః సా వాక్యః అగ్నిః తదేతత్।

బ్రహ్మ వర్చసమన్నాత్ యమ్ ఇతి ఉపాసీత బ్రహ్మ వర్చస్యన్నాదః భవతి య ఏవమ్ వేద।।

అథ యః అస్య ఉదజ్ సుషిః ససమానః తన్మనః సపర్జన్యః తదేతత్ కీర్తిశ్చ వ్యుష్టిః చేత్యుపాసీత కీర్తిమాస్ టయుష్టిమాస్ భవతి య ఏవమ్ వేద।।

అథ యః అస్యోర్ధ్వః సుషిః స ఉవాచ స వాయుః స ఆకాశః తదేతదదోజశ్చ।

మహశ్చేత్ ఉపాసీత ఓజస్వీ మహస్వాస్ భవతి య ఏవమ్ వేద।।

తేవా ఏతే పంచ బ్రహ్మ పురుషాః స్వర్గస్య లోకస్య ద్వారపాః।

స యు ఏతానేవమ్ పంచ బ్రహ్మ పురుషాన్ స్వర్గస్య లోకస్య ద్వారపాన్।।

వేదాస్య కులే వీరో జాయతే ప్రతిపదయతే స్వర్గమ్ లోకమ్ య।

ఏతాదేవమ్ పంచ బ్రహ్మ పురుషాన్ స్వర్గస్య లోకస్య ద్వారపాన్ వేద।।

అథ యదతః పరోదివో జ్యోతిః దీప్యతే విశ్వతః పృష్ఠేషు।

అనుత్తమేషు ఉత్తమేషు లోకేషు ఇదమ్ వావ తద్యదిదమ్ అస్మిన్నంతః పురుషమ్ జ్యోతిః।।

ఇందులో పరబ్రహ్మ ఒక మహా భవనములో నుండి ప్రకాశిస్తున్న మహా సామ్రాట్టు వలె రూపకల్పన చేయ బడింది. ఆ భవనానికి ఐదు ద్వారాలు ఉన్నాయట. ఈ ద్వారముల వద్ద పంచ ప్రాణాలూ, పంచ భూతాలూ, ఇంద్రియాలూ ఉన్నాయట.

అందులో తూర్పు దిశగా నున్నది ప్రాణము. అచటనే చక్షువు, ఆదిత్యుడు. దాని యందు ధ్యానిస్తే తేజస్సు, అన్నము కలుగును.

దక్షిణ ద్వారమున వ్యానము, శ్రోత్రమ్, చంద్రుడు. దాని యందు ధ్యానము చేసిన యశస్సును, సంపద కలుగును.

పశ్చిమ ద్వారమున నపానము, వాక్కు, అగ్ని. అందు ధ్యానించిన బ్రహ్మ వర్చస్సు, ఆహార సంపద కలుగును.

ఉత్తర ద్వారమున సమానము, మనస్సు, పర్జన్యము(వాయువు) కలవు. అది తెలుసుకొని అందు ధ్యానించిన కీర్తి, సౌందర్యము కలుగును.

ఊర్ధ్వ ద్వారమున ఉదాన వాయువు, ఆకాశము కలవు. అందు ధ్యానించిన మహత్తు, ఓజస్సు కలుగును.

ఈ ద్వారములకు పాలకులు కలరు. వీరిని తెలిసిన వారి వంశమున మహానుభావులు జన్మించెదరు. అట్టివారు పరమపదమును పొందెదరు.

ఆ పరమపదమున వెలుగు జ్యోతి అన్నిటి కన్న గొప్పది. దానిని తెలిసిన వారికి రథ, వృషభ, అగ్ని శిఖాది శబ్దములు తోచును. అట్టి పరబ్రహ్మమును అంతర్జ్యోతిని ధ్యానించవలెను. అట్టి వారు గొప్పవారు.

దీనికీ రహస్యాలూ, వివరాలూ చాలా ఉన్నాయి. మనం ఆ లోతులలోనికి వెళ్ళనక్కరలేదు.

ఇంక మనం సూత్రాల లోనికి వెళ్ళిపోదాము.

(ఉపనిషత్ వాక్యార్థము చాలా మందికి గాబరాగా ఉండవచ్చును. కేవలం పరిచయానికి మాత్రం పరిగణించ ప్రార్థన. ఈ పరిచయం లేకుంటే తరువాత కష్టమవుతుందని పరిచయం చేయడం జరిగింది. అంతవరకే)

**నేను:** ఈ ఉపనిషదర్థాలు కొంచెం కష్టంగానే ఉన్నాయి మామయ్యా!

**మామయ్య:** మరేమీ బెంగ అక్కరలేదు. వాటి పరిచయం మాత్రం ఉంటే చాలును. అందులో మనకు అవసరమయినది సూత్రం చర్చించుకున్నప్పుడు ఎలాగూ మళ్ళీ చూస్తాము.

ఈ అధికరణంలో నాలుగు సూత్రాలు ఉన్నాయనుకున్నాము కదా. అందులో రెండు సూత్రాలు గాయత్రీ విద్య గురించి, రెండు జ్యోతిర్విద్య గురించి ఉన్నాయి. వాటిని వరుసగా చూద్దాము.

## "జ్యోతిః చరణాభిదానాత్ "......1-1-25

జ్యోతిః : జ్యోతి శబ్ద వాచ్యుడు(సర్వేశ్వరుడైన పరబ్రహ్మ ఏలననగా)

చరణాభిదానాత్: (సర్వ భూతములు దానికి) పాదముగా చెప్పి యుండుట వలన

జ్యోతిస్సు అనబడుదానికి సకలభూతములు పాదముగా చెప్పి యుండుట చేత జ్యోతిశ్శబ్ద వాచ్యుడు పరబ్రహ్మమే.

**నేను:** కొంచెం వివరిస్తారా మామయ్యా!

**మామయ్య:** ఇంతకుముందు ఉపనిషద్వాక్యాలు చూసినప్పుడు

"**అథ యదతః....పురుషే జ్యోతిః**" అని చూసేము కదా. అంటే "ఏ జ్యోతిస్సు విద్యుల్లోకమున కంటె పైన ప్రకాశించుచున్నదో, ఏ జ్యోతిస్సు ప్రాణి వర్గము మీదను, భూలోకము మీదను, అంతకంటె ఉత్కృష్టములైన సకలలోకముల మీదను ప్రకాశించు చున్నదో ఆ జ్యోతిస్సే పురుష శరీరమునందు కూడ ప్రకాశించుచున్నది" అని అర్థము. ఇక్కడ ఈ జ్యోతిస్సు ఆదిత్యాది జ్యోతిస్సు కాదు.

**నేను:** ఎందుకని, మనం మామూలుగా జ్యోతి అంటే ఆదిత్యాది జ్యోతిస్సే కదా పరిగణిస్తాము. అంతే కాకుండా అదే జ్యోతిస్సు పురుష శరీరములో కూడా ఉన్నది అంటే అది "జఠరాగ్ని" అన్నమాట. దీనినే జగత్కారణముగా చెబుతున్నట్లు అనుకోలేమా!

**మామయ్య:** కుదరదు. ఎందుకంటే శ్రుతి వాక్యాలలో "**పాదోస్య విశ్వా భూతాని త్రిపాదస్య..**" అని అని సకల భూతములు పరమ పురుషుని పాదమని, మిగిలిన మూడు పాదములు త్రిపాద్విభూతి అయిన పరమపదము అని చెప్పబడింది కదా. ఇంతకుముందు "**అక్షిణీ**" అని నేత్రద్వయము అంటే పరమాత్మకు తప్ప, చతుర్ముఖ బ్రహ్మ, రుద్ర, ఇంద్రాదులకు ఎలా వర్తించదు అనుకున్నామే ఇక్కడకూడా నాలుగు పాదాలు అంటే ఆ పరమాత్మకు తప్ప మరెవ్వరికీ అది వర్తించదు. ఇంక అచేతనమైన జ్యోత్యాదులకు జగత్కారణత్వము ఆపాదించలేము కదా. ఇకపై పురుషుడు అంటే ఎవరు అన్నదానికి కూడా పురుష సూక్తము "**హ్రీశ్చతే లక్ష్మీశ్చ పత్న్యౌ**" అని పరబ్రహ్మ శ్రీమన్నారాయణుడని నిర్వచించింది. ఆ భగవానుడే భగవద్గీతలో "**అహమ్ వైశ్వానరో**

**భూత్వా ప్రాణినామ్ దేహమాశ్రితః"** అని తానే జీవుల శరీరములో జఠరాగ్ని యై ఉంటానని చెప్పేడు.

సర్వోత్కృష్టత, మోక్షప్రదత్వము మొదలైన గొప్ప గుణాలు పరమాత్మ కే కదా చెందుతాయి. అందువలన ఈ సందర్భములో కూడా జ్యోతి శబ్ద వాచ్యుడు పరబ్రహ్మ యే.

**అమ్మ:** బాగుంది మామయ్యా, మా వాడికి మఱేమీ ప్రశ్నలు రాకముందే తరువాత సూత్రము మొదలు పెట్టండి.

## మామయ్య:

### "ఛందః అభిధానాన్నేతి చేత్ న తథా చేతః అర్పణనిగమాత్ తథా హి దర్శనమ్.......1-1-26

అంటే

ఛందః అభిధానాత్: (జ్యోతిశ్శబ్దము గాయత్రి అనబడు ) ఛందస్సును తెలుపుటచే

న: అది యుక్తము కాదు

తథా: అట్లు

చేతః అర్పణ నిగమాత్: (ఇచట పరబ్రహ్మమును గాయత్రితో సమానముగా జీవులు) అనుసంధింపవలెనని నియమించుటచే

తథా హి: అట్లే కదా

దర్శనమ్: (శ్రుతి) నిదర్శనము కలదు.

అనగా

ఈ సందర్భములో జ్యోతిశ్శబ్దము గాయత్రి అనబడే ఛందస్సును తెలుపడం చేత అది పరమాత్మ కాదన్నచో అది అయుక్తము. ఏలనన గాయత్రి సాదృశ్యముతో పరమాత్మను అనుసంధించవలెనని విధించుట చేత శ్రుతి కూడ అటులనే తెలుపుతున్నది.

**నేను:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** గాయత్రీ విద్యలో గాయత్రి అని చెప్పి దానిని సర్వాత్మకమని, సర్వోత్కృష్టమని చెప్పి దానిని అనుసంధించుట మోక్షదాయకమని చెప్పేరు కదా. ఈ లక్షణాలు పరమాత్మకు తప్ప మరెవ్వరికి కుదురుతాయి. అందువలన ఇక్కడ కూడా జ్యోతి, గాయత్రి అంటే పరబ్రహ్మ తప్ప గాయత్రీ ఛందస్సు కాదు.

**నేను:** ఇందాకా "**తదేతదృచాభ్యనూక్తమ్**" అని చెప్పినప్పుడు వర్ణింపబడినది గాయత్రీ ఛందస్సు కాదా!గాయత్రి కి నాల్గు పాదములు కలవు అంటూ ఋక్ లోకూడా ఉన్నది అని కదా చెప్పేరు ఇందాకా.

**నాన్నగారు:** బావా, గాయత్రీ ఛందస్సుకి మూడు పాదాలా, నాలుగు పాదాలా. మనం సంధ్యా వందనంలో చదివే గాయత్రీ మంత్రము మూడు పాదాలున్నట్లే ఉంటుంది. లేక అది గాయత్రీ మంత్రమే కాని గాయత్రీ ఛందస్సు కాదా.

**అమ్మ:** అసలు ఛందస్సు అంటే ఏమిటి మామయ్యా!

**మామయ్య:** ఇందాకా మా వాడు ప్రశ్న వేయక ముందు అని వాడిని అని, ఇప్పుడు అందరూ ఒక్కసారి ప్రశ్న పరంపర సంధించేస్తున్నారా. ఒక్కొక్క దానికీ సమాధానము చెబుతాను.

ఛదిరావరణే అని వ్యుత్పత్తి. అంటే విషయాన్ని జాగ్రత్తగా కప్పి, ఎవరికి అందీయాలో వారికి అందించేది అన్నమాట. ఛందస్సు చేసేది అదే. మన శ్రుతులను ఛందస్సు అనే అంటారు. ఛాందసుడు అంటే వేదమును పాటించే వాడని అర్థము. మన దురదృష్టము కొద్దీ దానికి మరొక అర్థము వాడుక లో ఎక్కువ ప్రచారమైపోయిందనుకోండి.

వేదాంగాలలో అంటే శిక్ష, వ్యాకరణము, ఛందస్సు, నిరుక్తము, జ్యోతిషము, కల్పము అన్న వాటిలో ఛందస్సు కూడా ఒకటి. ఇక్కడ ఛందస్సు అంటే అక్షర గమన నియమము. ఉదాహరణకు అనుష్టుప్ ఛందస్సునకు నాలుగు పాదాలూ, ఒక్కొక్క పాదానికి ఎనిమిది అక్షరాలు, ఇలా ఏవో నియమాలుంటాయి. ఇలాగే గాయత్రీ ఛందస్సుకి కూడా నియమాలున్నాయి. ఇతిహాస, పురాణాలు ఎక్కువగా అనుష్టుప్ లో ఉంటే, శ్రుతులలో ముఖ్యంగా గాయత్రీ ఛందస్సు వాడబడిందట.

మనం ఇందాకా అనుకున్నట్లు గాయత్రీ ఛందస్సునకు సామాన్యముగా నాలుగు పాదాలే. మనం సంధ్యా వందనం లో జపించేది త్రిపాద గాయత్రి. దేవీ గాయత్రీ ఛందః అంటాము. అంటే దీనిలో మూడే పాదాలున్నాయి. దీనినే మనము వ్యాహృతులతో బాటు జపిస్తాము. కొంతమంది శిష్టులు గాయత్రీమంత్రాన్ని అష్టాక్షరితో బాటు జపిస్తారు. కాని తురీయావస్థ లో నున్నవారు నాలుగు పాదాల గాయత్రీ జపము చేస్తారు. ఈ నాల్గవ పాదము రహస్యము అవడం వలన మనకెవ్వరికీ తెలియదు. మనకి తెలిసినవి మూడు పాదాలే.

**నేను**: అయితే నాలుగు పాదాల గాయత్రీ ఛందస్సు శ్రుతులలో ఉందా.

**మామయ్య**: ఎందుకు లేదు. ఈ క్రింద శ్రుతి చూడు

**"ఇంద్రః శచీపతిః**

**వలేన పీడితః।**

దుశ్చ్యవనో వృషా

సమిత్సు సానహి ||

మళ్ళీ మొదటికి, అదే రామం ప్రశ్నకు వస్తే సర్వాత్మకము, పరమపద ప్రదాయకము అంటూ ఇక్కడ చెప్పబడుతున్నది వట్టి ఛందస్సు కాదు. అలాగయితే సర్వాత్మకము మొదలయిన విశేషణాలు ఛందస్సుకు కుదరవు. ఇక్కడ కూడా నాలుగు పాదాలు అంటే "పాదోస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతమ్ దివి" శ్రుతి వాక్య ప్రమాణాన్నే తీసుకోవాలి. పరమాత్మకే కదా నాలుగు పాదాలని చెప్పుకున్నాము. పరమ ఫల ప్రదానానికి అను సంధించ వలసినది కూడా పరబ్రహ్మనే కదా.

ఛాందోగ్యోపనిషత్ లోనే మరొక చోట సంవర్గ విద్య అని వస్తుంది. అక్కడ "తే వా ఏతే ..." అని ప్రారంభించి "సైషా విరాడన్నాత్" అని వస్తుంది దానిలో అంటే విరాట్ స్వరూపాన్ని అంటే వాయువు, అగ్ని, సూర్యుడు, చంద్రుడు, జలము, ప్రాణము, వాక్కు, చక్షుస్సు, శ్రోత్రము, మనస్సు మొత్తము పదింటి ని చెప్పడానికి పది అక్షరాల విరాట్ఛందస్సు ను వాడుతారు. అలాగే ఇక్కడా అలాగే గాయత్రి అంటే పరబ్రహ్మ అని అర్థము.

**నేను:** ఈ లీలా విభూతిలో లోకాలన్నీ పరమాత్మకు ఒక పాదమనీ, త్రిపాద్విభూతి మూడు పాదాలనీ పరమాత్మకు నాలుగు పాదాలున్నాయనీ అంటే సమంగా అర్థం కాలేదు.

**మామయ్య:** రావణ వధానంతరము "భవాన్ నారాయణో దేవః" అని బ్రహ్మ రాముడిని నువ్వు నారాయణుడవు అని సంబోధిస్తూ  జగత్సర్వమ్ శరీరమ్ తే" అంటాడు అంటే ఈ లీలా, నిత్య విభూతులు ఆ పరమాత్మకు శరీరము అని. అందులో లీలా విభూతి ఒక పాద భాగము కాగా, నిత్య విభూతి, అదే త్రిపాద్విభూతి మూడు పాద భాగములు అని "పాదః అస్య విశ్వా భూతాని, త్రిపాద అస్య అమృతమ్ దివి" అని చెబుతుంది శ్రుతి. పాదము అంటే పావు వంతు అని అర్థము. మనం తెలుగులో కాలు వంతు అని కూడా అంటాము కదా. అంటే ఇక్కడ ఆ పురుషుని శరీరమైన లీలా, నిత్య విభూతులలో లీలా విభూతి కాలు వంతు(పావు వంతు),

నిత్య విభూతి ముక్కాలు వంతు(ముప్పావు వంతు) అని అన్నమాట. నిత్య విభూతి ఈ సమస్త లీలావిభూతి కంటే మూడు రెట్లు పెద్దదన్నమాట. ఈ రకంగా పరమాత్మ కు లీలా, నిత్య విభూతులు పరమాత్మ శరీరమున నాలుగు పాదములుగా రూపించి చెప్పడం జరిగిందన్నమాట.

**అమ్మ**: తరువాతి సూత్రము ఏమిటి మామయ్యా!

**మామయ్య**: గాయత్రీ శబ్దము పరబ్రహ్మ పరమనుటకు మరొక కారణం చెబుతూ తరువాత సూత్రము చెబుతున్నారు

## "భూతాది పాద వ్యపదేశ ఉపపత్తేశ్చ"....1-1-27

అంటే

భూతాది పాదవ్యపదేశ ఉపపత్తేః చ: భూతాదులు పాదములుగా చెప్పబడుటయు సంభవము కనుక

ఏవమ్: ఇట్లు (గాయత్రీ శబ్దమును సర్వేశ్వర పరముగానే తెలియనగును)

అనగా

గాయత్రీ ఛందస్సు సర్వేశ్వరుని తెలిపేదయితే సర్వ భూతములు అతని పాదమనీ శ్రుతి చెప్పి యుండుట కుదరదు అని తెలుసుకొన వలెను. (ఛందస్సుకి సర్వ భూతాలూ పాదాలు కాలేవు కదా). జగచ్ఛరీరుడైన పరమాత్మకే అది సంభవము. లీలా, నిత్య విభూతులకు, ఆ పరమాత్మకు శరీర, శరీరి భావ సంబంధమున్నట్లు శ్రుతి, ఇతిహాస, పురాణాలన్నీ అనేక పర్యాయములు వక్కాణించేయి కదా. గాయత్రీ విద్య అనువాకములో "సైషా చతుష్పదా" అనీ "ఇదమ్ సర్వ భూతమ్ గాయతిచ త్రాయతే చ" అనే వాక్యాలు ఈ భూతాదులను పాదములుగా కల్గి యున్నదనీ, తనను గానము చేసిన భూతములను రక్షిస్తుందనీ, ఇలా చెప్పబడిన

విశేషణాలు పరమాత్మకే వర్తిస్తాయి తప్ప మాత్రా ఛందస్సునకు వర్తించవు. ఛందస్సునకు కూడా నాలుగు పాదాలుంటాయి అన్నా భూతాదులు ఆ పాదాలు కానేరవు. ఛందస్సు కూడా తనను పాడిన వారిని రక్షిస్తుంది అనడానికి, అంతిమంగా రక్షించడం సర్వేశ్వరుడైన పరబ్రహ్మానికే కుదురుతుంది, ఆ రక్షణ ఆయన ఎవరి ద్వారా ప్రసాదించినా. అందువలన గాయత్రీ విద్య లో గాయత్రి శబ్దము పరమాత్మ పరముగా చెప్పడమే యుక్తము.

**అమ్మ**: తరువాతి సూత్రమేమిటి మామయ్యా!

**మామయ్య:**

## "ఉపదేశ భేదాత్ న ఇతి చేత్ న ఉభయస్మిన్ అపి అవిరోధాత్"....1-1-28

అంటే

ఉపదేశ భేదాత్: ఉపదేశమున భేదముండుటచే

న: (జ్యోతి శబ్దము పరమాత్మను తెల్పునది) కాదు

ఇతి చేత్: ఇట్లు అనినచో

న: అది యుక్తము కాదు(ఏలనన)

ఉభయస్మిన్ అపి: ద్వివిధోపదేశమునను

అవిరోధాత్: విరోధము లేకపోవుట వలన

అనగా

"**త్రిపాదస్యామృతమ్ దివి**" అని పరమాత్మకు త్రిపాద్విభూతి అయిన ద్యులోకము శరీరభాగముగా చెప్పి, మరొకసారి "పరో దివో జ్యోతిః" అని ద్యులోకము పైనున్నది జ్యోతి అని చెప్పుట వలన జ్యోతి అనగా పరబ్రహ్మ అవుట్లకు విరోధము వచ్చుననినచో అది విరోధము కాక పోవుటచే జ్యోతి శబ్దము పరమాత్మను తెల్పునది కాదని చెప్పుట యుక్తము కాదు.

**నేను:** కొంచెం వివరించండి మామయ్యా,

మామయ్య: మనం ఇంతకు ముందు చదువుకున్న విద్యలలో ఒక చోట "**త్రిపాదస్య అమృతమ్ దివి**" అని ఉంది. దివి అని సప్తమీ విభక్తి ప్రయోగము వలన ఆ త్రిపాద్విభూతి ఆయన సంబంధితము. పరబ్రహ్మ

ద్యులోకము ఆధారముగ వర్ణింపబడినాడు.

మళ్ళీ మరొక చోట "**పరః దివో జ్యోతిః**" అని ఉంది. అంటే జ్యోతి స్వరూపము ద్యులోకమునకు పైన నున్నది, ద్యులోకము అవధిగా ఉన్నది అని అర్థం వస్తుంది. నువ్వు ఎక్కడ ఉన్నావు అంటే ఇంట్లోనూ ఉన్నాను, ఇంటి బయటా ఉన్నాను అంటే ఎలా. అలాగయితే జ్యోతి శబ్ద వాచ్యుడు పరమాత్మ కాదా అన్నది ఇక్కడ సంశయము. అందువలన ద్యులోకానికి పైనున్న జ్యోతి పరమాత్మ కాదేమో అని ప్రశ్న.

**నేను:** మరి దానికి సమాధానము

**మామయ్య:** ఇక్కడ రెండు రకాలుగా ఉన్నట్లనిపించినా భావమొక్కటే కనుక ఆక్షేపము లేదు అని సమాధానము. "చెట్టు చివర డేగ ఉన్నది" అన్నా "చెట్టు పైన డేగ ఉన్నది" అన్నా అర్థం ఒక్కటే. ఇక్కడా అలాగేనన్న మాట. విరోధము లేదు.

"ఏతావానస్య మహిమా అతో జాయాంశ్చ పూరుషః పాదోస్య విశ్వా భూతాని త్రిపాదస్యామృతమ్ దివి" అంటే ఇతని మహిమ ఇంత మాత్రము, దీనికంటెను పురుషుడు గొప్పవాడు, భూతాది సమస్తము ఒక్క పాదము. మిగిలిన మూడు పాదములు ద్యులోకమున అమృత స్వరూపము. అనియు

"వేదాహమేతమ్ పురుషమ్ మహాంతమ్ ఆదిత్యవర్ణమ్ తమసః పరస్తాత్" అనే శ్రుతి వాక్యము అప్రాకృత శరీరాన్ని పరబ్రహ్మకు చెబుతోంది. ఆ అప్రాకృత శరీరము గల పరమపురుషుని తేజస్సు కూడ అప్రాకృతమే. కనుక అటువంటి అప్రాకృతమైన తేజస్సుతో కూడిన వాడవడం వలన పరమపురుషుడే శ్రుతియందు తేజస్సుగా చెప్పబడుతున్నాడు. ఆ తేజః ప్రకాశ వ్యాపకత్వము చెప్పబడుట వలన కూడ విరోధము కలుగదు. అందువలన ఆ శ్రుతి వాక్యములో జ్యోతి  గా చెప్పబడినది పరమాత్మయే.

దీనితో జ్యోతిరధికరణము ముగిసినదమ్మా!

అమ్మ: బాగుంది మామయ్యా, సమస్త భూత విశ్వము జ్యోతిశ్శబ్దమునకు పాదముగా చెప్పబడుట చేతనూ, జ్యోతిశ్శబ్దము  గాయత్రి అనబడే ఛందస్సును తెలుపుట వలననూ, గాయత్రి కి చెప్పబడిన తనను పాడిన వారిని రక్షించుట, సర్వాత్మకత్వము కలిగి ఉండుట మొదలైన గుణములు పరబ్రహ్మకే వర్తించడం వలననూ, "త్రిపాదస్యామృతమ్ దివి", "పరో దివో జ్యోతిః" అను వాక్యములలో "ద్యులోకమున" అని చెప్పినా, "ద్యులోకముపై" అని చెప్పినా ఆ అర్థములలో విరోధము లేకుండుట వలన గాయత్రి విద్య, జ్యోతిర్విద్యలలో గాయత్రి, జ్యోతి అను శబ్దములు పరబ్రహ్మనే ప్రతిపాదిస్తాయి అని చక్కగా అర్థమయ్యేటట్లు చెప్పేరు.

మామయ్య: తరువాతి అధికరణము మరొకసారి చూద్దామమ్మా.

అందరూ: యో నిత్యమచ్యుత పదాంబుజ.....

---

## 7 . ఇంద్ర ప్రాణాధికరణము:

**నాన్నగారు**(ప్రవేశించి కూర్చుంటూ) బావా పనులలో ఉన్నావా, ఇలా తరచుగా వచ్చి కూర్చుంటోండడం వలన నీ పనులకు ఇబ్బంది గా లేదు కద.

**మామయ్య:** మంచి మాటే! ఈ చర్చల వలన మీకంటే నాకే ఎక్కువ లాభం కలుగుతోంది, ఎప్పుడో చదువుకున్నది అప్పుడే వదలివేయడం అయిపోయింది. మన పాతాల కోసం మళ్ళీ చూస్తూంటే అనిపిస్తోంది, వేదాంతం మాట, సంస్కృత భాషా విశేషాల మాట సరేసరి, ఇంత తార్కికంగాను, క్రమబద్ధంగాను ఉన్న శాస్త్ర గ్రంథము భగవద్రామానుజులు మనకందిచ్చిన ఆస్తి. దాని విలువ తెలియక దూరం చేసుకుంటున్నామే అని.

**నాన్నగారు:** నిజమే బావా, సైన్సు, పాశ్చాత్య జ్ఞానాల ప్రభావం వలన నాకు తర్కం కాని వైజ్ఞానిక దృక్పథము గాని పాశ్చాత్యులదే, అక్కడి నుండే మనం నేర్చుకున్నాము. మనకు మన శాస్త్రాలు పరమాత్మ భక్తి, సాధన అవీ చెప్పినా అవి అన్నీ తర్క బాహ్యాలై, విశ్వాస ప్రాతిపదికతో ఉన్నవేమో అనుకున్నాను కొన్నాళ్ళు. నీలాంటి పెద్దల సాహచర్యం వలన కొన్నాళ్ళ క్రితమే నాకు మన శాస్త్ర గ్రంథాల గురించి వాటి వైజ్ఞానిక దృక్పథము గురించి తెలుస్తోంది.

**మామయ్య:** నిజానికి తర్కానికి పరిపూర్ణముగా నిలబడగలిగేది మన సిద్ధాంతమే. పాశ్చాత్యులంటున్నావు కదా, అంటే క్రైస్తవమో, మరొకటో, మరొకటో తీసుకో. అందులో తర్కానికి తావు ఎక్కడుందీ. పుస్తకంలో ఉన్నది కనుక నమ్మడం, ఆచరించడం అంతే. దానిని ప్రశ్నించడం నేరము, శిక్షార్హము కూడ.

**నాన్నగారు:** అవును. మనం ఈ మధ్య చదువుకుంటున్న అధికరణాల వలన చాలా అపోహలు, అలవాట్లు సరిదిద్ద బడతాయి. రకరకాల దేవుళ్ళను కొలవడాలూ అదీ. నాకిప్పుడు తెలిసింది ఈ అధ్యాయాన్ని

సమన్వయాధ్యాయము అని ఎందుకు అంటారో. వివిధ శ్రుతి వాక్యాలనన్నిటినీ సమన్వయ పరచి ఒక త్రాటి పై తెచ్చేరు భగవద్రామానుజులు.

**మామయ్య:** ఈ కొలవడాలు, అదే ఉపాసనలు మూడు రకాలు అనుకోవచ్చు.

1.స్వరూప పరమాత్మోపాసనము. అంటే పరమాత్మ స్వరూపాన్ని నేరుగా ఉపాసన చేయడం. మన పూర్వాచార్యులు చెప్పినట్లు శ్రీమన్నారయణుడి అర్చామూర్తిని అర్చించడం లా అన్నమాట.

2. అచిచ్ఛరీరక పరమాత్మోపాసనము. ఇందులో అంతర్యామిగా అచిచ్ఛరీరములోనున్న పరమాత్మను ఉపాసించడం జరుగుతుంది.

3. చిచ్ఛరీరక పరమాత్మోపాసనము . ఇందులో జీవాత్మలో నున్న పరమాత్మను ఉపాసనం చేస్తాము.

అలాంటప్పుడు అంటే అలా ఉపాసన చేస్తున్నప్పుడు చిత్తు అయినా, అచిత్తు అయినా మనం ఉపాసన చేసేది తదంతర్యామి అయిన పరమాత్మనే అన్న విషయం మనకు స్పష్టంగా తెలియాలి. తరువాత అధికరణం వలన ఇది తెలుస్తుంది.

**నేను:** ఏమిటా అధికరణం మామయ్యా

**మామయ్య:**

తరువాత అధికరణం "ఇంద్ర ప్రాణాధికరణము" అని, దీనిలో కూడా

నాలుగు సూత్రాలు ఉన్నాయి. అందులో మొదటి సూత్రము

## "ప్రాణః తథానుగమాత్".....1-1-29

ప్రాణః: ప్రాణ శబ్ద వాచ్యుడు

తథా: అట్లు

అనుగమాత్:తెలియ వచ్చుట వలన

(పరమాత్మయే)

అనగా

(ప్రతర్దన విద్యా సందర్భంలో ప్రాణ శబ్దముచే చెప్పబడిన వాడు పరబ్రహ్మ యని తెలుస్తోంది.

**నేను:** ప్రతర్దన విద్య అంటే

**మామయ్య:** ఇది కౌషీతకీ ఉపనిషత్తులో వస్తుంది. కౌషీతకీ ఉపనిషత్తు ఋగ్వేదము లోనిది. ఇది శంకరాచార్యాదులు పేర్కొన్న దశోపనిషత్తులలోది కాదనుకో. కౌషీతకీ శాఖకు సంబంధించినది. కాని అన్ని వేదాంత శాఖలకు అంగీకృతమైనదే. కౌషీతకీ బ్రాహ్మణమని కూడా దీనిని అంటారు. ఇది ఛందోబద్ధంగా కాకుండా వచనం లాగా ఉంటుంది. ప్రస్తుత ఉపనిషత్తు కౌషీతకీ ఆరణ్యకము లోనిది. కౌషీతకీ ఆరణ్యకంలో 15 అధ్యాయాలు ఉన్నాయి. అందులో 4 అధ్యాయాలు ఈ కౌషీతకీ ఉపనిషత్. కొంతమంది ఈ ఉపనిషత్ 9 అధ్యాయాలని కూడా అంటారు. కాని అవి మనకు ఇప్పుడు లభ్యమవడం లేదు.

ఇందులో ఈ ప్రతర్దన విద్య ప్రతర్దనుడికి ఇంద్రుడిచే చెప్పబడినది. దేవోదాసుని కుమారుడైన ప్రతర్దనుడనే రాజు తన యుద్ధము చేత పరాక్రమము చేత ఇంద్రుడి ప్రియ మందిరాన్ని చేరి ఇంద్రుడిని మెప్పిస్తాడు. అప్పుడు ఇంద్రుడు ఆనందించి ప్రతర్దనుడిని తనకిచ్చవచ్చిన వరము కోరుకొనమనినపుడు ఆ ప్రతర్దునుడు మనుష్యునికేది మిక్కిలి హితమో దానిని నీవే ఆలోచించి ప్రసాదించమని చెబుతాడు. ఈ సందర్భంలో ఉపనిషత్ వాక్యాలలో కొన్ని ఇప్పుడు చెబుతాను.

"ప్రతర్దనో హ వై దైవోదాసిః ఇంద్రస్య ప్రియమ్ ధామోపజగామ.

యుద్ధేన చ పౌరుషేణ చ".....

"వరమ్ వృణీష్వేతి వక్తారమ్ ఇంద్రమ్ ప్రతి త్వమేవ మే వరమ్ వృణీష్వ యమ్ త్వమ్ మనుష్యాయ హితతమమ్ మన్యసే ఇతి ప్రతర్దనేన ఉక్తే సహోవాచ ప్రాణోస్మి. ప్రజ్ఞాత్మా తమ్ మామాయుః అమృతమ్ ఇతి ఉపాస్వ" ఇతి

**నేను:** నువ్వే నాకు హితతమైనది ప్రసాదించు అన్న ప్రతర్దనుడికి ఇంద్రుడు ఏమని చెప్పేడుట.

**మామయ్య:** ఇంద్రుడు ప్రతర్దనుడికి "నేను ప్రాణ స్వరూపుడను. మరియు ప్రజ్ఞ గల ఆత్మను ఇట్టి నన్ను "ఆయువుగను, అమృతస్వరూపునిగాను" ఉపాసింపుము " అని చెప్పేడుట.

**నేను:** అంటే మనుష్యునికి హితతమమైనది ఇంద్రోపాసన అన్న మాట. హితతమమ్ అంటే మోక్ష ప్రాప్తి యేకదా. ముక్తిః మోక్షః మహానందః అని అపరిమిత, నిత్య ఆనందావస్థ మోక్ష స్థితియే కదా. "తస్య తావదేవ విమోక్ష్యే అథ సంపత్స్యే " అని శ్రుతులచే చెప్పబడినట్లు శరీరత్యాగము తరువాత అమృత స్వరూపమగు మోక్షము వచ్చేది పరబ్రహ్మోపాసనము వలన కదా. అంటే ఇంద్రోపాసన వలన ఈ మోక్షము వస్తుందంటే ఇంద్రుడే పరబ్రహ్మ అన్న మాట. అంటే అతడే జగత్కారణుడు కూడ. అంతే కదా మామయ్యా.

**మామయ్య:** ఇలా అర్థం చేసుకొని ప్రమాదంలో పడిపోతారనే భగవద్రామానుజులు సాకల్యంగా వివరించేరు ఎలా అర్థం చేసుకోవాలో. ఇంద్రుడు కూడా ఈ లీలా విభూతిలోని ఒక జీవుడు కదా. ఒక జీవుడు మరొక జీవుడికి లీలా విభూతికి అతీతమైన మోక్షాన్ని ఈయ లేడు కదా. తనకు కూడ అందుబాటు లో లేనిదానిని మరొకరికి ఇంద్రుడు తాను మరొకరికి ఎలా ఈయగలడు. అంటే ఇక్కడ ఇంద్ర శబ్ద వాచ్యుడు గాని, ఇంద్రుడు

తాను "ప్రాణోస్మి" అని నేను ప్రాణమును అని చెప్పినప్పుడు ఆ ప్రాణ శబ్ద వాచ్యుడు గాని ఇంద్రుడనే జీవుని కంటే వేరుగానున్న వానికి అంతర్యామి అయిన పరమాత్మయే.

అక్కడ మిగిలిన విశేషణాలు చూడు. "ప్రజ్ఞాత్మా", ఆనందః", "అమృతః", "అజరః", అంటే జ్ఞాన, ఆనంద స్వరూపుడు, అజరుడు, అమృతుడు అంటూ ఆ విశేషణాలు అన్నీ కూడా పరమాత్మకే చెందుతాయి. అమృతత్త్వము "నచ పునరావర్తతే" అన్నట్లు ఆ నిత్య విభూతి లో తప్ప లీలా విభూతిలో జీవుడైన ఇంద్రుడికి చెప్పడానికి అవదు కదా. భగవద్గీత లో చెప్పినట్లు ఈ లీలా విభూతిలో లోకాలూ, జీవుళ్ళూ కూడా లయమవవలసినదే కదా. అందువలన ఇంద్రశబ్దవాచ్యుడు, ప్రాణ శబ్దవాచ్యుడు కూడ ఇక్కడ పరబ్రహ్మయే.

ఈ విషయం ఇంకా వివరంగా తరువాత సూత్రము చెబుతుంది.

**నేను:** ఆ సూత్రము ఏమిటి మామయ్యా!

**మామయ్య:**

## "న వక్తుః ఆత్మోపదేశాదితి చేత్ అధ్యాత్మ సంబంధ భూమాహ్యస్మిన్"...1-1-30

అంటే

వక్తుః: ఉపదేశకుడగు ఇంద్రుడు

ఆత్మోపదేశాత్: స్వాత్మను ఉపాసింపుమని ఉపదేశించుట చేత

న: ప్రాణ శబ్దము బ్రహ్మ వాచకము కాదు

ఇతి చేత్: ఇట్లు అన్నచో(సరి కాదు)

హి: ఏలననగా

అస్మిన్: ఈ ప్రకరణమున, సందర్భమున

అధ్యాత్మ సంబంధ భూమా: అధ్యాత్మ సంబంధములు అనేకములు (కలవు కనుక)

అనగా

ఇచట వక్త, ఉపదేష్ట అయిన ఇంద్రుడు తన ఆత్మను ఉపాసింపుమని ఉపదేశించెనని అనుట అయుక్తము.

ఏలననగా, పరబ్రహ్మకు సంబంధించిన అనేక విశేషణములు, విషయములు ఇక్కడ చెప్పబడెను.

**నేను:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** ఇంద్రుడు మొదట్లో "**మామేవ విజానీహి**" అంటూ నన్నే తెలుసుకోమని చెప్పి, ఆపై "**ప్రాణోస్మి, ప్రజ్ఞాత్మా, తమ్ మామ్ ఆయుః, అమృతమ్, ఇతి ఉపాస్స్వ**" అని నేను ప్రాణమును, ప్రజ్ఞాత్మను, నన్ను ఆయువుగను, అమృతస్వరూపుని గను ఉపాసింపుము" అని కదా చెప్పేడు. ఆ ఇంద్రుడు "**త్రిశీర్షాణామ్ త్వాష్ట్రమ్ అహనమ్..**" అని అంటూ త్వష్ట ప్రజాపతి పుత్రుడైన మూడు శిరములుగల విశ్వరూపుని(దేవ హవిర్భాగములు దానవులకీయుటచే ఒప్పలేక) నేనే వధించితిని" అని కూడా చెబుతాడు. నేనే చంపేను అన్నప్పుడు ఎవరు చంపేరు అంటే "ఇంద్రుడు" అనే కదా చెబుతాము. అలాగే "నన్ను ఉపాసించు" అన్నప్పుడు నన్ను కాదు ఇంద్రుడిని కాక మరొకరిని అని ఎలా అర్థం చెప్పుకుంటాం,

(వెనకటికెవరో, అక్కడ ఇల్లెవరు కట్టించేరు అంటే గొప్పకోసం నేనేనండీ అన్నాడుట, మరి కూలి పోయిందేమీ అంటే, మన చేతుల్లో ఏముందీ అంతా భగవంతుడే కదా చేసేది అన్నాడుట, సిమెంటులో ఇసుక పాలు ఎక్కువ వేసేనని ఒప్పుకోక, అలాగుంటుంది.)

పోనీ,  నన్ను ఉపాసించు అని చెప్పినప్పుడు "నన్ను" అన్న పదము లాక్షణికంగా ప్రయోగించేరు కాని నిజానికి అక్కడ "నన్ను" అన్నప్పుడు  "ఇంద్రుడు అని అర్థము కాదు" అనుకోడానికి ఇలాంటి "విధి నిషేధ వాక్యాలలో లాక్షణిక ప్రయోగము నిషిద్ధము" కదా, అంటే ఇది చేయుము, ఇది చేయకుము లాంటి వాక్యాలలో లాక్షణిక ప్రయోగము డొంక తిరుగుడుగా అర్థం చెప్పుకోకూడదు కదా, అందువలన ఇంద్రుడనే జీవుడే ఇక్కడ చెప్పబడుతున్నాడనీ, మిగిలిన విశేషణాలు అయిన "ఆనందః, అజరః, అమృతః" ఇత్యాదులు కూడా ఆ ఇంద్రుడనే జీవునికే వర్తిస్తాయని అంటే అది కుదరదు అంటున్నారు ఈ సూత్రములో.

**నేను:** ఎందుకని

**మామయ్య:** నేను, నన్ను అంటే ఏమిటి? ఎవళ్ళనుద్దేశించి?

**నేను:** నన్ను అన్నప్పుడు నన్ను ఉద్దేశించే, అదే జీవాత్మనే కదా!

**మామయ్య:** శరీరమెందుకు కాకూడదు.

**నేను:** నా శరీరము అంటున్నాము కదా, కనుక శరీరము కాదన్నమాట. అయినా శరీరము స్వతఃప్రతిపత్తి కాని అస్తిత్వము కాని లేనిది, ఆత్మ లేనిదే శరీరము లేదు, శరీరము ఆత్మపై ఆధారపడి ఉంటుంది, అందువలన శరీరమని చెప్పలేము

**మామయ్య:**అలాగే నా ఆత్మ అని కూడా అంటాము కదా. ఆత్మ కూడా స్వతంత్ర ప్రతిపత్తి కాని అస్తిత్వము కాని లేనిదే. "**అనేన ఆత్మనా అనుప్రవిశ్య నామ రూపే వ్యాకరవాణి**" అన్నట్లుగా చిత్తుకైనా,అచిత్తుకైనా అంతర్యామి గా పరమాత్మ లేకపోతే అస్తిత్వము లేనట్లే. నువ్వు శరీరము జీవాత్మపై ఆధారపడి ఉంటుందంటున్నావు కదా, అలాగే జీవాత్మ పరమాత్మ పై తన అస్తిత్వానికి ఆధారపడి ఉంటుంది. చక్రంలో

అంచు అరముల మీద ఆధారపడి ఉంటే ఆ అరములు నాభి మీద ఆధార పడి ఉన్నట్లు, ప్రకృతి అయినా, జీవాత్మైనా పరమాత్మ పైన ఆధార పడి యున్నవే. దానినే ప్రాణము అని అంటున్నారు ఇక్కడ. ప్రాణయతి ఇతి ప్రాణః అని కదా. జీవాత్మకైనా, ప్రకృతికైనా అస్తిత్వాన్ని కలిగించేది, ఆధార భూతమైనదినకనుక ఇక్కడ ప్రాణము అంటే పరమాత్మే అన్నమాట.

ఆ పరమాత్మనే ఆనందమయునిగాను, అజరునిగాను, అమృతునిగాను ఇలా వర్ణిస్తోంది ఉపనిషత్. జీవాత్మకైతే ఈ విశేషణాలేమీ వర్తించవు.

మనుష్యులకు ఎక్కువ ఏది హితమైనదో దానిని గూర్చి కదా ఇక్కడ చెప్పేది. అట్టిది మోక్షమే కావాలి. మోక్షమీయ గలవాడు పరబ్రహ్మ యే కావాలి. అందువలన మోక్షము కొఱకు ఉపాసింపబడువాడు కూడా పరబ్రహ్మయే కావాలి.

**"ఏష ఏవ సాధుకర్మ కారయతి తమ్ యమేభ్యో లోకేభ్య ఉన్నినీషతి ఏష ఏవాసాధుకర్మ కారయతి తమ్ యమధో నినీషతి"** అని శ్రుతి వాక్యము. అంటే "ఏ జీవునికి ఉత్కృష్ట గతిని పొందించడానికి సంకల్పిస్తాడో వానిచే సత్కర్మములను చేయించుచూ అతడే ఏ జీవునికి నికృష్టగతిని పొందించుటకు సంకల్పించునో వానిచే పాపకర్మలను చేయించువాడు పరమాత్మ" అని అర్థము. అంటే సర్వ కర్మలను చేయించువాడు పరమాత్మే కదా. దీనిని బట్టి కూడ ఇంద్ర, ప్రాణ శబ్దములచే చెప్పబడినవాడు పరమాత్మే అని తెలుస్తోంది.

**"ఏష లోకాధిపతిః ఏష సర్వేశః"** అను శ్రుతి వాక్యము ఈ శబ్ద వాచ్యుడు లోకాధిపతి అనిన్నీ, సర్వేశ్వరుడనీ చెబుతోంది. ఈ ధర్మాలు పరమాత్మకు తప్ప మరే చేతనాచేతనములకు వర్తించవు. అందువలన చేతనుడైన ఇంద్రుడనినా, అచేతనమైన ప్రాణ మనినా కూడా తదాధారభూతుడైన పరమాత్మకే ఆ శబ్దాలు వర్తిస్తాయి.

పైన శ్రుతిలో మనమనుకున్నట్లు, అజర, ఆనంద, అమృత, ప్రజ్ఞాత్మ మొదలైన విశేషణాలు పరమాత్మ కే వర్తిస్తాయి.

పై కారణాల వలన ఈ శ్రుతి వాక్యాలలో ఇంద్ర, ప్రాణ శబ్దవాచ్యుడు పరబ్రహ్మ యే.

అని వివరించేరు భగవద్రామానుజులు ఈ సూత్రానికి.

**నేను:** అలాగయితే ఇంద్రుడికి తాను జీవుడినని, తాను మోక్షమునీయ లేనని  తెలియదా, నన్ను ఉపాసించు అని ఎందుకు చెప్పేడు. ఊరికే గొప్ప కోసమా, లేక ...

**మామయ్య:** అది తెలుసుకోవాలంటే తరువాతి సూత్రాన్ని చూడాలి మఱి.

**అమ్మ:** ఏమిటి ఆ సూత్రం మామయ్యా!

**మామయ్య:**

## "శాస్త్ర దృష్ట్యాతు ఉపదేశో వామదేవవత్...1-1-31

తు: అది అయుక్తము("నన్ను" అన్న పదము జీవాత్మకు వర్తిస్తుంది అనుట)

శాస్త్ర దృష్ట్యా: శాస్త్ర పద్ధతిని బట్టి చూడగా

ఉపదేశః: స్వాత్మోపదేశము(అనగా తనను ఉపాసింపుమని చెప్పుట)

వామదేవవత్: వామదేవుడు చేసినట్లు(చేయబడినది).

అనగా ఇంద్రుడు తనను ఉపాసింపుమని చెప్పుట ఇతః పూర్వము వామదేవ మహర్షి పరబ్రహ్మానుభవము కల్గి "నేను మనువునైతిని, నేను సూర్యుడనైతిని" అని చెప్పినట్లు పరబ్రహ్మానుభవ స్థితి నుండి చెప్పుట అని తెలుసుకొన వలెను.

**నేను:** ఈ వామదేవుడెవరు మామయ్యా, ఈ పరబ్రహ్మానుభవ స్థితి అంటే ఏమిటి.

**మామయ్య:** ఇందాకా "అహమ్" అంటే ఏమిటి అని చర్చించుకుంటున్నాము కదా! ఈ అహమ్ మూడు స్థితులనుండి అనుభవించ వచ్చును. "స్థూలోహమ్" అని నేను లావుగా ఉన్నాను అన్నప్పుడు అక్కడ అహమ్ శరీరానికి వర్తిస్తుంది. మనలో చాలామందికి ఈ అహమ్ అనుభవము మన శరీర స్థితి నుండే కలుగుతూంటుంది. కాని కొంతమందికి అంటే ఈ శరీరము కంటె ఆత్మ వేరని నేను అంటే జీవాత్మను అనీ పరిపూర్ణంగా తెలుసుకొని ప్రవర్తించే యోగులకు, మునులకు ఈ "అహమ్" అనుభవము జీవాత్మ స్థితి గా కూడా సంభవము అవుతుంది. వారు తమకు శరీరమునకు కల భేదాన్ని స్పష్టంగా గుర్తించి ప్రవర్తిస్తారు. మన కాలంలో కూడా తమ శరీరానికి పూర్తిగా పురుగులు పట్టిపోయినా "ఆ పురుగులకు ఆహారము అవసరమయింది, అందుకోసం ఈ శరీరాన్ని ఆశ్రయించేయి" అంటూ చెప్పగలచిన యోగుల గురించి వింటోంటాము. వీరు జీవాత్మానుభవ స్థితి లో ఉంటూంటారన్నమాట. కాని అత్యంత అరుదైన సందర్భాలలో ఎక్కడో ఎవ్వరో "పరమాత్మానుభవ అహమ్" స్థితి కలిగి ఉండవచ్చు. జీవాత్మ పరమాత్మకు ఎప్పుడైనా విడిగా ఉండదు కదా, పరమాత్మ తోనే కలసి ఉంటుంది. పరమాత్మ వలననే అస్తిత్వము పొంది ఉంటుంది. అలాంటప్పుడు ఆ స్థితిలో జీవ విశిష్టమైన సాక్షాత్కారిత పరమాత్మానుభవాన్ని కలిగి ఉన్న స్థితి అన్నమాట పరమాత్మానుభవ స్థితి అంటే.

**నేను:** అర్థమయీ, అర్థమవనట్లు ఉన్నది. అలాంటి స్థితి సంభవమా, అలాంటి వారు ఎవరైనా ఉన్నారా,

**మామయ్య:** ఇబ్బంది ఏమిటంటే అలాంటి మహానుభావులకూ, మనూర్లో గంగులు అని పిచ్చివాడు ఒకడు ఉన్నాడు, అలాంటి వాళ్ళకూ మనకు తేడా తెలియదు. వాడు కూడా నేనే పరమాత్మను అంటూ ప్రేలాపన చేస్తూంటాడు. అట్టి వారే మనకు మామూలుగా తారస పడేవారు.

మనకు తెలిసినంత మట్టుకు వేద కాలంలో ఈ వామదేవ మహర్షి, పురాణకాలంలో ప్రహ్లాదుడు, ఈ కలి కాలంలో నమ్మాళ్వారు ఇలాంటి అనుభవం పొంది ఉన్నారట.

**నేను:** ఎలా చెబుతున్నారు?

**మామయ్య:** వామదేవ మహర్షి పరమాత్మానుభవము వలన నేను అనే శబ్దము చేత తన ఆత్మయే శరీరముగాగల పరమాత్మను సాక్షాత్కరించినవాడై, పరమాత్మను నిర్దేశించి "నేను మనువును, నేను సూర్యుడను, నేను కక్షీవంతుడను, బ్రహ్మ ఋషిని...." అని ఇలా చెప్పేడుట. దీనికి సంబంధించిన శ్రుతి వాక్యాలు

"తదేతత్ పశ్యన్ ఋషిః వామదేవః ప్రతిపేదే అహమ్ మనురభవమ్ సూర్యశ్చ అహమ్ కక్షీవాన్ ఋషిరస్మి విప్రః" అని.

ఇలాగే ప్రహ్లాదుడు పరమాత్మానుభవము వలన

"సర్వగత్వాదనంతస్య స ఏవాహమవస్థితః। మత్తః సర్వమహమ్ సర్వమ్ మయి సర్వమ్ సనాతనే" అని అనంతుడు అయిన సర్వేశ్వరుడు అన్నిటిలో ఉండడం వలన వాడే నేను, నానుండియే సర్వము కలుగు చున్నది. నేనే సర్వమును నాయందే సర్వమును కలదు" అని చెబుతాడు. అంటే ఆ స్థితిలో పరమాత్మానుభవాన్ని పొంది ఉన్నవాడన్న మాట.

ఇలాగే స్వామి నమ్మాళ్వార్ తిరువాయ్ మొళి లో "కడల్ జ్ఞానమ్..." అను దశకములో పరమాత్మానుభవాన్ని పొందేరు.

**నేను:** నమ్మాళ్వారు తప్ప మిగిలిన ఆళ్వార్లకు పరమాత్మానుభవాన్ని పొందలేదా!

**మామయ్య:** ఇక్కడ పరమాత్మానుభవము అంటే సరిగ్గా అర్థం చేసుకోవాలి. జీవాత్మ తో కూడిన పరమాత్మగా తనను తాను అనుభవాన్ని పొందడం. ఇలాంటి అనుభవం తిరుమంగై ఆళ్వార్లకు ఒక పాశురంలో వచ్చినట్లు కనబడుతుంది.

**నేను:** అంటే ఇలాంటి అనుభవం వస్తూ పోతూంటుందా.

**మామయ్య:** చెప్పేనుగా, ఇలాంటి అనుభవాన్ని కలిగిన వారు అత్యంత అరుదు అని. వారికి కూడా ఈ లీలా విభూతిలో ఉన్నంతకాలమూ తాత్కాలికమే. ఎందుకంటే ఈ లీలా విభూతి త్రిగుణాత్మకము. అందువలన అటువంటి అనుభవము నిలబడదు.

**నేను:** "అహమ్ బ్రహ్మాస్మి" అంటే ఇదే నన్నమాట. అంటే ఆ స్థితిలో మఱి ఈ అహమ్ అన్న జీవాత్మ పోయి బ్రహ్మ స్థితియే ఉంటుందా!

**మామయ్య:** "అహమ్ బ్రహ్మాస్మి" అంటే నేను బ్రహ్మ అయినాను. అని కదా. నేను ప్రధాన మంత్రి అయినాను అంటే నువ్వు చచ్చి పోయి ప్రధానమంత్రి మాత్రమే ఉంటాడని అర్థం కాదు కదా. నువ్వూ ఉంటావు, ప్రధానమంత్రి స్థితీ ఉంటుంది. నువ్వు ప్రధానమంత్రి స్థితిలో ఉంటావు అన్నమాట కొంచెం స్థూలంగా చెప్పాలంటే. Ofcourse,ఇది అంత సమమయిన దృష్టాంతము కాదనుకో, కాని అర్థం అవడానికి చెప్పేను. ఆ పరిస్థితిలో సాక్షాత్కారిత పరబ్రహ్మ యై, పరబ్రహ్మాత్మక స్థితిలో ఉంటారన్నమాట.

మనమింతకుముందు చదువుకున్నట్లు "అనేన జీవేన ఆత్మనా అనుప్రవిశ్య నామరూపే వ్యాకరవాణి" అంటే పరమాత్మ జీవ శరీరుడుగ అన్నిటిలో ప్రవేశించి నామరూప సిద్ధిని కలుగ జేయుచున్నాడని అన్నప్పుడు, నామరూప రహిత స్థితి సూక్ష్మ రూప స్థితి అన్నమాట.

అలాగే "ఐతదాత్మ్యమిదమ్ సర్వమ్" అను శ్రుతి వాక్యము ఇదంతయూ పరమాత్మయే ఆత్మగా కలది అని అర్థము చెబుతుంది.

"అంతః ప్రవిష్టః శాస్తా జనానామ్ సర్వాత్మా" అంటే పరమాత్మ అందరిలోను ప్రవేశించి జనులందరను నియమించుచున్నాడు అని చెబుతుంది.

"య ఆత్మని తిష్ఠన్ ఆత్మనః అంతరో యమాత్మా న వేద యస్యాత్మా శరీరమ్ య ఆత్మానమంతరో యమయతి" అనగా ఏ పరమాత్మ ప్రత్యగాత్మ యందున్నవాడై ప్రత్యగాత్మ చే తెలియబడక ప్రత్యగాత్మను శరీరము గా కలవాడై ప్రత్యగాత్మలోన నుండి నియమించుచున్నాడో అనిన్నీ

"ఏష సర్వ భూతాంతరాత్మా అపహత పాప్మా ....నారాయణః" అనగా సర్వేశ్వరుడు జీవులందరికీ ఆత్మ, అపహత పాప్మ...అనిన్నీ శ్రుతులు చెబుతున్నాయి.

ఇలా అనేములైన శ్రుతులు పరమాత్మ అంతర్యామిత్వాన్ని చెప్పడం వలన పరమాత్మకు, జీవాత్మకు శరీరి, శరీర భావమునూ, మామ్(నన్ను), అహమ్ (నేను) అన్నప్పుడు ఆ పదములు జీవాత్మ శరీరుడగు పరమాత్మ యందే పర్యవసించునన్న విషయము నిస్సంశయము.

ప్రస్తుత శ్రుతి వాక్యములో కూడ ఇంద్రుడు " మామ్ ఉపాస్వ" అని నప్పుడు "అహమ్ మనురభవమ్ సూర్యశ్చాహమ్..." అవును వామదేవమహర్షి పరమాత్మానుభవ స్థితి నుండి చెప్పినట్లు ఇంద్రుడు కూడ అట్టి స్థితి లోనుండి చెప్పినట్లు తెలుసుకోవాలి.

**నేను:** మఱి ఆ ఇంద్రుడే "త్వాష్ట్రుడిని నేనే చంపేను" అని తన పరాక్రమం చాటు కున్నప్పుడో

**మామయ్య:** అప్పుడు ఇంద్రుడు సామాన్య స్థితిలో ఉన్నాడన్న మాట. సాక్షాత్కారిత పరమాత్మానుభవస్థితిలో కాదు. చెప్పేను కదా ఈ పరమాత్మానుభవస్థితి ఈ లీలా విభూతిలో నున్న వారికి ఎవ్వరికైనా తాత్కాలికమేనని.

ఈ కారణం వలననే ఇంద్రుడు మదంతర్యామిని అనకుండా మామ్ అన్నాడన్న మాట.

**నేను:** అంటే ఇక్కడ ప్రాణము అని అచిత్పదార్థము, ఇంద్రుడు అని చిత్పదార్థమూ కూడా పరబ్రహ్మనే సూచిస్తాయన్న మాట. అంటే వాటినీ ఉపాసించ వచ్చన్న మాట.

**మామయ్య:** ఈ విషయం తరువాత సూత్రంలో వివరిస్తున్నారు.

**నేను:** ఏమిటా సూత్రం మామయ్యా!

**మామయ్య:**

**"జీవ ముఖ్య ప్రాణలింగాన్నేతి చేన్నోపాసాత్ త్రైవిధ్యాదాశ్రితత్వాత్ ఇహ తద్యోగాత్**.....1-1-32

అంటే

జీవ ముఖ్య ప్రాణ లింగాత్: జీవ చిహ్నములును, ముఖ్య ప్రాణ చిహ్నములును (శ్రుతి యందు కనబడుట వలన ఇచట),

న: (పరమాత్మ ఉపదేశింపబడుట) లేదు

ఇతిచేత్: ఇట్లు అన్నచో

న: అది అయుక్తము(ఏలననగా)

ఉపాసాత్రైవిధ్యాత్: ఉపాసనలు మూడు విధములైనందున

ఆశ్రితత్వాత్: అవి ఇచట ఉపదేశింప బడినందున

ఇహ: ఇచట

తద్యోగాత్: అట్టి త్రివిధోపాసనము కుదురుట వలన

అనగా

జీవుని చిహ్నములును, ముఖ్య ప్రాణము యొక్క చిహ్నములును ప్రస్తుత శ్రుతి యందు కనపడడం వలన పరమాత్మ ఇచట ఉపదేశింప బడలేదని అంటే అది అయుక్తము. ఎందుకంటే ఉపాసనము త్రివిధముగా చెప్పబడినది. అట్టి త్రివిధోపాసనము ఉపదేశింపబడుట ఇచట కుదురుతుంది కనుక.

**నేను:** కొంచెం వివరించండి మామయ్యా!

**మామయ్య:** మనము ఇంతకు ముందు అనుకున్నట్లు ఉపాసనా విధానాలు మూడు విధములు గా ఉండవచ్చును. "**భోక్తా భోగ్యమ్ ప్రేరితారమ్ చ మత్వా సర్వమ్ ప్రోక్తమ్ త్రివిధమ్ బ్రహ్మమ్ ఏతత్**" అని శ్వేతాశ్వతర ఉపనిషత్ సకల కారణభూతుడైన పరమాత్మ అంతర్యామిగా భోక్త అయిన జీవుని యందు, భోగ్య పదార్థమైన ప్రకృతి యందు ఉంటాడని చెబుతుంది కదా! అలా మూడు విధాల ఉపాసనలు ఏమిటంటే

1. నిఖిల కారణ భూతుడగు పరమాత్మను వాని స్వరూపముతో అనుసంధించడం ఒకటి. శ్రీరంగాది క్షేత్రాలలో గాని, మన ఇళ్ళలో గాని అర్చామూర్తిని అర్చించడం ఈ కోవలోకి వస్తుంది. అర్చారాధన అంటే ఆ మూర్తిలో అంతర్యామిగా నున్న పరమాత్మారాధన కాదు. అర్చా మూర్తియే పరమాత్మ.

2. భోక్తలగు జీవులు శరీరముగా గల పరమాత్మను ఉపాసించడం మరి యొకటి. రామాయణంలోచెట్లకు పూజించిన సందర్భాలు కూడా ఉన్నాయి కదా. అంటే ఆ చెట్టు అంతర్యామి అయిన పరమాత్మను ఉద్దేశించి పూజించడమన్నమాట. ఇక్కడ ఇంద్రుడన్నా అలాగే. తదుపాసన అంతర్యామి అయిన పరమాత్మ కే వర్తించి, ఇంద్ర శబ్దము పరమాత్మను తెలియ చేయుటలోనే పర్యవసిస్తుంది.

3. భోగ్య పదార్థములును, భోగోపకరణములును అయిన ప్రాకృతిక పదార్థములు శరీరముగా కల పరమాత్మను ఉపాసించుట.

మనకు కృష్ణావతారములో ఈ విషయం తెలిపే గోవర్ధనోద్ధరణ ఘట్టము గుర్తుకు తెచ్చుకో. అంతకు ముందు పూజలందుకుంటున్న ఇంద్రుడు ఆ పూజలు పరమాత్మ యందే పర్యవసిస్తాయన్న విషయం మరచి సామాన్య స్థితి లో తన జీవాత్మకే వర్తిస్తాయని తెలివి తక్కువగా ప్రవర్తించేడు. ఆ విషయం తెలియ చేయడానికి కృష్ణుడు ఇంద్రుడికి మాని గోవర్ధనగిరికి పూజ చేయుమన్నాడు. అంటే గోవర్ధన గిరికి అంతర్యామి అయిన పరమాత్మకు అన్నమాట. గోవర్ధనగిరి అచిత్పదార్థము కదా!

ఈ మూడు రకాల బ్రహ్మోపాసన ప్రకరణాంతరాలలో ఉపదేశింపబడింది.

**నేను:** ఎలా?

**మామయ్య:** "సత్యమ్ జ్ఞానమ్ అనంతమ్ బ్రహ్మ", ఆనందో బ్రహ్మ" ఇత్యాది శ్రుతులు పరబ్రహ్మ యొక్క స్వరూపోపాసనాన్ని ఉపదేశిస్తాయి.

**"తత్ సృష్ట్వా తదేవ అనుప్రావిశత్ సచ్చ త్యచ్చ అభవత్, నిరుక్తమ్ చ అనిరుక్తమ్ చ నిలయనమ్ చ అనిలయనమ్ చ విజ్ఞానమ్ చ అవిజ్ఞానమ్ చ సత్యమ్ చ అనృతమ్ చ సత్యమ్ అభవత్"** అనే శ్రుతి వాక్యము పరబ్రహ్మము జగత్తును సృష్టించి, దానిలోనే ప్రవేశించి మూర్తము, అమూర్తము అయిందని, నామనిష్కర్ష కలది, నామ నిష్కర్ష లేనిది గాను, ఆశ్రయముగా కలది, ఆశ్రయము లేనిది గాను, చేతనమును, అచేతనమును, నిర్వికార చేతనముగను, వికార సహిత జగత్తుగను అయిందని చెబుతూ, భోక్తలగు జీవులు శరీరము కల వానిగను, భోగ్య పదార్థములు, భోగోపకరణములు శరీరము కలవానిగను పరబ్రహ్మను ఉపాసించడం అనే ఈ రెండు విధాల ఉపాసనలను తెలుపుతోంది. ఈ శ్రుతి వాక్యాలు ఇంతకు ముందు వచ్చినవే కనుక మీకు విసుగు కలగకూడదని వివరాలలోకి వెళ్ళడం లేదు.

కాబట్టి ఏతావతా మూడు రకాలయిన ఉపాసనలూ శ్రుతి ప్రోక్తాలే.

చతుర్ముఖ బ్రహ్మ మొదలుకొని చెట్ల వంటి స్థావరాల దాకా చేతన పదార్థాలు గాని, అలాగే అచేతన పదార్థాలు గాని పరమాత్మకు వర్తించే గుణాలచేత చెప్పబడుతోందంటే ఆ శబ్దాలు అంతర్యామి అయిన పరమాత్మకే పర్యవసిస్తాయి.

ఒక ఇంటిలో నల్లటి వాడు, తెల్లటి వాడు, చామన చాయ వాడు ఉన్నారనుకో. ఒరేయ్ తెల్లోడా! అని పిలిస్తే నల్లటి వాడికీ, చామన చాయ వాడికీ ఆ పిలుపు వర్తించదు, తెల్లటి వాడికే వర్తిస్తుంది. అలాగే మన శరీర సంఘాతంలో ప్రాకృతిక మైన శరీర, మనస్సులు(మనస్సు పాంచ భౌతికం కాదు), జీవాత్మ, పరమాత్మ కలిసి ఉన్నాయి, ఒక ఇంట్లో మూడు రంగులున్న మనుష్యులు ఉన్నట్లు. అలాగే ఇంద్రుడు కూడా. అలాంటప్పుడు నేనే "అమృతుడిని" అన్నా, ప్రతర్దనుడు "ఓ అమృతుడా" అని పిలిచినా ఆ అమృతుడు అన్న వాడు పరమాత్మ, ఆ విశేషణ శబ్దాలన్నీ ఆయనకే పర్యవసిస్తాయి. జీవాత్మకో, శరీరానికో కాదు. ఒక పండుకి రంగు, రుచి ఉన్నట్లు పరమాత్మ వలననే అస్తిత్వాన్ని పొందుతూ పరమాత్మతో బాటే ఉండేవి ఈ జీవ, ప్రకృతులు.

**అమ్మ:** "ఆదిత్య హృదయమ్" లో మనము ఆదిత్యుడిని స్తోత్రము చేస్తున్నామంటే అక్కడ కూడా అది ఆ విశేషణాలు "పరమాత్మకే" వర్తిస్తుందన్న మాట.

**నేను:** మామయ్యా, ఏదో ఒక రకమైన ఉపాసనా పద్ధతి సరిపోదా, ఇలా మూడు రకాలు కావాలా?

**మామయ్య:** నాకు బతకడానికి carbo hydrates కావాలి. ఆ carbo hydrate మన శరీరానికివ్వడం కోసం ఏం తింటాము.

**నేను:** ఏదయినా, అంటే వరి అన్నము కాని, గోధుమలు కాని, మరొక రకమైన ధాన్యపు పదార్థాలు కాని..

**మామయ్య:** ఏదో ఒకటి ఉంటే సరిపోదా, ఇలా రక రకాల ధాన్యాలు ఎందుకు

**నేను:** కొందరికి కొన్ని రుచించ వచ్చు, లేదా కొందరికి కొన్ని లభ్య మవ వచ్చు, లేదా కొందరికి వారి శరీరానికి కొన్ని రకాల ధాన్యాలకే తిని జీర్ణించుకోగల సామర్థ్యము ఉండవచ్చు, లేదా వారి అవ సరాలు వేరుగా ఉండవచ్చును, అంటే అత్యవసర పరిస్థితిలో గ్లూకోసు తీసుకోవలసి ఉంటుంది కదా, అలాగు...

**మామయ్య:** నువ్వు చెప్పిన కారణాలే ఇక్కడా వర్తిస్తాయి. ఒకే carbo hydrate రక రకాల ధాన్యాలలో ఉన్నట్లు కరుణామయుడైన పరమాత్మ  ఎక్కడ పడితే అక్కడ ఉండి మన సదుపాయం కోసం, మన ఇష్టాన్ని, ప్రవృత్తినీ అనుసరించి ఉపాసించుకునేందుకు అవకాశమిచ్చేడన్న మాట. ఎవరికెటువంటి అనుభవం ఇష్టమవుతుందో, అనుభవం కలుగుతుందో తెలియదు కూడ. ఉదాహరణకు అర్చామూర్తులలో నాకు శ్రీనివాసుడంటే ఇష్టం కావచ్చును. మరొకరికి రంగనాథుడంటే ఎక్కువ మక్కువ ఉండవచ్చును. అలాగే నాకు

సౌలభ్యము అనే ఒక పరమాత్మ గుణము ఎక్కువ నచ్చవచ్చును. మరొకరికి స్వామిత్వము అనే మరొక గుణం మీద మనసు కలుగ వచ్చును. అందుకోసమే ఇన్ని బ్రహ్మ విద్యలు.

**నేను:** అలాగయితే ఒక బ్రహ్మ విద్యలో ఎక్కువ ఫలితం, మరొక బ్రహ్మ విద్యలో తక్కువ ఫలితం ఉంటాయా!

**మామయ్య:** అలాగేమీ లేదు. అన్నిటికీ ఫలితం ఒక్కటే. పరమాత్మ ప్రాప్తి సమానమే. ఈ వివరాలు ఇంకా తరువాత "వికల్ప అవిశిష్ట ఫలత్వాత్" వంటి సూత్రాలలో భగవద్రామానుజులు వివరిస్తారు.

**అమ్మ:** బాగుంది మామయ్యా! "ప్రతర్దన విద్య సందర్భంలో చెప్పబడిన ఇంద్ర, ప్రాణ శబ్దాలు పరమాత్మ కే చెందుతాయని, ఇంద్రుడు ఈ సందర్భంలో "నన్ను ఉపాసింపుము, నేను ప్రాణమును, అమృతమును.." అంటూ పలికినప్పుడు ఆ అమృతత్వము వంటి విశేషణాలు పరమాత్మకే చెందుతాయి కనుక ఆ సందర్భంలో ఇంద్రుడు వామదేవుని వలె సాక్షాత్కృత పరమాత్మానుభవస్థితినుండి పలుకుచున్నట్లు అర్థం చేసుకోవాలనీ, పరమాత్మ జీవ, ప్రకృతులకు అంతర్యామి గానుండి జీవ, ప్రకృతులు పరమాత్మ విశిష్టము గా నున్నందున పరమాత్మ స్వరూపోపాసనము, చిచ్ఛరీరక పరమాత్మోపాసనము, అచిచ్ఛరీరక పరమాత్మోపాసనము అని మూడు విధములుగా ఉపాసనము శ్రుతి ప్రోక్తమనీ అర్థమయేటట్లు బాగా చెప్పేరు.

**మామయ్య:** వరదరాజ పంచాశత్ లోని ఈ శ్లోకము ఈ ఇంద్ర ప్రాణాధికరణాన్ని అర్థం చేసుకుందికి పనికి వస్తుందమ్మా

**అమ్మ:** ఏమిటి మామయ్యా!

**మామయ్య:**

"బ్రహ్మేతి శంకర ఇతీంద్ర ఇతి స్వరాట్

ఆత్మేతి సర్వమితి సర్వ చరాచరాత్మన్।

హస్తీశ! సర్వ వచసామ్ అవసాన సీమామ్

త్వామ్ సర్వ కారణమ్ ఉశంతి అనపాయ వాచః।।

అర్థమయిపోయే ఉంటుంది, అయినా క్లుప్తంగా చెబుతాను.

ఓ హస్తీశ! (చతుర్ముఖ) బ్రహ్మ అనీ, శంకరుడనీ, ఇంద్రుడనీ, స్వరాట్ అనీ, ఆత్మ అనీ, సర్వమూ అనీ ఈ అన్ని పదాలూ చరాచరములన్నిటికీ అంతర్యామి గానున్న నీ యందే చివరకు పర్యవసిస్తాయి, నీవే నిఖిల జగత్కారణము అని శ్రుతులు నొక్కి వక్కాణిస్తున్నాయి.

**అమ్మ:** ఎంత చక్కగా చెప్పేరో. ఎంతయినా వేదాంత దేశికులు, వేదాంత దేశికులే, గగనమ్ గగనాకారమ్ అన్నట్లు.

**మామయ్య:** ఇంతటితో ఈ అధికరణము, మొదటి అధ్యాయములో ప్రథమ పాదము పూర్తి అయినాయి అమ్మా, భగవద్రామానుజుల దయ వలన.

**నాన్నగారు:** బావా, ఒక సారి ఈ ప్రథమపాదంలో అధికరణాల తాత్పర్యము క్లుప్తంగా నాకర్థమయినట్లు చెబుతాను. సమంగా ఉన్నదో లేదో చెప్పు.

జిజ్ఞాసాధికరణము లో శాశ్వత ఫలంకోసం అవసరమైన బ్రహ్మ జిజ్ఞాస వేదాంత జ్ఞానము వలన సాధ్యమనీ

జన్మాద్యధికరణములో జన్మాదులు ఎవరి వలన కలుగుతున్నాయో ఆయనే బ్రహ్మ అని ఉపనిషత్తులవలన తెలుస్తోంది అనీ

శాస్త్రయోనిత్వాధికరణములో బ్రహ్మను తెలుసుకొనుట శాస్త్రముల ద్వారా మాత్రమే సాధ్యమనీ

సమన్వయాధికరణము లో వివిధ వేదాంత వాక్యముల సమన్వయముతో బ్రహ్మను తెలుసుకొనుటయే పరమావధి అనీ

ఈక్షత్యధికరణములో జగత్కారణుడైన బ్రహ్మ ప్రకృతి కన్న భిన్నుడనీ

ఆనందమయాధికరణము లో జగత్కారణుడైన బ్రహ్మ జీవాత్మ కంటే భిన్నుడనీ

అంతరాధికరణములో పరబ్రహ్మ దివ్య

శరీరమునకు కర్మ కారణము కాదని, అది స్వాభావికమైనదనీ

ఆకాశాధికరణము లో ఆకాశ విద్య, ప్రాణ విద్య అనే బ్రహ్మ విద్యలలో ప్రాణము అనీ, ఆకాశమనీ చెప్పబడినది జగత్కారణుడైన పరబ్రహ్మే అని

జ్యోతిరధికరణము లో జ్యోతిర్విద్య, గాయత్రి విద్య అనే బ్రహ్మ విద్యలలో జ్యోతి అనీ గాయత్రి అనీ చెప్పబడినది కూడా జగత్కారణుడైన పరబ్రహ్మే అనీ

ఇంద్రప్రాణాధికరణము లో ప్రతర్దన విద్య లో ఇంద్రుడు, ప్రాణము అన్న శబ్దాలు పరబ్రహ్మకే వర్తిస్తాయి అనీ

పరమాత్మోపాసనము చిచ్ఛరీరక, అచిచ్ఛరీరక, పరమాత్మ స్వరూప ఉపాసనలని మూడు విధాలుగా ఉండవచ్చుననీ

నాకు అర్థం అయింది

**మామయ్య:** నీ మీద భగవద్రామానుజుల అనుగ్రహము పరిపూర్ణంగా ఉంది. చక్కగా చెప్పేవు.

ఇంక ఆరోజుకు ఆపుదాము. తరువాత ఎప్పుడైనా చూద్దాము.

**అందరూ:** "యో నిత్యమచ్యుత పదాంబుజ...."

---